అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 23-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 సంచిక : 293

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

ఆర్ఎస్ఎస్ అంటే రాష్ట్రీయ సర్వనాశన సమితి

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్



న్యూఢిల్లీ : ఆర్ఎస్ఎస్ అంటే 'రాష్ట్రీయ సర్వనాశన సమితి' అని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. ఈ దేశంలో అన్ని వర్గాలను, విశ్వాసాలను గౌరవించే మతం, సంస్కృతి ఉందన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా చేసిన వ్యాఖ్యలను బృందాకరత్ ఆదివారం తప్పుబట్టారు. అలాగే, ఆర్ఎస్ఎస్ అంటే 'రాష్ట్రీయ సర్వనాశన సమితి' అని వివరణ ఇచ్చారు. ఆదివారం ఎఎన్ఐతో మాట్లాడుతూ బృందకరత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ తాను చెప్పిన సూత్రాన్ని తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. భారతదేశ యొక్క 'మిశ్రమ సంస్కృతి' విలువలు, సూత్రాలపై ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారు దాడి చేస్తున్నారని ఆరోపించారు.

'ప్రతిరోజూ, సంఘ్‌పరివార్ పేరుతో ఆర్ఎస్ఎస్ నాయకులు, వారి కుటుంబ సభ్యులు ప్రజలను, ఇతర మతాలను దూషిస్తున్నారు. ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఆర్ఎస్ఎస్‌కు విలువలు, సూత్రాలపై నమ్మకం ఉంటే సంస్థకు చెందిన ఇతరులు ఇతర మతాలకు చెందిన వ్యక్తులపై దాడి చేయడంపై మోహన్ భగవత్ సమాధానం చెప్పాలి' అని బృందాకరత్ డిమాండ్ చేశారు.

ప్రస్తుతం జరుగుతున్న ఇజ్రాయిల్-హమాస్ యుద్ధంతో భారత్‌లోని హిందూయిజంను భగవత్ పోల్చారు. 'హిందూయిజం అందర్ని గౌరవిస్తుంది. భారత్ ఎప్పుడూ ఇలాంటి యుద్ధాన్ని చూడదు' అని అన్నారు. మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగి 350 ఏండ్లు పూర్తయిన సందర్భంగా శనివారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఈ దేశంలో అన్ని మతాలను, విశ్వాసాలను గౌరవించే సంస్కృతి ఉంది. ఆ మతమే హిందూయిజం' అని అన్నారు. అలాగే, భారతదేశం హిందువుల దేశమని, అంటే అన్ని ఇతర మతాలను మేం తిరస్కరిస్తామని అని అర్థం కాదని కూడా అన్నారు. హిందువులు ప్రతి మతాన్ని రక్షించారని, అనేక మతాల అనుచరులు ...13లో

ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైనం

కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు

లక్ష్మిబ్యారేజీలోనూ నాణ్యతా రాహిత్యమే

- యాసంగి సాగు, తాగునీటికి ఇబ్బందే
- సాధారణ కట్టడంతోనే సమస్యలు
- బేస్‌మెంటులో 'సీసం' లేదంటున్న సాగునీటిరంగ నిపుణులు
- భారీ నిల్వలతోనూ కావొచ్చు
- వేగంగా చర్యలు: ఎల్అండ్‌టీ
- స్పందించని సర్కారు



కుంగిన లక్ష్మిబ్యారేజీ వంతెన ...(ఇన్‌సెట్లో పిల్లర్లకు పగుళ్లు)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్ఎస్ సర్కారు నిర్మించిన మెగా ప్రాజెక్టు కాళేశ్వరంపై భ్రమలు విడుతున్నాయి. ఒక్కొక్కటిగా నిర్మాణ లోపాలు బయటపడుతున్నాయి. సర్కారు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుకు చెదలు పట్టినట్టయింది. నాణ్యతారాహిత్యం స్పష్టమవుతున్నది. సుదీర్ఘ కాలంపాటు నిర్మాణం చోటుచేసుకున్నా పరిస్థితి దారుణంగా మారటం అనుమానాలకు తావిస్తున్నది. అవినీతి, అవకతవకలకు జరిగిందనడానికి లక్ష్మీ బ్యారేజీ నిర్మాణమే సాక్ష్యమని సాగునీటిరంగ నిపుణులు అంటున్నారు. కడెం ప్రాజెక్టు మినహా మరే ప్రాజెక్టు ఇప్పటి వరకూ కూలిపోలేదు. ఇప్పుడు కాళేశ్వరం ...13లో

బ్యారేజీపై బెంబేలు

మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ కుంగుబాటుపై విచారణ

- అంతర్రాష్ట్ర సరిహద్దును మూసివేసిన అధికారులు
- నెలరోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తాం : రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు
- టెక్నికల్ వైఫల్యం కనిపిస్తోంది : ఎమ్మెల్యే శ్రీధర్ బాబు
- కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి : ఈటల రాజేందర్



వివరాలు 3లో..


హన్మకొండ పద్మాక్షి దేవాలయం వద్ద సద్దుల బతుకమ్మ సందడి

కల్వకుంట్ల ఫ్యామిలీకి కాళేశ్వరం ఏటీఎం

- బ్యారేజ్ కుంగడానికి నాణ్యత లోపమే కారణం : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్



నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్ట్ కు సంబంధించిన మేడిగడ్డ బ్యారేజ్ ప్రమాదానికి కేసీఆర్ కుటుంబమే కారణమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిలో మొదటి దోషి కల్వకుంట్ల కుటుంబమే అని ధ్వజమెత్తారు. నాణ్యత లోపం వల్ల మేడిగడ్డ ప్రమాదం జరిగిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని డొల్లతన, నిజస్వరూపం ఇప్పుడు బయటపడిందన్నారు. ఆదివారం నాడిక్కడ జరిగిన స్క్రీనింగ్ కమిటీ భేటీ తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'కాళ్లేశ్వరం ...13లో

జూరాల ఆగ్రో ఇథనాల్ కంపెనీపై ప్రజాగ్రహం

వ్యర్థాలను తరలిస్తున్న ట్యాంకర్స్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

- వ్యర్థాలతో పంటలు, చెరువుల్లోని నీరు కలుషితం
- ఆందోళనకారులపై లాఠీచార్జి
- ఆగ్రహంతో పోలీసుల వాహనాలు ధ్వంసం

వివరాలు 13లో

నిరుద్యోగులకు బీఆర్ఎస్ ధోకా!



- అమలుకు నోచుకోని గత ఎన్నికల హామీ
- ఐదేండ్లలోనూ ఇవ్వని 'నిరుద్యోగ భృతి'
- ఉద్యోగాల భర్తీ అంతంతే
- యువత ఆశలు ఆవిరి
- ఈసారి మహిళల ఓట్లకు వల
- సౌభాగ్యలక్ష్మి పేరుతో నెలకు రూ.3 వేల భృతి

వివరాలు 3లో

బీజేపీలో అసంతృప్త రాగాలు

- రాజగోపాల్‌రెడ్డి అటా? ఇటా?
- పాలమూరులో డీకే వర్సెస్ జితేందర్‌రెడ్డి
- పద్మకు టికెట్ కేటాయింపుతో అలిగిన రాకేశ్‌రెడ్డి
- అధిష్టానాన్ని నిలదీస్తున్న టికెట్లు దక్కని నేతలు
- సర్దిచెప్పలేక తల పట్టుకుంటున్న రాష్ట్ర నాయకత్వం

వివరాలు 5లో

కివీస్‌ను కొట్టేశారు

- ఛేదనలో విరాట్ కోహ్లి దూకుడు
- షమి ఐదు వికెట్ల ప్రదర్శన
- కివీస్‌పై భారత్ ఘన విజయం

వివరాలు 2లో



ఒకే ఒక్కడు..షమి

ధర్మశాల : ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో తొలి నాలుగు మ్యాచులకు బెంచ్‌కు పరిమితమైన మహ్మద్ షమి.. అవకాశం దక్కిన ధర్మశాలలో దుమ్మురేపాడు. న్యూజిలాండ్‌పై ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన షమి (5/54) ప్రపంచకప్‌లో ఈ ఘనత సాధించిన రెండో భారత బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా భారత బౌలర్లకు ఇది తొమ్మిదో ఐదు వికెట్ల ప్రదర్శన కాగా.. మహ్మద్ షమి 2019 ప్రపంచకప్‌లోనూ ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. షమి సహా ఆశీష్ నెహ్రా (2003), వెంకటేశ్ ప్రసాద్ (1999), రాబిన్ సింగ్ (1999), యువరాజ్ సింగ్ (2011), కపిల్ దేవ్ (1983) ప్రపంచకప్ మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్లు.

కివీస్‌ను కొట్టేశారు

ఛేదనలో మొనగాడు మళ్లీ చెలరేగాడు. అగ్రజట్టు న్యూజిలాండ్ పేసర్లపై దండెత్తాడు. విరాట్ కోహ్లి (95), రోహిత్ శర్మ (46) మెరవటంతో న్యూజిలాండ్‌పై భారత్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ప్రపంచకప్ గ్రూప్ దశలో వరుసగా ఐదో విజయం నమోదు చేసిన టీమ్ ఇండియా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. డార్లీ మిచెల్ (130) సెంచరీతో తొలుత న్యూజిలాండ్ 273 పరుగులు చేయగా.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ షమి (5/54) ఐదు వికెట్ల ప్రదర్శనతో విజృంభించాడు.

- ఛేదనలో విరాట్ కోహ్లి దూకుడు
- షమి ఐదు వికెట్ల ప్రదర్శన
- కివీస్‌పై భారత్ ఘన విజయం

నవతెలంగాణ-ధర్మశాల

ఐదుకు ఐదు. ప్రపంచకప్ గ్రూప్ దశలో ఆతిథ్య భారత్ ఐదేసింది. ఆసీస్, అఫ్గాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్.. ఇప్పుడు న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. గ్రూప్ దశలో ఐదు విజయాలతో సెమీఫైనల్స్ స్థానం దాదాపు కైవసం చేసుకుంది. ధర్మశాలలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై భారత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 274 పరుగుల ఛేదనలో విరాట్ కోహ్లి (95, 104 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోహిత్ శర్మ (46, 40 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (39 నాటౌట్, 44 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) కదం తొక్కారు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 273 పరుగులు చేసింది. డార్లీ మిచెల్ (130, 127 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లు), రచిన్ రవీంద్ర (75, 87 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భారత పేసర్ మహ్మద్ షమి (5/54) ఐదు వికెట్లు తీసుకున్నాడు.

విరాట్ దూకుడు

ఛేదనలో ఓపెనర్లు అదరగొట్టారు. రోహిత్ (46), గిల్ (26) అదిరే ఆరంభం అందించారు. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లు కొట్టిన రోహిత్ అర్థ సెంచరీ ముంగిట వికెట్ కోల్పోగా.. కాసేపటికే గిల్ సైతం పెవిలియన్ దారి పట్టాడు. ఈ సమయంలో విరాట్ కోహ్లి (95) సమయోచిత ఇన్నింగ్స్‌తో మెప్పించాడు. శ్రేయస్ అయ్యర్ (33), కెఎల్ రాహుల్ (27), రవీంద్ర జడేజా (39 నాటౌట్)లు కోహ్లికి చక్కటి సహకారం అందించారు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్తో 60 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన విరాట్ కోహ్లి.. వన్డేల్లో శతకం నం.49కు ఐదు పరుగుల దూరంలో వికెట్ కోల్పోయాడు. భారత్ విజయానికి, కోహ్లి శతకానికి ఐదు పరుగులు అవసరమైన దశలో సిక్సర్ కోసం ప్రయత్నించిన కోహ్లి క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. మహ్మద్ షమి (1 నాటౌట్) తోడుగా జడేజా లాంఛనం ముగించాడు.

డార్లీ మిచెల్ శతకం

టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. ధర్మశాల పిచ్‌పై పవర్‌ప్లేలో భారత పేసర్లు చెలరేగారు. డెవాన్ కాన్వే (0)ను సిరాజ్ డకౌట్ చేయగా.. విల్ యంగ్ (17)ను షమి సాగనంపాడు. దీంతో 19 పరుగులకే కివీస్ ఓపెనర్లను కోల్పోయింది. ఈ దశలో రచిన్ రవీంద్ర (75), డార్లీ మిచెల్ (130) కివీస్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. మూడో వికెట్‌కు 159 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఆరంభంలోనే ఓపెనర్లను అవుట్ చేసిన భారత్.. రవీంద్ర, మిచెల్‌కు జీవనదానాలు అందించింది. డీఆర్ఎస్ సైతం కివీస్‌కు కలిసొచ్చింది. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 56 బంతుల్లో రవీంద్ర అర్థ సెంచరీ నమోదు చేయగా.. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో డార్లీ మిచెల్ 60 బంతుల్లో అర్థ శతకం సాధించాడు. రచిన్, డార్లీ క్రీజులో పాతుకుపోయినా.. రన్‌రేట్ మాత్రం సాధారణంగా సాగింది. ఇది భారత్‌కు కలిసొచ్చింది. రచిన్ నిష్క్రమించినా.. రవీంద్ర శతక విన్యాసం చేశాడు. ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 100 బంతుల్లో వంద పూర్తి చేశాడు. గ్లెన్ ఫిలిప్స్ (23) ఒక్కడే లోయర్ ఆర్డర్‌లో మెప్పించాడు. టామ్ లేథమ్ (5), మార్క్‌చాప్‌మాన్ (6), మిచెల్ శాంట్నర్ (1), మాట్ హెన్రీ (0), లాకీ ఫెర్గుసన్ (1) తేలిపోయారు. ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడిన మహ్మద్ షమి ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. కుల్దీప్ యాదవ్ (2/73), బుమ్రా (1/45), సిరాజ్ (1/45) రాణించారు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : డెవాన్ కాన్వే (సి) అయ్యర్ (బి) సిరాజ్ 0, విల్ యంగ్ (బి) షమి 17, రచిన్ రవీంద్ర (సి) గిల్ (బి) షమి 75, డార్లీ మిచెల్ (సి) కోహ్లి (బి) షమి 130, టామ్ లేథమ్ (ఎల్బీ) కుల్దీప్ 5, గ్లెన్ ఫిలిప్స్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 23, మార్క్ చాప్‌మాన్ (సి) కోహ్లి (బి) బుమ్రా 6, మిచెల్ శాంట్నర్ (బి) షమి 1, మాట్ హెన్రీ (బి) షమి 0, లాకీ ఫెర్గుసన్ రనౌట్ 1, ట్రెంట్ బౌల్ట్ నాటౌట్ 15, ఎక్స్‌ట్రాలు : 15, **మొత్తం : (50 ఓవర్లలో ఆలౌట్) 273.**

వికెట్ల పతనం : 1-9, 2-19, 3-178, 4-205, 5-243, 6-257, 7-260, 8-260, 9-273, 10-273.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 10-1-45-1, మహ్మద్ సిరాజ్ 10-1-45-1, మహ్మద్ షమి 10-0-54-5, రచిన్ రవీంద్ర 10-0-48-0, కుల్దీప్ యాదవ్ 10-0-73-2.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (బి) ఫెర్గుసన్ 46, శుభ్‌మన్ గిల్ (సి) మిచెల్ (బి) ఫెర్గుసన్ 26, విరాట్ కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 95, శ్రేయస్ అయ్యర్ (సి) కాన్వే (బి) బౌల్ట్ 33, కెఎల్ రాహుల్ (ఎల్బీ) శాంట్నర్ 27, సూర్యకుమార్ యాదవ్ రనౌట్ 2, రవీంద్ర జడేజా నాటౌట్ 39, షమి నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం : (48 ఓవర్లలో 6 వికెట్లకు) 274.**

వికెట్ల పతనం : 1-71, 2-76, 3-128, 4-182, 5-191, 6-269.

బౌలింగ్ : ట్రెంట్ బౌల్ట్ 10-0-60-1, మాట్ హెన్రీ 9-0-55-1, మిచెల్ శాంట్నర్ 10-0-37-1, లాకీ ఫెర్గుసన్ 8-0-63-2, రచిన్ రవీంద్ర 9-0-46-0, గ్లెన్ ఫిలిప్స్ 2-0-12-0.

కమ్మేసిన మంచు

భారత్, కివీస్ మ్యాచ్‌కు మంచుతో కూడిన మేఘాలు అంతరాయం కలిగించాయి. భారత ఇన్నింగ్స్ 15వ ఓవర్లో మంచు మేఘాలు మైదానంలోకి ప్రవేశించాయి. ఫీల్డ్ అంపైర్లు సహా కివీస్ కెప్టెన్‌తో విరాట్ ఈ విషయంపై మాట్లాడటం కనిపించింది. ఆ తర్వాతి ఓవర్లో పరిస్థితి మరింత దిగజారింది. గ్రౌండ్‌ను పూర్తిగా మంచు కమ్మేయగా..ఒకరికొకరు కనిపించని పరిస్థితి ఏర్పడింది. అంపైర్లు మ్యాచ్‌ను పది నిమిషాలు పాటు నిలిపివేశారు. గ్రౌండ్‌ను వీడిన ఆటగాళ్లు.. పరిస్థితి చక్కబడిన తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టారు. అనూహ్య అంతరాయంతో ఇన్నింగ్స్‌లో డ్రింక్స్ విరామానికి ఒకసారికే పరిమితం చేశారు.

కొనసాగిన అవుట్‌ఫీల్డ్ కష్టాలు

భారత్‌లో అత్యంత సుందర మైదానం ధర్మశాల. మంచు కొండల అంచున క్రికెట్ మ్యాచ్ చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపిస్తారు. చూసేందుకు అభిమానులకు అద్భుతంగా ఉన్నప్పటికీ.. ఆడేందుకు ఆటగాళ్లకు అనువైన పరిస్థితులు లేవు!. ఇక్కడ తడితో కూడిన అవుట్ ఫీల్డ్‌తో క్రికెటర్లు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపేందుకు ప్రయత్నిస్తూ గాయాల బారిన పడుతున్నారు. క్రికెటర్లు అవుట్‌ఫీల్డ్‌పై ఫిర్యాదు చేసినా.. నిర్వాహకులు పెద్దగా మార్పులు చేయలేదు. కివీస్‌తో మ్యాచ్‌లో మిడ్ ఆఫ్‌లో ఫీల్డింగ్ చేస్తూ రోహిత్ శర్మ సైతం గాయం ప్రమాదం అంచున నిలిచాడు. వెంటనే మైదానాన్ని వీడిన రోహిత్.. మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. అవుట్‌ఫీల్డ్ బాగాలేకపోవటంతో ఫీల్డింగ్ ఇరు జట్లకు ఇబ్బందికరంగా మారింది.



పాక్‌కు స్పిన్ సవాల్

- నేడు అఫ్గాన్‌తో బాబర్ సేన ఢీ



చెన్నై : 2023 ఐసీసీ ప్రపంచకప్ రసవత్తరంగా మారుతోంది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌ను అఫ్గనిస్థాన్ ఓడించగా, ధనాధన్ దంచికొడుతున్న దక్షిణాఫ్రికాను నెదర్లాండ్స్ మట్టికరిపించింది. చిన్న జట్లు అద్భుత ప్రదర్శనతో అభిమానుల దృష్టిని తమవైపునకు తిప్పుకుంటున్నాయి. ఇంగ్లాండ్‌ను ఓడించిన అఫ్గనిస్థాన్ నేడు చెపాక్‌లో పాకిస్థాన్‌పై సైతం విజయం సాధించాలనే సంకల్పంతో కనిపిస్తోంది. స్పిన్ స్వర్గధామం చెపాక్‌లో అఫ్గనిస్థాన్ స్పిన్ త్రయం రషీద్ ఖాన్, ముజీబ్ రెహమాన్, మహ్మద్ నబిలు అత్యంత ప్రమాదకరం కానున్నారు. గత మ్యాచ్‌లో ఇక్కడే ఆస్ట్రేలియా చేతిలో ఓడిన పాకిస్థాన్‌కు నేడు తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు మ్యాచుల్లో రెండే విజయాలు సాధించిన పాకిస్థాన్.. మరో మ్యాచ్‌లో ఓడితే సెమీఫైనల్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకోగలదు. ఇదే సమయంలో అఫ్గనిస్థాన్‌కు ఓ ఓటమి ఆ జట్టును టాప్-4 రేసు నుంచి నిష్క్రమించేలా చేస్తుంది. దీంతో నేడు అఫ్గనిస్థాన్, పాకిస్థాన్ మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెరిగింది.


స్పిన్ పిచ్‌పై పాక్ పేసర్ షహీన్ అఫ్రిది అదరగొట్టాడు. పరుగుల వరద పారిన మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనకు తోడు ఆకట్టుకునే ఎకానమీ సాధించాడు. ఆసీస్‌తో మ్యాచ్‌కు వాడిన పిచ్‌నే నేటి మ్యాచ్‌కు సైతం వాడుతున్నారు. దీంతో అఫ్రిది మరోసారి పాకిస్థాన్‌కు కీలకం కానున్నాడు. షాదాబ్ ఖాన్, మహ్మద్ నవాజ్‌లు పాక్‌కు ఆశించిన మాయజాలం చేయటం లేదు. కెప్టెన్ బాబర్ ఆజమ్ బ్యాట్‌తో నిరాశపరుస్తున్నాడు. మహ్మద్ రిజ్వాన్ నిలకడగా మెప్పిస్తున్నా.. సహచర బ్యాటర్ల నుంచి మద్దతు లభించటం లేదు. షకీల్, షఫీక్‌లు ఆరంభంలో ఆరంభంలో చూపిన తెగువ ఇప్పుడు చూపించటం లేదు. ఇటీవల అఫ్గనిస్థాన్‌తో మ్యాచ్ సైతం పాకిస్థాన్‌కు భావోద్వేగ సమరంగా మారింది. దీంతో ఇటు అఫ్గనిస్థాన్‌కు, అటు పాకిస్థాన్‌కు నేడు చెపాక్‌లో విజయమే లక్ష్యం. అఫ్గనిస్థాన్, పాకిస్థాన్ ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కానుంది.

టాప్లీకు గాయం

ప్రపంచకప్‌కు దూరమైన ఇంగ్లాండ్ పేసర్



ముంబయి : ఐసీసీ ప్రపంచకప్ డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌కు టైటిల్ నిలుపుకునే క్రమంలో ఇక్కట్లు తప్పటం లేదు. ఆరంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన ఇంగ్లాండ్.. అఫ్గనిస్థాన్ చేతిలో చారిత్రక పరాజయంతో సరిపెట్టుకోలేదు. ముంబయి వాంఖడెలో దక్షిణాఫ్రికా చేతిలో 229 పరుగుల తేడాతో వన్డే చరిత్రలోనే దారుణ పరాజయం ఇంగ్లాండ్ మూటగట్టుకుంది. ఇప్పుడు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా.. ఇంగ్లాండ్ తరఫున ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన చేసిన పేసర్ రీసీ టాప్లే గాయానికి గురయ్యాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో రీసీ టాప్లే ఎడమ చేతి బొటనవేలికి గాయమైంది. వైద్య పరీక్షల్లో టాప్లే బొటన వేలి ఎముక విరిగిందని తేలింది. టాప్లే స్థానంలో మరో పేసర్‌ను ఇంగ్లాండ్ త్వరలోనే ప్రకటిస్తుందని ఆ జట్టు బౌలింగ్ కోచ్ వెల్లడించాడు. మోచేతి గాయం నుంచి కోలుకున్న జోఫ్రా ఆర్చర్ అందుబాటులో ఉన్నప్పటికీ.. అతడిని ఎంపిక చేసే అవకాశాలు లేవని తెలుస్తోంది.



కేంద్రం చేతిలో రాష్ట్రాల గుట్టు

- తెరపైకి కొలాబ్ ఫైల్స్ సాఫ్ట్‌వేర్
- రాష్ట్ర సమాచారం ఇకపై ఇందులో అప్‌లోడ్
- తాజాగా విజయవాడలో నోడల్ అధికారులకు శిక్షణ

అమరావతి : ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కొల్లాబ్ ఫైల్స్ అనే సాంకేతిక ఆధారిత డొమైన్‌ను తెరమీదకు తీసుకొచ్చింది. దీంతో భవిష్యత్తులో రాష్ట్రాలకు సంబంధించిన కీలక సమాచారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లనుంది. కొల్లాబ్ ఫైల్స్ సాఫ్ట్‌వేర్ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం చేతిలోని ఎన్ఐసి మానిటరింగ్ చేయనుంది. ఫలితంగా రాబోయో రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడవక తప్పని పరిస్థితులు నెలకొనే అవకాశాలు లేక పోలేదు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ నేషనల్ ఇన్ఫొర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసి) కొలాబ్ ఫైల్స్ అనే నూతన పోర్టల్ ను మనుగడ లోకి తీసుకొచ్చింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా నూతన సాఫ్ట్‌వేర్‌ను దేశీయంగా తీసుకొచ్చినప్పటికీ ఇకపై రాష్ట్రాలు, స్థానిక సంస్థలకు చెందిన పరిపాలనాపరమైన ఉత్తర ప్రత్యుత్తరాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు ప్రభుత్వానికి చెందిన పలు రహస్య విషయాలను నూతన సాఫ్ట్‌వేర్‌ద్వారా భద్రపరచాలని కేంద్రం పేర్కొంటోంది.ఇందులో ప్రభుత్వ అధికారులు వారికి కావాల్సిన ఫైల్స్ (వర్డ్, పవర్ పాయింట్ , ఎక్సెల్, పిడిఎఫ్, మరియు ఇతర డాక్యుమెంట్లు, వారి లాగిన్ నుండి ఇతరులకు సులభంగా పంపే విధానాన్ని ఇందులో తీసుకొచ్చారు. తాజాగా సాఫ్ట్ వేర్ ఉపయోగంపై నోడల్ అధికారులకు ఎన్ఐసి శిక్షణ ఇచ్చింది. గత వారంలో విజయవాడలోని ఓ త్రీస్టార్ హోటల్‌లో నూతన సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యక్రమాలన్నీ గుగూల్‌తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీల సాఫ్ట్‌వేర్ ద్వారా డేటా ను భద్రపరిచే వారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏమైనా వివరాలు కావాలని కేంద్రం కోరినా కొన్ని రాష్ట్రాలు ఆయా వివరాలు ఇవ్వడం లేదనే వాదన కూడా వినబడుతోంది. కాగ్ లాంటి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలు పేర్కొన్న అభ్యంతరాలను కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సరిచేసుకోవడం లేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొల్లాగ్ ఫైల్స్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా అధికారిక ఫైల్స్‌ను డిజిటలైజేషన్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫైల్స్ ద్వారా సేకరించిన డేటాను రహస్యంగా ఉంచడం, నాలెడ్జ్ షేరింగ్, సురక్షితంగా రికార్డులను ఉంచడంతో పాటు యాక్సెస్ సులభతరం చేయడం సులభంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది.ప్రభుత్వం వీటి యొక్క వినియోగం వారి అధికారిక మెయిల్ ఐడి ద్వారా మాత్రమే జరపాల్సి ఉంటుంది. ఫలితంగా సాంకేతికంగా ఎటువంటి సమస్య ఉండక పోవడంతో పాటు ఫైల్స్ అన్ని కూడా ఇ-ఆఫీస్ కు అనుసంధానం చేయడంతో పరిపాలన మరింత వేగవంతం అవుతుందని ఎన్ఐసి అధికారులు పేర్కొంటున్నారు.ఈ పోర్టల్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారి నుండి ఏ సమాచారం కావాలన్నా జిల్లా స్థాయి అధికారులు వెంటనే పొందుపరచి వారి లాగిన్ నుంచి పంపే వీలుంటుంది. ఫలితంగా ఎటువంటి ప్రైవేట్ మెయిల్స్ వాడాల్సిన అవసరం రాదని, రానున్న రోజుల్లో వీటి వినియోగం పెరుగుతుంది అని ఎన్ఐసి అధికారులు పేర్కొంటున్నారు.

బ్యారేజీపై బెంబేలు

- మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ కుంగుబాటుపై విచారణ
- అంతర్రాష్ట్ర సరిహద్దును మూసివేసిన అధికారులు
- నెలరోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తాం : రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు
- టెక్నికల్ వైఫల్యం కనిపిస్తోంది : ఎమ్మెల్యే శ్రీధర్ బాబు
- కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి : ఈటల రాజేందర్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి / మహాదేవపూర్

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ కుంగిపోవడంతో సర్వత్రా బెంబేలెత్తిస్తోంది. అంతర్రాష్ట్ర సరిహద్దును మూసివేశారు. వంతెన వరిగిపోవటానికి గల కారణాలను నిపుణుల బృందం పరిశీలిస్తోంది. ఆదివారం ఉదయం ఇంజినీరింగ్ అధికారులు కుంగిన 19, 20, 21 బ్యారేజీ పిల్లర్లను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. నిర్మాణ లోపమా.. మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో విశ్లేషిస్తున్నారు. మరోపక్క బ్రిడ్జి కుంగిపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసి అంతర్రాష్ట్ర సరిహద్దును మూసివేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు ఎవరూ రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. నాడు అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును చూసి తనివి తీరాల్సిందేనని ప్రచారం చేసిన సర్కార్.. నేడు, నిర్మాణంలో లోపాలు బహిర్గతమైతే ఎందుకు చూడనివ్వడం లేదని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. కాగా, శనివారం రాత్రి వరకు బ్యారేజీలో దాదాపు 10 టీఎంసీల నీళ్లు ఉండగా.. ఇరిగేషన్ అధికారులు గేట్లు ఎత్తి నీటికి ఖాళీ చేయడం ప్రారంభించారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో మొదటి బ్యారేజీ మేడిగడ్డ బ్యారేజీని 1,632 మీటర్ల పొడువున నిర్మించారు. 85 గేట్లతో 16 టీఎంసీ నీటి సామర్థ్యంతో నిర్మించారు.

టెక్నికల్ వైఫల్యం కనిపిస్తోంది : ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ కుంగుపాటుకు మానవ తప్పిదాలు, టెక్నికల్ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి బ్రిడ్జీ కుంగిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రైతుసంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శి వి. వెంకట్‌రెడ్డి బ్యారేజీ సందర్శనకు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు.

దాంతో వారు అక్కడే బైటాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో శ్రీధర్‌బాబు వాదనకు దిగారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యతాలోపం బహిర్గతమవుతుందన్న భయంతోనే ప్రభుత్వం పోలీసులను పెట్టి విపక్ష నేతలను సందర్శించకుండా అడ్డుకుంటుందని ఆరోపించారు. బ్యారేజీ మూడో బ్లాక్‌లోని పిల్లర్లు కుంగిపోవడంతో.. కాళేశ్వరం ప్రాజెక్టులో మానవ తప్పిదాలు, టెక్నికల్ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అన్నారు. కిలోమీటరున్నర దూరం నుంచి చూసినా బ్యారేజీ కుంగినట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అదే విషయాన్ని డీఈలు కూడా నిర్ధారించి చెప్పారని, ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను పిలిపిస్తున్నట్టు చెప్పారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏవిధంగా కట్టారో.. ఏవిధంగా కుంగి పోతోందో.. ప్రజలందరికీ చూపించాలని డిమాండ్ చేశారు.

నెలరోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తాం

మేడిగడ్డ బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని, నెలరోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తామని రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. బ్యారేజీ కుంగిపోయిన నేపథ్యంలో ఆదివారం రాత్రి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన అనంతరం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని, శనివారం రాత్రి పెద్ద శబ్దం రావడంతో విషయం తెలుసుకొని పరిశీలించామన్నారు. అధికారులకు సమాచారం అందించడంతో వారు కూడా వచ్చి పరిశీలించారని తెలిపారు. బ్యారేజీ కుంగుబాటు తర్వాత నీటిని దిగువకు విడుదల చేశామని, త్వరలోనే మరమ్మతులు పూర్తిచేస్తామన్నారు. ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకొని, ఎవరినీ బ్యారేజీ పరిసరాల్లోకి అనుమతించడం లేదని తెలిపారు. ఈ ప్రాజెక్టు నుంచి గతేడాది 28 లక్షల క్యూసెక్కుల నీటిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా దిగువకు విడుదల చేశామని గుర్తుచేశారు. చిన్నచిన్న సమస్యలుంటే పరిశీలించి పరిష్కరిస్తామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు.

రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు

కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి : ఈటల



తానే స్వయంగా ఇంజినీరింగ్ బాధ్యత వహిస్తూ ఒక ఇంజినీర్‌లా పనిచేశానన్న కేసీఆర్ నేడు ఏం సమాధానం చెప్తారని బీజేపీ నేత ఈటల రాజేందర్ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల చెమట డబ్బు లతో కట్టిన ప్రాజెక్టులతో.. రైతాంగానికి నీరందుతుందనుకున్నామని, కానీ కన్నీళ్లు పెట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో లక్ష్మీ బ్యారేజ్ పంపులు మునిగి భారీ నష్టం వాటిల్లిందని, నేడు ప్రాజెక్టు కుంగడంతో రైతులకు ఎలా నీరందిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు పూర్తి సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

బీఆర్ఎస్ 'సోషల్ వార్...'

- పోల్ మేనేజ్‌మెంట్ కోసం కసరత్తులు
- వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ ద్వారా విస్తృత ప్రచారం
- ఒక్కో గ్రామంలో వంద మందితో బూత్ కమిటీ ఏర్పాటు
- అన్ని విషయాల్లోనూ తాజా సమాచారంతో సిద్ధంగా ఉండండి : నియోజకవర్గ ఇన్‌చార్జిల సమావేశంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ప్రస్తుత ఎన్నికల్లో సామాజిక మాధ్యమాలను నూటికి నూరు శాతం వాడుకోవాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్ తదితర వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని క్షేత్రస్థాయి కార్యకర్తలకు పిలుపునిచ్చింది. ఇదే సమయంలో ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో వార్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. వాటిని రాష్ట్ర కేంద్రంలోని 'వార్ రూమ్'కు అనుసంధానం చేసింది. ప్రతీ గ్రామంలోనూ వంద మందితో బూత్ కమిటీలను ఏర్పాటు చేయటం ద్వారా పోల్ మేనేజ్‌మెంట్‌ను పక్కాగా అమలు చేయాలంటూ పార్టీ నేతలను ఆదేశించింది. ఆదివారం హైదరాబాద్‌లోని జల విహార్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మంత్రి హరీశ్‌రావు ఈ కార్యక్రమానికి హాజరై ఆయా బాధ్యులకు దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గాల సమాచారం, ప్రచారం, ప్రతిపక్షాల విమర్శలు తదితరాంశాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర కేంద్రానికి తెలపాలంటూ వారు ఆదేశించారు. ముఖ్యంగా ఇటీవల ప్రకటించిన బీఆర్ఎస్ మేనిఫెస్టోను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు పోవాలని సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను బీఆర్ఎస్ కాపీ కొట్టిందంటూ కొనసాగుతున్న ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తిప్పి కొట్టాలని కోరారు. పార్టీలోని సీనియర్లు, అనుభవంగల వారు సోషల్ మీడియాను వాడుకోవటంలో వెనుకబడి ఉంటున్నారని తెలిపారు.

వారందరూ మారుతున్న కాలంతోపాటు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. సభలు, సమావేశాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో కారు గుర్తును సూచించే ఫ్లెక్సీలు, బొమ్మలను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల మీటింగుల్లో పాల్గొనే నేతలందరూ విధిగా తమ చొక్కాపై కారు గుర్తు ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు.

వారి వద్ద సంస్కారం నేర్చుకోవాల్సిన పని లేదు : కేటీఆర్

బీఆర్ఎస్ నేతలు సంస్కారం నేర్చుకోవాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి వ్యాఖ్యానించటాన్ని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా తప్పుబట్టారు. వారి వద్ద సంస్కారం నేర్చుకోవాల్సిన అగత్యం తమకు పట్టలేదన్నారు. గతంలో కేసీఆర్‌కు పిండం పెట్టాలి, ఆయన్ను రాళ్లతో కొట్టాలంటూ మాట్లాడిన పీసీసీ చీఫ్ రేవంత్‌కు ముందు సంస్కారం నేర్పండంటూ జానాకు సూచించారు. రూ.50 కోట్లకు పీసీసీ అధ్యక్ష పీఠాన్ని అమ్ముకున్నారంటూ ఘాటుగా విమర్శించారు. సీట్ల పంపకాల నేపథ్యంలో రేవంత్ డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆ పార్టీ నేతలే ఈడీకి ఫిర్యాదు చేశారని ఎద్దేవా చేశారు. ఈసారి ఎన్నికల్లో తమ పార్టీ కచ్చితంగా గెలిచి తీరుతుందనీ, కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెన్ను చూపి పారిపోయారని వ్యాఖ్యానించారు.

వర్కర్స్ మ్యానిఫెస్టో అంశాలను పరిగణనలోకి తీసుకోండి

- కార్మికులకు మేలు చేసే అంశాలను మ్యానిఫెస్టోలో చేర్చండి : బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కేటీఆర్‌కు ఉద్యోగ, కార్మిక సంఘాల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని కార్మిక, ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టోలో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనీ, కార్మికులకు మేలు చేసే అంశాలను అధికార పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావును కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రికి వినతిపత్రాన్ని, వర్కర్స్ మ్యానిఫెస్టోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమ్మెలు, ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అందుకే ఈసారి మ్యానిఫెస్టోలో కార్మికుల అంశాలను చేర్చాలని డిమాండ్ చేశారు. కోటి మందికిపైగా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉమ్మడిగా చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టోను రూపొందించాయన్నారు. దీనిని పలు పార్టీల అధ్యక్షులకు అందజేస్తున్నామన్నారు. వర్కర్స్ మ్యానిఫెస్టోలోని అంశాలపై బీఆర్ఎస్ పార్టీ సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలను సవరించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు-ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాలు, పాత పెన్షన్ పునరుద్ధరణ, మెడిసిన్‌పై జీఎస్టీ ఎత్తేసి ధరలు తగ్గించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, స్థానిక సంస్థల్లో పనిచేసే మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో పొందుపర్చామని తెలిపారు. వాటన్నింటిపైనా పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కీం..కర్తవ్యం ?

- బాబు బయటకొస్తేనే తెలంగాణ టీడీపీకి మోక్షం
- మరోసారి ములాఖాత్‌కు కాసాని
- అభ్యర్థుల ప్రకటన మరింత ఆలస్యం

నవతెంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖలో నెలకొన్న గందరగోళ పరిస్థితికి తెరపడటానికి మరికొన్ని రోజులు పట్టేలా కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చి దాదాపు రెండు వారాలు దాటింది. ఆశావహులైన నేతలు టికెట్ల కోసం ఎదురుతెన్నులు పడుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఏపీ రాజకీయ పరిస్థితుల కారణంగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణలో టీడీపీ పరిస్థితి ముందు నుయ్యి..వెనుక గొయ్యిలా తయారైంది. ఎన్నికల్లో పోటీచేసేందుకు కావాల్సిన భీఫారాల కోసం పార్టీ తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌పై ఒత్తిడి పెరుగుతున్నది. ఆదివారం సైతం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్ ఆశావహులైన నేతలు, కార్యకర్తలతో నిండిపోయింది. ప్రస్తుత పరిస్థితిని చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ముఖ్యమైన నాయకులతో కాసాని ప్రత్యేక సమావేశాన్ని సైతం ఏర్పాటు చేశారు. నాలుగైదు రోజుల్లో చంద్రబాబును మరోసారి ములాఖత్‌లో కలిసేందుకు కాసాని ప్రయత్నిస్తున్నారు. బుధ, గురువారాల్లో ఈ సమావేశం ఉండొచ్చని స్వయంగా ఆయనే చెప్పడం గమనార్హం. ములాఖాత్ విషయమై ఏపీ నేతలతో మాట్లాడారు. తెలంగాణ రాజకీయాలు, పొత్తు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు పావులు కదుపుతున్నారు. ములాఖత్‌కు వెళ్లేటప్పుడు తెలంగాణలో పోటీచేసే అభ్యర్థుల జాబితాను సైతం తీసుకెళ్లి ఆమోదముద్ర వేయించుకోవాలని కాసాని భావిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే మూడు, నాలుగు రోజులు రాజమండ్రిలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు.

బీఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

- కుటుంబపాలనకు కేరాఫ్ కాంగ్రెస్, బీజేపీ : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసినా బీఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మెన్ కోలేటి దామోదర్ తెలిపారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఖాయమని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కుటుంబ రాజకీయాలకు కేరాఫ్ కాంగ్రెస్, బీజేపీలేనని ఆరోపించారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అంటూ ఆ పార్టీలు చేస్తున్న విమర్శలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలోని కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్రాల మంత్రులు, జాతీయ నేతలు, రాష్ట్ర నాయకుల వరకు వారి వంశవృక్షాలే కనిపిస్తాయని వివరించారు.

'కారు'కే ఆధిక్యం

మిషన్ చాణక్య సర్వేలో వెల్లడి

- కర్నాటక, మునుగోడులో మా అంచనా తప్పింది : ఆ సంస్థ చైర్మెన్ ఏ శివకేశవ్


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ఇప్పటి వరకు ప్రజల ఎన్నికల నాడిని పరిశీలిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే అధిక్యం వస్తుందని తమ సర్వేలో వెల్లడైనట్టు మిషన్ చాణక్య వ్యవస్థాపక చైర్మెన్ ఏ శివకేశవ్ తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 70 నుంచి 76 సీట్లలో విజయం సాధిస్తుందనీ, కాంగ్రెస్ కేవలం 25 సీట్లు మాత్రమే గెలుస్తుందని తమ సర్వేలో వెల్లడైందన్నారు. బీజేపీ కేవలం 9 చోట్ల మాత్రమే విజయం సాధించే అవకాశం ఉందన్నారు. ఆదివారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో తాము నిర్వహించిన సర్వే ఫలితాలను ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వెల్లడించారు. కర్నాటక ఎన్నికల తర్వాతి నుంచి మొత్తం 14 లక్షల మంది ఓటర్ల అభిప్రాయాలను తాము సేకరించి, 'నా రాష్ట్రం-నా ఓటు-నా నిర్ణయం' పేరుతో విశ్లేషించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 44.62 శాతం, కాంగ్రెస్‌కు 32.71 శాతం, బీజేపీకి 17.6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేశామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీజేపీ హవా తగ్గి, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లో పెరిగిందని చెప్పారు. అయితే అన్ని పార్టీల అభ్యర్థులు ఖరారయ్యాక ఈ అంచనాల్లో తేడాలు ఉంటాయన్నారు. అభ్యర్థుల ఖరారు తర్వాత 'పొలిటికల్ ట్రెండ్' ప్రకటిస్తామనీ, పోలింగ్ ముగిసాక ఎగ్జిట్ పోల్స్ వెల్లడిస్తామని తెలిపారు. కర్నాటకలో బీజేపీ అధికారంలోకి వస్తుందని తమ సర్వేలో వెల్లడైందనీ, కానీ అందుకు భిన్నంగా అక్కడ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అలాగే మునుగోడు ఉప ఎన్నికలో కూడా బీజేపీ అభ్యర్థి గెలుస్తారని సర్వే ఫలితాలు ప్రకటించామనీ, కానీ అందుకు భిన్నంగా బీఆర్ఎస్ అభ్యర్థి అక్కడ విజ యం సాధించారని వివరించారు. కర్నాటక, మును గోడు ఎన్నికల్లో తమ సర్వే ఫెయిల్ అయినా, 2018 నాటి సర్వే సక్సెస్ అయ్యిందంటూ విలేకరులు అడి గిన పలు ప్రశ్నలకు సమాధానంగా చెప్పి, సమ ర్థించుకున్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 28 శాతం ఓటింగ్ ఉండగా, ఇప్పుడది 33 శాతానికి పెరిగిందన్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బీజేపీకి అంత సీన్ లేదని తెలిసాక, రాష్ట్ర ఓటరు నాడి కాంగ్రెస్‌వైపు మళ్ళిందనీ, అందుకే బీఆర్ఎస్ ఓటింగ్ శాతం తగ్గి, కాంగ్రెస్‌కు పెరిగి ందని విశ్లేషించారు.

నిరుద్యోగులకు బీఆర్ఎస్ ధోకా!

'ఒక్కొక్కరికీ నెలకు రూ.3,016 చొప్పన నిరుద్యోగ భృతి ఇస్తాం.'అంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా ఆ పార్టీ మ్యానిఫెస్టోలోనూ పొందుపరిచింది. కానీ ఐదేండ్లలోనూ నిరుద్యోగ భృతిని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. వారికి బీఆర్ఎస్ ధోకా ఇచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తాయి.


ఫైల్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామంటూ నమ్మించి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఆ ఊసేలేదు. అయితే 'నిరుద్యోగ భృతి హామీ అమలుపై ఏం చేయాలో ఆలోచిస్తున్నాం. కరోనా వల్ల ఉద్యోగులకు జీతాలే ఇవ్వలేకపోయాం. నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఏం చేయాలో అది చేస్తాం. నిరుద్యోగులంటే ఎవరు?అన్నది ముందు తేల్చాలి. దానికి ప్రాతిపదిక ఏంటన్నది ఆలోచిస్తున్నాం.'అని 2021, మార్చి 17న ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అసెంబ్లీలో ప్రకటించారు. 'నిరుద్యోగులకు తీపికబురు. అతిత్వరలోనే నిరుద్యోగ భృతి అమలవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై ప్రకటిస్తారు'అని మంత్రి కేటీఆర్ అదే ఏడాది జనవరిలో చెప్పారు. ఆ ప్రకటనల ఆధారంగా 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో కచ్చితంగా నిరుద్యోగ భృతిని ప్రభుత్వం ప్రకటిస్తుందంటూ యువతీ, యువకులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. అయితే బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేకపోవడంతో వారు తీవ్ర నిరాశ చెందారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పట్ల నిరుద్యోగులు వ్యతిరేకంగా ఉన్నారు. వారిని మచ్చిక చేసుకునేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఏదో ఒక హామీ ఇస్తారని అందరూ ఆశించారు. కానీ అందులోనూ వారి ఊసే ఎత్తలేదు. నిరుద్యోగులు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలే లేవు. దీంతో బీఆర్ఎస్ తీరు పట్ల నిరుద్యోగులు మరింత ఆగ్రహంతో ఉన్నారు. నిరుద్యోగులను బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందన్న అభిప్రాయం బలంగా ఉన్నది. అందుకే ఇప్పుడు నిరుద్యోగులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నారాయణపేట జిల్లా గుండుమల్ మండల పరిధిలోని కొమ్మూరు గ్రామంలో నిరుద్యోగుల తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు. ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీకే ఓటు వేయాలంటూ అవగాహన కల్పిస్తుండడం గమనార్హం.

కొలువులు రాక ఆందోళన

ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ యువతకు అన్యాయం జరిగిందన్న పేరుతో ప్రత్యేక ఉద్యమం సాగింది. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న లక్ష్యాల కోసమే పోరాటం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగ యువకులు ఉద్యమంలో ముందు వరుసలో ఉన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన వారిలోనూ వారే అధికం. అయితే తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే జరిగిందన్న అభిప్రాయం అందరిలోనూ ఉన్నది. దీంతో నిరుద్యోగుల ఆశలు, ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరలేదు. 2.24 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. లక్షకు మించి ఉద్యోగాల భర్తీ జరగలేదని పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలంటూ అధికార పార్టీ నేతలకు సవాల్ విసురుతున్నారు. 80,039 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో గతేడాది ప్రకటించారు. అందులో 35 వేల నుంచి 40 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. 16,604 పోస్టుల భర్తీకి పోలీసు నియామక బోర్డు, 9.210 పోస్టుల భర్తీకి గురుకుల బోర్డు ఆధ్వర్యంలో రాతపరీక్షలను నిర్వహించాయి. హైకోర్టు ఆదేశాలతో పోలీసు నియామకాల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇక తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఉద్యోగాల భర్తీలో విఫలమై అభాసుపాలవుతున్నది. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ మొదటి సారి రద్దయ్యింది. ఆ తర్వాత నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో బయోమెట్రిక్ చేపట్టకపోవడం, ఓఎంఆర్‌లో అభ్యర్థుల వివరాలు పొందుపర్చకపోవడంతో హైకోర్టు మరోసారి రద్దు చేసింది. దీంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రూప్-2, డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. కారణమేదైనా తెలంగాణలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర మనస్తాపానికి, ఆందోళనకు గురవుతున్నారు. అందులో భాగంగానే హైదరాబాద్‌లో ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సంఘటన రాజకీయంగా సంచలనం సృష్టించింది.

బీజేపీ హామీ గాలిబుడగ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాత్ర కూడా నిరుద్యోగం పెరగడంలో కీలకంగా ఉన్నది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా వంటివి గాలిబుడగలయ్యాయి. నిరుద్యోగ సమస్య పరిష్కారం కేంద్ర ప్రభుత్వ చేతుల్లోనే కీలకంగా ఉంటుంది. గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి వాటిని కూడా నీరుగార్చడంతో గ్రామీణ, పట్టణ పేదరికం విస్ఫోటన స్థాయికి చేరింది. కానీ కేంద్రం తప్పులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మీద బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం గమనార్హం. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో యువతను మోసం చేసేందుకు ఆ పార్టీ ముందుకొస్తున్నది. కేంద్రంలో ఆ పార్టీ అధికారంలో ఉన్నా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం లేదు. వివిధ రాష్ట్రాల్లోనూ ఉద్యోగాల కల్పన సరిగ్గా చేపట్టడం లేదు. కానీ తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఊదరగొట్టే ప్రసంగాలతో యువతకు గాలం వేయాలని కమలం పార్టీ చూస్తున్నది.

మహిళల ఓట్లే కీలకం...

రాష్ట్రంలో 3,17,32,727 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 1,58,71,493, మహిళలు 1,58,43,339 మంది ఉన్నారు. మహిళల కంటే పురుషులు 28,154 మంది అధికంగా ఉన్నారు. అయితే పురుషులతో సమానంగా మహిళల ఓట్లు ఉండడంతో రాజకీయ పార్టీలు వారికి వల వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. వారి ఓట్లు పొందేందుకు మ్యానిఫెస్టోలో ఆకర్షణీయమైన పథకాలను పొందుపరుస్తున్నాయి. అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ హామీలిస్తున్నాయి. ఈసారి మహిళలు కేంద్రంగా ఎన్నికలు జరిగే అవకాశమున్నది. అందుకే కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి పేరుతో మహిళలకు ప్రతినెలా రూ.2,500 పెన్షన్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి పేరుతో ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితమంటూ ప్రకటించింది. ఇక అధికార పార్టీ బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోలో అర్హులైన మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి పథకం పేరుతో బీపీఎల్ కింద ఉన్న అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే మహిళలు ఏ పార్టీవైపు మొగ్గు చూపుతారో, ఎవరికి ఓటు వేస్తారో వేచిచూడాల్సిందే.

గోషామహల్ రాజాసింగ్‌కే


- ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేత
- భారీ ర్యాలీతో బీజేపీ ఆఫీసుకి చేరిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు ఆ పార్టీ జాతీయ నాయకత్వం ప్రకటించింది. అదే సమయంలో ఆదివారం ప్రకటించిన తొలిజాబితాలో గోషామహల్ అభ్యర్థిత్వం కూడా ఆయనకు ఖరారైంది. దీంతో ఆయన తన అనుచరులు, పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా నాంపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ప్రధాన ద్వారానికి మొక్కి మరీ లోనికి ప్రవేశించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆయన్ను పార్టీ కార్యాలయంలోకి ఆహ్వానించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. 'రాముడికి 14 ఏండ్ల వనవాసమైతే..తనకు 14 నెలల వనవాసం వేశారు' అని రాజాసింగ్ ఈ సందర్భంగా అన్నారు. గోషామహల్ అభ్యర్థిగా రాజాసింగ్‌ను ప్రకటించడంతో ఆ సీటును ఆశించి నియోజకవర్గంలో రెండేండ్లుగా చురుగ్గా పనిచేస్తున్న విక్రమ్‌గౌడ్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పార్టీ పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. విక్రమ్‌కు అంబర్‌పేట లేదా మరో కీలకమైన నియోజక వర్గాన్ని కేటాయించాలని భావిస్తున్నారు. ఆ మేరకు బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి.

జూలూరు పథం..


- విప్లవ, సామాజిక, ప్రాంతీయ, అస్తిత్వ ఉద్యమ ఆత్మకథనాత్మక కావ్యం : ఆంధ్రజ్యోతి సంపాదకులు



నవతెలంగాణ-కల్చరల్

'జూలూరు పథం' సుదీర్ఘ కావ్యంలో ఆయన ఆత్మ కథనాత్మక కథ కనిపించినా తెలంగాణ గడ్డపై సాగిన విప్లవ ఉద్యమాలు, సామాజిక, అస్తిత్వ, ప్రాంతీయ భావాల నేపథ్యంలోనే కావ్యం సాగిందని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. ముగింపు లేని వాక్యం, వొడవని ముచ్చటతో ముఖాముఖి సంభాషణగా 'జూలూరు పథం' కావ్యం సాగిందని తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్ దీర్ఘ కవితా సంపుటి 'జూలూరి పథం' పుస్తకావిష్కరణలో టీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మెన్ గంటా చక్రపాణి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నతో కలిసి శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ మీడియా అకాడెమీ చైర్మెన్ అల్లం నారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. జూలూరు గౌరీశంకర్.. తన జీవిత నేపథ్యం చెబుతూనే సామాజికంగా తెలంగాణ పరిణామం చెందుతూ వచ్చిన విధానాన్ని డాక్యుమెంట్ విధానంలో అక్షరీకరించారని ప్రశంసించారు. కాలానికన్న ముందుకు దూసుకు వెళ్లాలని తపన, ఉత్తమ భావాలు కల గౌరీ శంకర్ తాను రాసే ప్రతి అంశంపై నిర్దిష్ట భావాలతో స్పష్టంగా ఉంటాయని వివరించారు. సాహిత్యంపై అవగాహన కార్య దక్షత వున్న గౌరీ శంకర్ సాహిత్య అకాడమీ అధ్యక్షత వహించి ఎన్నో సాహితీ విశేషాలకు మార్గం చేస్తున్నారన్నారు. అనంతరం అల్లం నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ కల్లోల దశాబ్దాల కాలం నుంచి స్వరాష్ట్రం సాకారమైన దశ దాకా వచ్చిన నేపథ్యంలో జూలూరు గౌరీశంకర్ దీర్ఘ కవిత సాగిందన్నారు. మార్పు వస్తుందని కలలు కన్నా నేడు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు లభించిన వాటా తక్కువేనని, ఆశించిన సమానత్వం రాలేదని, జనాభాలో పది శాతం ఉన్నవారే రాజ్యం ఏలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన దీర్ఘ కవిత అంతా వేదన, సంక్షోభం, సంఘర్షణ, ఆక్రోశం, కన్నీళ్లు, చైతన్యం మిళితమైన జీవన కావ్యం అని అభివర్ణించారు. గంటా చక్రపాణి మాట్లాడుతూ.. 'జూలూరు పథం' దాశరథి చెప్పినట్టు గాయపడిన కవి గుండెల్లో రాయబడని కావ్యంలా ఉందన్నారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ.. మార్క్సిజం ఓడి పోదన్నారు. తెలంగాణ వాదాన్ని బలంగా నమ్మి వినిపించిన గౌరీ శంకర్.. తన కావ్య భాష అణగారిన వర్గాల వేదన అని చెప్పారు. ద్వేషం, హింస పెచ్చరిల్లిపోతున్న నేటి సమాజంలో గౌరీ శంకర్ వంటి వారి అవసరం ఎంతో ఉందని తెలిపారు. చివరగా గౌరీ శంకర్ తన కావ్య రచన నేపథ్యం వివరించారు.

అసమాన్య రసావిష్కరణ



'ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు. లేదా ఓ నాటకం వేసి చూడు'. ఇది తెలుగు నాట ఒకనాటి నానుడి. అంటే ఈ మూడు పనులు ఏ మనిషికైనా తన జీవితంలో అమిత కష్టసాధ్యమైన పనులు అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. యజ్ఞయాగ సమాంతర బృహత్కార్యంగా వాటిని భావించేవారు.

ప్రస్తుత డిజిటల్ మార్కెట్ ప్రపంచయుగంలో ఇది వింతగా అనిపించవచ్చు. కానీ అసామాన్య రసావిష్కరణకు సజీవ రంగస్థలం తప్ప మరో దిక్కు లేదు మనిషికి అనేది ఎప్పటికీ నిలిచి వుండే సత్యం. నాటకం సర్వకళల సమాహారం. 'వాక్యం రసాత్మకం కావ్యం' అయినప్పుడు ఆ రసాత్మక కావ్యాన్ని మరింత రసరమ్య దృశ్య శ్రవ్య కావ్యావిష్కరణ గావించడం నాటక స్రష్టలకు యజ్ఞం కాక మరేమిటి?

తెలుగు నాట అటువంటి 'నాటక రంగ మూలస్తంభాల'ను మూలమూలలా వెతికి తెచ్చి ద్విశతాధికంగా ఒక్కచోట చేర్చి ఒక మేలిమి బృహత్‌గ్రంథంగా రూపకల్పన గావించడం సాధారణ విషయం కాదు. మన కాలపు నాటక రంగ పరిశోధకులు కందిమళ్ల సాంబశివరావు, వాడ్రేవు సుందరరావులు ఈ పనిని రచయితలుగా అత్యంత ఆపేక్షతో భుజాన ఎత్తుకున్నారు. అజో విభో కందాళం ఫౌండేషన్ వారు దీనిని ప్రచురించారు.


'గణనీయమైన చరిత్ర గల నాటకం తెలుగు రంగస్థలం మీదకి ఆలస్యంగానే అడుగుపెట్టింది. కారణాలు ఏవైనా పాశ్చాత్య నాటక ప్రభావం లేకుండా రచింపబడిన తొలి తెలుగు నాటకం మంజరీ మధుకరీయం కీ.శే. కోరాడ రామచంద్రశాస్త్రి గారు. 1860లో రచించిన ఈ నాటకం 1906లో ముద్రణకు నోచుకుంది అని ప్రకాశకుల మాటలో అప్పాజోస్యుల సత్యనారాయణ వివరించారు. దాదాపు ఏభై ఏండ్ల అనంతరం నాటకరంగ చరిత్రలో ఓ ముఖ్య ఖాళీగా ఎత్తి చూపారు. ఇటువంటి ఖాళీల పూరకం అన్నట్లుగా దాదాపు 150 ఏండ్ల తెలుగు నాటక రంగ చరిత్రకు ఈ గ్రంథం తెరతీసింది. ఇదో విహంగ వీక్షణం కూడా.

రంగస్థలానుభవం లేని నాటక కర్త నాటకం ప్రేక్షకానురక్తిని సాధించలేదు అన్న సత్యాన్ని ఉటంకిస్తూనే నటులై వుండి రచయితలుగా, దర్శకులుగా బాధ్యతలు స్వీకరించి విశిష్ట కీర్తి సముపార్జించిన మహనీయుల కృషిని తెలపడమే గ్రంథ విశేషమని వారు వివరించారు.

భూత భవిష్యత్ వర్తమాన త్రికాలాలలోని త్రిగుణాత్మకమైన (సత్య, రజో, తమో) మానవ చిత్ర ప్రవృత్తుల లోకానువృత్తమే నాటకం అని భావించినప్పుడు నాటకం కేవలం జీవన ప్రతిబింబమే కాదు, ఒక జాగృత స్వప్నం కూడా. జీవితం ఇంత వరకు ఎలా వున్నదీ తెలపడమే కాదు, ఎలా వుండబోతున్నదీ, ఎలా వుంటే బావుంటుంది అనే దార్శినకతను కూడా చూపగలదు. జాతిని అప్రమత్తం కమ్మని హెచ్చరించగలదు.

కనుకనే డా॥దీర్ఘాసి విజయభాస్కర్ 'జీవితమే రచనకు పునాది' అంటూ గ్రంథాన్ని పరామర్శించారు. 'పౌరాణిక ఇతివృత్తాలు పాగా వేసినప్పుడు పద్యం రాజ్యమేలింది. అయితే సమకాలీన సమస్యల ఆవిష్కరణ, పరిష్కారమార్గాల అన్వేషణ ప్రధాన లక్ష్యం అయినప్పుడు ఆధునిక నాటకం తెలుగు రంగస్థలం వేళ్లూనుకుంది' అని విశదపరిచారు.

రేయింబవళ్లలా నాటకం - జీవితం పెనవేసుకునే వుంటాయి. ముఖ్యంగా నాటక రంగకర్తలకు జీవితంలోనూ, నాటకంలోనూ ఆ కళామూర్తి ఏ విలువల కోసం నిలబడ్డాడో, జీవితాన్ని ధారపోసాడో, ప్రాణాలను పణమొడ్డాడో రేఖామాత్రంగానైనా తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఎంతగానో ఉపకరిస్తుంది. వారు పడిన జీవన, మానసిక సంఘర్షణలు కొంతలో కొంతైనా అర్థమవుతాయి. అలాగే వారి జీవితకాలంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, వారి నాటక కళపై ఆ ప్రభావాలూ తెలుస్తాయి. అందుకే సుదీర్ఘకాలంగా సాగుతున్న తెలుగు నాటక రంగ భాండాగారాన్ని తెరవడానికి ఈ గ్రంథం ఒక తాళాల గుత్తి వంటిదని విజయభాస్కర్ అభివర్ణించారు.



-కె. శాంతారావు
9959745723

ఈనాటి సాహిత్యం - సినిమాల్లో ప్రేమ ప్రధాన వస్తువుగా వుంటే, ఆనాటి సాహిత్యంలో ధర్మం, అదీ వర్ణాశ్రమ ధర్మం పీఠం ఎక్కినట్టు చెప్తూనే తెలుగు పల్లెల్లోని ఒక పశువుల కాపరి చేత పద్యం పాడించేటట్టు చేయగలిగింది పద్య నాటకమైతే, తన పూర్వీకులు ఎందుకు పశువులు కాస్తూ బతకవలసి వచ్చిందోనని ఆలోచింపజేసేదిలా ఆధునిక నాటకం కుండబద్దలు కొట్టిందని తెలిపారు.

ఈ 150 ఏండ్ల కాలంలో యావత్ భారతదేశంలో భాగంగానే తెలుగునాట కూడా మూఢభక్తి ఛాందసత్వాన్ని దాటుకుని సంస్కరణోద్యమాలు, స్వాతంత్ర్యోద్యమాలు, ప్రగతిశీల ఉద్యమాలు వెల్లువెత్తాయి. ఉద్యమాలు, నాటకాలు పరస్పర ప్రభావితాలు. పరస్పర ఆధారితాలు. చలనశీలమైన ఈ ద్వి అంశాలు నాటకం - జీవితం మాదిరి కలగలిసే వుంటాయి. వేరు చేయలేం. తెలుగునాటకం అనివార్యంగా ఆ ప్రజా ఉద్యమాల్లో అంతర్భాగమైంది. ప్రతి నాటకకర్త విషయంలో ఈ ఉద్యమ పార్శ్వం ఏదో ఓ రూపేణా ద్యోతకమవుతూనే వుంటుంది.

పాఠకుల సౌలభ్యం కోసం పుస్తకాన్ని రెండుగా వింగడించి, మొదటి భాగంలో 116 మంది రచయితల విశేషాలను, రెండవ భాగంలో 123 మంది నటుల, దర్శకుల, ఇతరుల విశేషాలను పొందుపరిచారు.

దివంగతులైన నాటకరంగ ప్రముఖుల జీవిత విశేషాలను ప్రతిభా పాటవాలను తెలపడం ఈనాటి తరానికీ, భవిష్యత్ తరానికీ ఎంతో ఉపయుక్తంగా వుంటుందని డా॥కె.వి.రమణాచారి 'నానుడి'లో పేర్కొనడం ముదావహం. నిజంగానే వారన్నట్లు ఆ మహనీయులకు ఇదో నీరాజనం.

నాటక రచయితల తొలిభాగంలో కోరాడ రామచంద్రశాస్త్రి నుండి ఇటీవల మరణించిన యువ రచయిత గంధం నాగరాజు వరకు, మలిభాగంలో సురభి పాపాబాయి నుండి నేరెళ్ల వేణుమాధవ్ వరకు (నటులు, దర్శకులు, ఇతర ప్రముఖులు) వున్నారు. 1/4 డమ్మీ సైజులో దాదాపు వేయి పుటలు నిండైన చిత్తరువులతో అపురూప విశేషాలతో, ఓ విజ్ఞాన సర్వస్వంలా రూపుదిద్దుకున్న ఉద్గ్రంథమిది.

ఇంతటి భారీయత్నంలో పొరపాట్లు దొర్లక మానవు. గోవిందరాజుల సుబ్బారవు, అవేటిపూర్ణిమ (వనారస గోవిందరావు కుమార్తె), కొంగర జగ్గయ్య వంటి ప్రముఖులకు ఈ గ్రంథంలో చోటు దక్కలేదని విమర్శలు వచ్చాయి. సహేతుకంగా వాటిని స్వీకరించి, అనుబంధ ప్రచురణల్లో జత చేసుకోవడం మంచిది. ఇలాంటి పరిశోధనలకు ఆరంభమూ, కొనసాగింపే తప్ప అంతం వుండదు కదా.

> భూత భవిష్యత్ వర్తమాన త్రికాలాలలోని త్రిగుణాత్మకమైన (సత్య, రజో, తమో) మానవ చిత్ర ప్రవృత్తుల లోకానువృత్తమే నాటకం అని భావించినప్పుడు నాటకం కేవలం జీవన ప్రతిబింబమే కాదు, ఒక జాగృత స్వప్నం కూడా. జీవితం ఇంత వరకు ఎలా వున్నదీ తెలపడమే కాదు, ఎలా వుండబోతున్నదీ, ఎలా వుంటే బావుంటుంది అనే దార్శినకతను కూడా చూపగలదు.

గాజా యుద్ధకాండ కవిత

ఏలి ఏలి లామా సభక్తాన్ని..
తండ్రియైన దేవా నీ వేల మా చేయి విడిచితివా....
మమ్ముల పై మా మితిమీరిన కాంక్ష తో నిన్ను మరచితిమా....
ఎప్పుడో చదివినట్టుందా వాక్యం..
ప్రపంచానికి రుధిర భూమి సాక్షిగా శాంతి ప్రవచనాలు అందిద్దాం
ప్రపంచమా మేలుకొని చెవియొగ్గుము..
దేవభూమి లో దహనకాండ
చెవులున్నవారు విందురుగాక.. కనులున్నవారు చూసి తరింతురు గాక
పశ్చిమాసియా అవనీతల నాభి మండలం..
ఆదికాండం ఆదాం అవ్వ మొదటి కథ పరమార్థం ఏమిటి?
నోవాహు జలప్రలయం పుట్టింది నిజమో కాదో..
బాంబుల వర్షంలో మిస్సైల్ దాడిలో గాజా నేలమాళిగలు ఛిద్రమైంది చూస్తున్నాం..
యుద్ధాన్ని కలగంటున్నాం యుద్ధంలో నడుస్తున్నాం..
యుద్ధంలో జీవిస్తున్నాం..
జరుగుతున్న విపత్తులకు సాక్షిభూతంగా నిలుస్తున్నాం..
వందేండ్ల ప్రపంచ యుద్ధం పాఠాలుగా చదువుతూ మానవ హననానికీ పతకరచన చేస్తున్నాం..

సామూహిక దు:ఖంతో సామూహిక దహనకాండ....
రాతిగుహల రాసినా రాక్షసానంద కేళీ
దేవుడు పుట్టిన భూమి
మూడు మతాలు మెట్టిన భూమి లో మెస్సయ్య మళ్ళీ వస్తాడా ..
పాపపంకిలమైన నరచరితను విమోచన చేస్తాడా..
ఏసుక్రీస్తు సిలువ మోసింది జాతుల సమూల నిర్మూలన కేనా ..
ఒక చెంపమీద కొడితే మరొక చెంపమీద కొట్టమన్నది నిజం కాదా..

ఎరుషలేమా నీ పవిత్రత ఎక్కడా?
ఓరి ఇజ్రాయిల్ యోధుడా బైబిల్ గ్రంథంలో నీ ఆనవాలు మసక బారుతోందా..

పాలస్తీనాకు రాసిన పత్రిక మతలబు ఏమిటి?
అన్యులను ప్రేమించిన ఏసు ఎక్కడ?
పొరుగు వారిని, దాయాదులైన వారిని ద్వేషించు మతం ఎక్కడ?
ఇక్కడ ఎవరికి వారే యమునా తీరే..
ఒకరికి ఇంకొకరు ఏమికారు ..
జాతుల వైరము.. మతాల వైరుధ్యం .. విరుద్ధ బావప్రకటనలతో
ఎవడి అస్థిత్వం వాడే చాటుతాడు
ఎటొచ్చి ఎటుచూసినా మరణ మృదంగపు సైరన్ వినిపిస్తూనే వుంటది
గన్ పౌడర్ ప్రాణవాయువుగా రూపు దిద్దుకుంటది..
వేన వేల ఏళ్ల చరితం సమస్తం కల్లోలితం

అక్కడ ఒక తండ్రి బొండిగెఊపిరాకిన కొడుకును చూస్తూ బోరున విలపిస్తుండు
అక్కడో మాతృమూర్తి నెత్తురోడుతున్న తన పేగు బంధాన్ని చూసి
నడివీధుల అహంకారాలు చేస్తుంది ఒకవైపు సైరన్ వినిపిస్తుంటే
మరొకవైపు నిశ్శబ్దానికి ఛేదిస్తూ దూసుకు వస్తున్న మిస్సైలు గాజా గాయాల నగరం నేలమట్టం
గాజా గజగజ వణుకుతూ విలవిలలాడుతూ కన్నీటి పర్యంతం
ఆది అంతం అంతా కళ్ళముందు చూస్తున్నట్టే ఉంది ఏమి
జరుగుతుందో ఇట్టే తెలిసిపోతునట్టేవుంది

వేల ఏండ్ల ఒక జాతి చరిత్ర మట్టి పొరలలో ఇంకిపోతుంది
భద్రపరచడానికి పురావస్తు శాఖ కాచుకునే ఉంటది ఐక్యరాజ్యసమితి
నక్క వినయాలు నటిస్తూనే ఉంటది దేశం ఏదైనా కొత్త జాతులకు
అంకురార్పణ జరుగుతది
పాత మతాలు రూపాంతరం చెందుతాయి
వేటగాని పిట్ట కథలు కట్టుకథలు చలామణిలో ఉంటాయి
నిజానికి పాతరా
కాలం సాక్షిగా నియంతల జాతర

ఇప్పుడు గాలి నీరు దుమ్మూ దూళి కలుషితమై ఓజోన్ పొరకు చిల్లు పడుతది..
నిందల సభలు కౌగిలింతతో కరచాలనం చేసుకుంటది..
ప్రపంచం రెండుగా చీలుతదీ..
అడగకుండానే ఆయుధాలు సరిహద్దుల దాటి తుప్పు వదిలించుకుంటాయి..
జననం మరణం తేదీల్లో చేరుతాయి ..
సంఘం చెక్కిన శిల్పం వంచన అల్ అక్సా నిలవడి చూస్తున్నట్టు
మ్యూజియంలో చోటు దక్కించుకుంటది
శవాల దిబ్బలో పసిపిల్లలు కొత్త కథకు వారధి కడతారు..
పదాలు మిగిలే వుంటాయి..
రేపుకు మీరెవరో తెలియదు
ఒక ఆశ శ్వాస దిక్కులు చూస్తున్నట్టుంది..
శిధిలమైన జీవితాల శిథిల నాగరికత కు
శరత్కాల శిశిర వదనాలు..

– భూతం ముత్యాలు

గాజా గాయం

తన పాలస్తీనా బిడ్డలు ఓడుతున్న రక్తం
భూమి తల్లి కన్నీరు
భూమి తల్లి రోదిస్తున్నది
పాలస్తీనా తల్లుల్లాగే
పిచ్చిగా అరుస్తూ సాపిస్తూ..
వినిపిస్తున్నదా మీకు
చచ్చుపడ్డ మనసు చెవులకు!



పిల్లలందరినీ ఒక్క తీరుగానే పెంచానే
వాడెందుకు తమ్ముళ్లనే క్రూరంగా చంపేస్తున్నాడని...

తానంతా బిడ్డలందరికీ సమానమే కదా
ఈ పోరలెందుకు ప్లాట్లు ప్లాట్లుగా
తనను సరిహద్దులు హద్దులుగా తవ్వుకుంటున్నారని...
భూమి తల్లి మనసు అరిగోస పడుతున్నది

బిడ్డలందరూ సమానంగా ఉండరు
ఒక ఇద్దరు కొట్లాడుకుంటుంటే
మిగతా కొడుకులు చోద్యం చూడ్డమేందని
అరుస్తున్నది భూమి తల్లి
పాలస్తీనా తల్లుల గొంతై..

మౌనం వీడక పోతే
మనకూ ఒక రోజొస్తుంది
భీకరంగా ఉరికిస్తూ పేల్చేస్తూ చంపేస్తూ
పిచ్చెక్కిన నరహంతకుల వేటలో బలవుతూ...
అప్పుడు కూడా భూమితల్లి ఇలాగే గుండెలు బాదుకుని
ఏడుస్తుంది

విశ్వంలో ఎన్నో ఢక్కామొక్కీలు తిని
నా పిల్లలైన మీ కోసం నన్ను నేను కాపాడుకుంటూ
వచ్చానే..
పెరుగుతున్న సూర్యతాపానికి
ఉడుగుతున్న నా వయసుకి
ఈ బిడ్డలందరికీ ఏ దారి చూపాలా అని

నేను చింత పడుతుంటే
మీలో మీరు కొట్టుకు చస్తారేం రా
చవటల్లారా! పనికి మాలినోళ్ళారా!
నేను ముడుచుకుపోయి రాలిపోయిందాకైనా
అన్నదమ్ములమని యాది మరవక
కలిసి పచ్చ పచ్చగా బతకండిరా..

అర్ధాంతరంగా మిమ్మల్ని నాలో కలుపుకోలేక
గుండెలు పగులుతున్న నా రోదనని
వినే సూక్ష్మ దర్శనం
మీకు కలిగితే బాగుండు కదరా!

– స్కైబాబ

ఐడియల్ నాగసూరికి అభినందనలు



మా ఐడియల్ ఫ్రెండ్ నాగసూరి వేణుగోపాల్. ఎందుకంటే చాలా సాధారణంగా, కుగ్రామంలో మొదలైన ఆయన జీవితం ఎంతో స్ఫూర్తి దాయకం. బాల్యంలో ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నారు. చదువుతో పాటు రచన మీద కూడా ఆసక్తి చూశారు. అటు చదువు, ఇటు రచనలు, ఉద్యోగం, కుటుంబ జీవితం... వీటన్నింటినీ సమాంతరంగా, సమర్థవంతంగా నిర్వహించడం కొద్ది మందికే సాధ్యం. మా ఫ్రెండ్ విద్యార్థత్వలు, రచనలు గమనిస్తే ఈతరం సమాజానికి కావలిసిన మొత్తం ఆలోచనా విధానం ఏమిటో మనకు ఒక నిర్దేశనంగా దొరుకుతుంది.

విప్లవం అంటే హింసా మార్గమే, ఆయుధాలు పట్టడమే అన్న మిస్ కాన్సెప్షన్‌ను మన మీద రుద్దుతున్న సమయంలో 'అసలైన విప్లవవాది, సిసలైన సిద్ధాంత కర్త మహాత్మాగాంధీ' అనే సంచలన పుస్తకం ద్వారా ఆ మిస్ కాన్సెప్షన్‌ను విజయవంతంగా బ్రేక్ చేసాడు. నిజమే కదా ద్వేషం, హింస లేని నిరసన అనేది ఎంత అద్భుతమైన ఆలోచన. 200 ఏండ్లు మన దేశాన్ని దోచుకున్న బ్రిటీష్ వలసపాలకుల మీద ద్వేషం రావడం, భౌతికంగా నిర్మూలన చేయాలి అన్న ఆవేశం రావడం సహజమే. అయితే మన భావోద్వేగాలను అదుపులో ఉంచుకుని, వాటిని ద్వేషం, పగ, హింస వైపు కాకుండా శాంతి యుత నిరసన వైపు మరల్చడం, మొత్తం దేశాన్ని, ప్రపంచాన్ని కూడా అహింసాయుత మార్గం గురించి కన్విన్స్ చేయగలిగిన గాంధీజీనే అసలైన విప్లవవాది అని నాగసూరి అంటారు.

మన విద్యా విధానం కేవలం పరీక్షల్లో మార్కులు రావడమే ప్రతిభకు కొలమనంగా మారుతున్న సందర్భంలో, అక్కడ సైంటిఫిక్ దృక్పథంతో కూడిన ఆలోచనలు వృద్ధి చేసే ప్రయత్నాలు లోపించిన సందర్భంలో, ఆ ఖాళీలు పూరించడానికా అన్నట్లు, సైన్స్ దృక్పథం మీద సుమారు 25 పుస్తకాలు రాయడం విద్యార్థిలోకానికి వారు చేస్తున్న అతిపెద్ద కంట్రిబ్యూషన్. అలాగే పర్యావరణం మీద నాలుగు పుస్తకాలు రాశారు. గాంధీజీ అభివృద్ధి నమూనా కూడా పర్యావరణానికి హాని చేయని, అనవసరమైన సంపద ప్రోగు చేయని అభివృద్ధి నమూనానే! ఆ ఆలోచనలకు తగ్గట్లే పర్యావరణం పరిరక్షణ మీద అమితమైన ఆసక్తి ఉండటం విశేషమైన విషయం. అలాగే స్వీయరచనలు, సంపాదకీయాలు కలిపి తెలుగు సాహిత్యం మీద కూడా సుమారు పాతిక దాకా ఉంటాయి.

ఆల్ ఇండియా రేడియోలో పని చేసిన అపారమైన అనుభవం నుండి, జర్నలిజం, టెలివిజన్ రంగాల గురించి కూడా పుస్తకాలు రాశారు. ఈ పుస్తకాల ద్వారా ఇచ్చిన సూచనలు, చర్చించిన విషయాలు, మనం వంటపట్టించుకోవడం అవసరం. మీడియా విశ్వసనీయతకు కృషి చేయాలి అని, ఆర్థికాభివృద్ధి పర్యావరణానికి హాని చేయకుండా ముందుకు వెళ్ళాలని, విద్యా విధానం శాస్త్రీయ దృక్పథం కలిగిన ఆలోచనల వైపు ఉండాలని, సాధికారికంగా తమ పుస్తకాల ద్వారా మనకు తెలియపరచారు. అదికూడా సులభమైన భాషలో, సబోధకమైన శైలిలో, ఎక్కువ నిడివి లేకుండా సంక్షిప్త రూపంలో మనకు అందించారు. ఒక్క వ్యక్తి ఇన్ని వైవిధ్యభరితమైన సబ్జెక్ట్ మీద రచనలు సాగించడం అబ్బురం అనిపించే విషయం. మా ఐడియల్ ఫ్రెండ్ నాగసూరి వేణుగోపాల్ ఇలానే మాకు మరింత నాలెడ్జ్ ఇవ్వాలి. ఇపుడు దేశంలో ఉన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, గాంధీజీ భావజాలాన్ని ఇలానే చాలా లౌడ్‌గా మన తెలుగు ప్రజలకు అందించాలి.

(జానమద్ది సాహితీ పీఠం 11వ సాహిత్య సేవా పురస్కారం అందుకుంటున్న సందర్భంగా)

– చేగో, 8520046222

లగ్గ పత్రిక



పిల్లగాడు ఆటో నడ్పుతడు నల్లురన్నదమ్ములంటా
నల్లురి పొత్తుల నాల్గెకరాల ఎవుసం
పెద్దాయన బొంబాయ్ల నీళ్ళు తాగే గోడలకు
కాపలుంటడంటా!
నడ్పాయన పట్నంలో కూశింత జాగున్నోడంటా
ఈళ్ళిద్దరే ఊర్ల ఎవుసాన్ని భుజాల నిండా దాస్కుంటారు!
మేనమామ నోటినిండా
పిల్లగాడు బుద్ధిమంతుడే
ఈపొద్దే దినం లగ్గపత్రిక రాసుకుందామని
హన్మండ్ల కాడ ఆలోచన మర్రిచెట్టైంది!

పెండ్లంటే పది కాలాలు సల్లగుండాలే
బలం సూసే అయ్యవారి మాటే మాకూ బలమైంది
పొద్దిమీకి దాక దేవ్లాడి దేవ్లాడి బలం దొర్కంగానే
కొత్తబట్టల్ల లగ్గపత్రిక బొట్టువెట్టుకున్న ముత్తైదువైంది!

జీవితం తప్పుల పుస్తకం కావొద్దని
లగ్గపత్రికలో పేరు కింద పేరు రాసుకొని
ఆడీడ దూరపు సుట్టాలకు లగ్గపత్రిక అందకున్నా
పెండ్లికొచ్చే మనసులు ఇప్పుడు లేరులే!

బడిబాసండ్ల కాడ,పెండ్లిబట్టల కాడ
పెద్దమన్సుల మాట బ్యారమాడకుండా
కల్లు దుకాణం దాక నడిపిస్తుంది!

పేదరికం కనబడకుండా పెండ్లైతే చేశినం
సంసారమే నల్లురు పేరువెట్టకుండా చూసుకోవాలంటూ
అక్క గద్వను బత్మిలాడి పంపిన అమ్మ నాయిన
ఎల్లిపోయిరి!

బావ ఆటో నిండా పేపరు ప్రపంచాన్ని నింపుకొని
ఊరూర వార్తైయ్యోది!
బతుకుబండిని సగంలోనే వొదిలేసి
ఏ దిక్కున సుక్కైండో!

ఇప్పుడు నా పిల్లను కూడా ఓ ఇంటికియ్యాలే
పిల్ల పెండ్లికి లగ్గపత్రిక రాసుకోవాలని
అక్క ఫోన్ చెయ్యగానే
దూలానికి కట్టిన అక్కబావల లగ్గపత్రిక
ఊసి గుండెల మీద పడ్డది!

– చిగురాల్‌పల్లి ప్రసాద్, 8074272531

కొ.కు. సాహిత్యం నేటికీ అవసరమే



"నాకు ఒకటే ఆశయం. నా రచనల వల్ల మనోవికాసం పొందదగిన తెలుగు వాళ్ళు ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలి. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే తెలుగు సారస్వతానికి అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది. నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు. నాకు పూర్వం కథలు రాసిన వారు ఎక్కడ విడిచి పెట్టారో నేను కథా రచనను అక్కడే అందుకోగలను కాని అంతకు పైన ఎట్లా అందుకోగలను?" 1937లో 'కారుణ్యం'కు రాసిన ముందుమాటలో కొకు తన వైఖరిని స్పష్టం చేశారు.

ఆయన రచనల్లో కనిపించే విలక్షణత అభ్యుదయ దృక్పథం. వారి రచనలు ఆలోచనలను రేకెత్తిస్తాయి. "రచయిత సమాజాన్ని 'కుక్క కాపలా' కాయటం కష్టమే" అనే కొకు వాక్యాల వెనుక ఎంతో లోతైన ఆలోచన కనబడుతుంది. 1930, 40 దశాబ్దాల్లో తెలుగు మధ్య తరగతి కుటుంబాలను నిశితంగా పరిశీలించి, వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లో పరిచయం చేశారు. ఉదాహరణకి జాతకాలు - వాటి ప్రభావాలు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూర్ఖత్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, వాటిల్లో ముఖ్యంగా స్త్రీ - పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు కొకు రచనల్లో వస్తువులు. సమాజంలో ఈ ఇతివృత్తాలు గతం కంటే నేడు అధికమయ్యాయి. ఈ కారణాల వల్లే కొకు సాహిత్యం గతం కంటే ఇప్పుడే ఎంతో అవసరం.

'చదువు, వారసత్వం'

ఈ రెండూ కొకు రాసిన పెద్ద నవలలు. 'చదువు' నవల ఇతివృత్తం మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల మధ్య జరిగిన సంఘటనలు, చోటుచేసుకున్న మార్పులను వివరిస్తుంది. 'వారసత్వం' నవల భర్త సహాయం అతి తక్కువగా ఉన్న ఒక గృహిణి, ఒక్కగానొక్క కొడుకును పెంచి పెద్దచేయటం ఇతివృత్తంగా సాగుతుంది. ఈ రెంటిలోనూ పిల్లల పెంపకం మీద ఉపన్యాస ధోరణిలో కాకుండా పాఠకులు ఆలోచించేటట్టు తన నిశితమైన పరిశీలనలని మనముందు ఉంచుతారు రచయిత. ఉదాహరణకి, పిల్లలు పెరుగుతున్నకొద్దీ వారు తమ తల్లిదండ్రుల కన్న తోటి స్నేహితుల నుంచి ఎక్కువ నేర్చుకుంటారన్న విషయాలను వివరంగా చెబుతారు. పిల్లలు పెరుగే క్రమంలో వారు తమ నుంచి దూరమయిపోతున్నారని బెంగపడే తల్లిదండ్రుల ఆరాటాన్ని కూడా అందులో వర్ణిస్తారు. కొకు రచనల్లో ఒక శాస్త్రీయ దృక్పథం కనపడుతుంది. అలా అని పిల్లల్ని పెంచడంలో వారి వ్యక్తిత్వ వికాసానికి మార్గాలు అన్న నీతిబోధ ధోరణిలో ఆ రచనలు లేకపోవడమే వాటి ప్రత్యేకత. కొకు విశిష్టత.

సాహిత్యానికి సామాజిక ప్రయోజనం వుండాలని చెప్పిన కొడవటిగంటి రచనలన్నీ సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చేవే. వచనంలో ఆయనది అందె వేసిన చేయి. కథ చెప్పడంలో ఏ రకమైన సంక్లిష్టతా వుండదు. వస్తువుపై ఆయనకున్న స్పష్టతే ఆయన శైలిలోనూ వ్యక్తమవుంతుంది. ఆయన రచనలు సమకాలీన సామాజిక, ఆర్థిక పరిణామాలను ప్రతిబింబిస్తాయి. ఆయన వచనానికి ముందే చెప్పినట్టు పాఠకుడిని తన వెంట తీసుకుపోయే లక్షణం వుంది.

శైలిలోనూ, భాషలోనూ ఏ రకమైన సంక్లిష్టతా వుండదు. సామాన్య పాఠకులకు అర్థమయ్యే రీతిలో చక్కని శిల్పనైపుణ్యంతో ఆయన రచనలు సాగుతాయి. అభిప్రాయాలను నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా తన రచనతో స్పష్టంగా చెప్పారు. ఆయన కథలు రాయడానికి పెద్దగా కష్టపడినట్టు అనిపించదు. ఆయన సామాజిక పరిశీలనా శక్తి ఎంత సునిశితమైందో ఆయన రచనలు మనకు తెలియజేస్తాయి. సినిమా రంగంతోనూ, పత్రికా రంగంతోనూ ఆయనకు దగ్గరి పరిచయం వుంది. సినిమా బ్రతుకులను కూడా మనకు ఆయన రచనల్లో మనకు చూపించారు. కొకు రచనలను మనం తప్పకుండా చదవాలి. ఆయన కథలు, నవలలు సంపుటాలుగా వెలువడ్డాయి.

(అక్టోబర్ 28 కొ.కు. జయంతి సందర్భంగా)

– అనంతోజు మోహన్‌కృష్ణ, 8897765417

|| సాహితీ వార్తలు ||

'సారాంశం' సంపుటాలు ఆవిష్కరణ

డా॥ అట్టెం దత్తయ్య సంపాదకత్వంలో వెలువడిన 'సారాంశం' (పరిశోధన గ్రంథాలు, పరిచయ వ్యాసాలు) అనే రెండు సంపుటాలు ఆవిష్కరణ ధ్రువఫౌండేషన్, మూసీసాహిత్య ధార సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ సాయత్రం 5 గంటలకు తెలంగాణ సారస్వత పరిషత్తులో ఉంది. ఈ కార్యక్రమానికి డా॥కె.వి.రమణాచారి, డి.రవీందర్, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఆచార్య వై.రెడ్డి శ్యామల, డా॥ నందిని సిధారెడ్డి, ఆచార్య సాగి కమలాకర శర్మ తదితరులు పాల్గొంటారు.

ఎన్నికల వేళ పండుగల సందడి

అభ్యర్థుల సిలుం వదిలిస్తున్న ఫెస్టివల్స్

- వినాయక, బతుకమ్మ, దేవి నవరాత్రుల ఖర్చులు భరింపు
- ఒక్కో పండుగ రెండు, మూడురోజుల నిర్వహణతో భారం
- అభ్యర్థుల క్యాంపు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఓట్ల కోసం పోటాపోటీగా చందాలు.. పంపకాలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:
తెలుగు క్యాలెండర్ ప్రకారం ప్రతియేటా భాద్రపద మాసం నుంచి పండుగల సీజన్ మొదలవుతుంది. ముందుగా వినాయక నవరాత్రి ఉత్సవాలతో పర్వదినాలు మొదలవుతాయి. ఈ ఏడాది అధిక శ్రావణ మాసంతో ఆ తర్వాత మాసాలన్నీ ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి. 2019లో జరగాల్సిన ఎన్నికలు 2018లో ముందస్తుగా రావడంతో ఐదేండ్ల పాలనకాలం పూర్తవడంతో 2023లోనూ సరిగ్గా అదే సమయంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. సెప్టెంబర్ నుంచే ఎన్నికల కోలాహలం మొదలైంది. అదే నెల 18వ తేదీ నుంచి గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 9న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. 13వ తేదీ నుంచి బతుకమ్మ సంబురాలు, 14 నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు షురూ అయ్యాయి. నవంబర్ 12న దీపావళి పర్వదినం కూడా ఉంది. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇలా వరుసగా వస్తున్న పండుగలు ప్రధాన పార్టీల అభ్యర్థులకు భారంగా మారాయి. ఓట్ల కోసం ఈ ఉత్సవాలన్నింటి ఖర్చుల్లో కొంతభాగం భరించాల్సి వస్తోంది. చందాల కోసం ఆయా ఉత్సవ కమిటీలు క్యాంప్ కార్యాలయాలను ఆశ్రయిస్తుండటంతో ఓట్ల కోసం కాదనలేని పరిస్థితి ఉంది.

రూ.కోట్లల్లో చందాలు..

వినాయక ఉత్సవాల నిర్వహణ ఖర్చుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది గణేశ్ ఉత్సవ కమిటీలకు రూ.వందల కోట్లల్లో ఆశావహులు, అభ్యర్థులు చందాలు ఇవ్వాల్సి వచ్చింది. ఒక ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 1200 వరకు విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న కందాల ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా భావిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక్కో గణేష్ ఉత్సవ కమిటీకి రూ.10వేలు, రూ.5వేల చొప్పున చందాలు ఇచ్చారు. ఇంతలోనే బతుకమ్మ సంబురాలు, దేవీ శరన్నవరాత్రులు షురూ అయ్యాయి. అంతే మళ్లీ అదే గోల.. క్యాంపు కార్యాలయాల చుట్టూ ఉత్సవ నిర్వహణ కమిటీలు తిరగడం ప్రారంభించాయి. వచ్చిన వారి పేర్లు నమోదు చేసుకోవడం.. బతుకమ్మల వేడుక దగ్గరకు వెళ్లడం రూ.3వేల నుంచి రూ.10వేల వరకు ఇవ్వడం.. పరిపాటిగా మారింది. భారీగా ఓటర్లున్న చోట రూ.20వేల వరకు కూడా సమర్పించుకుంటున్నారు. అదే సమయంలో ముఖ్యంగా మహిళలు, యువత నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీలకూ కానుకలు ఇవ్వక తప్పని స్థితి. రాష్ట్రంలోనే హాట్ సీటుగా మారిన పాలేరు నియోజకవర్గంలో అమ్మవారి విగ్రహాలు సుమారు నాలుగు వందల వరకు ప్రతిష్ఠించారు. కానుకలు, చందాలు ఇవ్వడంలో ఖ్యాతి గడించిన ఈ నియోజకవర్గ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఇరువురూ మళ్లీ సమర్పించుకుంటున్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక్కో అమ్మవారి విగ్రహానికి రూ.10వేల వరకు ఇచ్చారని, కందాల కూడా కొన్ని విగ్రహాలకు చందాలు సమర్పించుకున్నట్టు ప్రచారం సాగుతోంది.

యాటల ఖర్చులూ తప్పవు..

దసరా అంటేనే ముక్క, చుక్క.. ఈ పండుగ వేళ యాటలు విచ్చలవిడిగా తెగాల్సిందే. ఊళ్లల్లో పార్టీలు, గ్రామపంచాయతీలు, కమ్యూనిటీల వారీగా జట్లు ఏర్పడతాయి. పంచాయతీల్లో వార్డుమెంబర్లంతా కలిసి యాటలు కొస్తారు. కమ్యూనిటీల వారీగా కూడా యాటలు తెగుతుంటాయి. పార్టీల వారీగానూ మేక, గొర్రెపోతులను కట్ చేసి ఇంటింటికి తిరిగి మాంసాన్ని పంచుతారు. ఎన్నికల నేపథ్యంలో దీనికయ్యే ఖర్చులను ఈసారి ఆశావహులు, అభ్యర్థులు భరించాల్సిందే. దీనిలో భాగంగా పలుచోట్ల యాట పోతుల కోసం రూ.20వేల నుంచి రూ.లక్షల వరకు భరిస్తున్నట్టు తెలుస్తోంది. పనిలో పనిగా ముఖ్యనాయకులు, కుల, వ్యాపార, ఉద్యోగ సంఘాల నేతలు.. ఇలా ప్రతి ఒక్కర్నీ సంతృప్తి పరచాల్సి ఉంటుంది. ఈ ఖర్చులు కూడా రూ.లక్షల్లోనే ఉన్నట్టు సమాచారం. పట్టణ, పల్లె ప్రాంత నియోజకవర్గాలని తేడా లేకుండా దాదాపు అన్నిచోట్ల ఈ ఖర్చులు తప్పేలా లేవు. ఈ ఖర్చు నుంచి తేరుకునే లోగానే దీపావళి రూపంలో



మరో బాంబు పేలనుంది. నవంబర్‌లో దీపావళి నాటికి అన్ని పార్టీల అభ్యర్థులు ఖరారవుతారు. ప్రచారం కూడా మరింతగా ఊపందుకుంటుంది. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. సభలు, సమావేశాల నిర్వహణ వంటివి ఉంటాయి. కాబట్టి అభ్యర్థులకు ఖర్చు తడిసిమోపడయ్యేలా ఉంది. అప్పనంగా వచ్చిన సొమ్ములు ఐదేండ్లకు ఓసారి వచ్చే ఎన్నికలప్పుడు తప్ప తీసే పరిస్థితి లేదు కాబట్టి ఆ మేరకు వెచ్చించాల్సిందేననే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

ఒక్కో పండుగ రెండు, మూడు రోజులు..

అధిక మాసాలకు తోడు, తిథులు కూడా పండుగలు ఏరోజు జరుపుకోవాలనే విషయంలో సందిగ్ధతకు తావిస్తున్నాయి. తిథుల ప్రకారం పండుగలు నిర్వహించే ఆనవాయితీ హిందూ సంప్రదాయంలో ఉంది కాబట్టి ఈసారి సోమవారమా? లేక మంగళవారం నిర్వహించాలో సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం కూడా ఈనెల 23, 24 తేదీలను సెలవు దినంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రెండు, మూడురోజులు పండుగ చేసుకుంటారు కాబట్టి.. ఎన్నికల వేళ ఆ మూడు రోజుల భారం పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులు మోయాల్సిందే. పర్వదినాల సమయంలో ఎన్నికలు రావడాన్ని ఓటర్లు ఆస్వాదిస్తుండగా.. అభ్యర్థులు మాత్రం తలలు పట్టుకుంటున్నారు.

విజయానికి చిహ్నం దసరా..

- రాష్ట్ర ప్రజలకు సీఎం శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
దసరా పండుగ అనేది విజయానికి చిహ్నమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దీనికి తెలంగాణ సాంస్కృతిక జీవనంలో ప్రత్యేక స్థానముందని వివరించారు. దసరా సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలంతా ఒకేచోట గుమికూడి సామూహికంగా సంబురాలు జరుపుకోవటం సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శమని పేర్కొన్నారు.

దసరా తర్వాత రెండో జాబితా

- రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తివేతను స్వాగతిస్తున్నాం
- లక్ష్మీబ్యారేజీ పరిశీలనకు వెళ్లేవారిని అడ్డుకోవడం దారుణం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
దసరా పండుగ తర్వాత తమ పార్టీ అభ్యర్థుల రెండో జాబితాను ప్రకటిస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేతను స్వాగతిస్తున్నామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుంటున్న లక్ష్మీబ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయని విమర్శించారు. ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లిన రాజకీయ నాయకులను, ఇంజినీర్లను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు. లక్షన్నర కోట్ల రూపాయల ప్రాజెక్ట్ పతనమవుతుంటే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణంపై ఇంజినీర్లకూ అనేక అనుమానాలున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ 80వేల పుస్తకాలు చదివి సూపర్ ఇంజినీర్ అవతారమెత్తి నిపుణుల మాటలు ఖాతరు చేయకుండా ప్రాజెక్టు కట్టించారని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం ఇష్టానుసారంగా పెంచి రాష్ట్ర సంపదను కేసీఆర్ కొల్లగొట్టారని ఆరోపించారు. ప్రాజెక్టు సేఫ్టీపైన వెంటనే సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డ్యామ్ సేఫ్టీ అథారిటీని పిలిచి పరిశీలించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 52 మంది అభ్యర్థులతో ప్రకటించిన తమ తొలి జాబితాలో మాజీ శాసనసభ్యులు, మాజీ ఎంపీలు, మున్సిపల్ చైర్మెన్లు, తదితరులు చోటు దక్కించుకున్నారని చెప్పారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో ప్రధాని ఐదు సభల్లో, అమిత్ షా మూడు సభల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 27న అమిత్‌షా మరోసారి రాబోతున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమ పార్టీ అనుకూలంగా మలుచుకుంటున్నదన్నారు. కుటుంబ, అవినీతి పార్టీలను పక్కనబెట్టి తమను ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు. జనసేన అధినేతతో ప్రాథమికంగా కలిసి మాట్లాడామనీ, పొత్తు అంశం పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

వార్ వన్‌సైడే.. : ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో వార్ వన్‌సైడేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తమ పార్టీ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి తీరుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమ ప్రభుత్వం గత పదేండ్లలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించిందని చెప్పారు. 65 ఏండ్లపాటు అధికారాన్ని అనుభవించిన కాంగ్రెస్... ప్రజలను ఎప్పుడూ మోసం చేస్తూనే వచ్చిందని విమర్శించారు. ఆ పార్టీ చేయని పనులన్నింటినీ తమ పార్టీ కేవలం పదేండ్లలో చేసి చూపించిందని వివరించారు. అందువల్లే ఈసారి కూడా ప్రజలు తమను కచ్చితంగా ఆశీర్వదిస్తారని చెప్పారు.

119 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు

- రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ-హైదరాబాద్
అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ 119 స్థానాల్లో అభ్యర్థులను నిలబెడుతుందని తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ స్పష్టం చేశారు. పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా బలమైన నాయకత్వం ఉందన్నారు. ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. .ఈ సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు,పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు,అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జీలు ,నియోజకవర్గ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన కాసాని మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఖమ్మం బహిరంగ సభ, ఇంటింటికి తెలుగుదేశం, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 41వ పార్టీ ఆవిర్భావ సభ, కరీంనగర్ శంఖారావం సభ, 17 పార్లమెంట్ నియోజక వర్గాలలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు, మినీ మహానాడులు, ఇందిరా పార్క్ దర్నాచౌక్ వద్ద ప్రభుత్వ హామీలు-వైఫల్యాలపై మహాధర్నా తదితర ఆందోళనా కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

గాజాకు ఇంధనం నిలిపివేత...

ఇజ్రాయిల్ వైఖరితో ప్రమాదకరంగా 120 మంది నవజాత శిశువుల పరిస్థితి : ఐరాస ఆందోళన



జెరూసలేం : గాజాకు ఇజ్రాయిల్ ఇంధనం నిలిపివేయడంతో ఇన్‌క్యూబరేటర్లలో ఉన్న సుమారు 120 మంది నవజాత శిశువుల పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో వివిధ ఆసుపత్రుల్లో సుమారు 120 మంది నవజాత శిశువులు ఇన్‌క్యూబరేటర్లలో ఉన్నారు, ఇంధన నిల్వలు చివరిదశకు రావడంతో వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఐరాసకు చెందిన యునిసెఫ్ ఆదివారం తెలిపింది. వీరందరినీ విద్యుత్‌తో నడిచే ఇన్‌క్యూబరేటర్లలో ఉంచామని, ఇజ్రాయిల్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తే వీరి ప్రాణాలు ప్రమాదంలో పడినట్లే అని యునిసెఫ్ ప్రతినిధి తెలిపారు. ఇజ్రాయిల్ తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండటంతో, గాజా ఆసుపత్రుల్లో జనరేటర్లకు ఇప్పటికే ఇంధనం అయిపోయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గురువారం ప్రకటించింది. జనరేటర్లు ఆగిపోతే డయాలసిస్ అవసరం ఉన్న సుమారు వెయ్యి మంది ప్రాణాలకు ప్రమాదమని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. శనివారం ఈజిప్ట్ నుంచి గాజాకు సహాయక సామగ్రితో 20 ట్రక్కులు వచ్చినా వీటిల్లో ఇంధనం లేదు. హమాస్‌కు ఇంధనం సహాయపడుతుందని ఆరోపిస్తూ గాజాలోకి ఇంధనం పంపించడానికి ఇజ్రాయిల్ అడ్డుపడుతోంది.

పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం ఈ నెల 7న ఇజ్రాయిల్ దాడులు ప్రారంభమైన దగ్గర నుంచి ఇప్పటి వరకూ 1,750 మంది చిన్నారులు మరణించారు. గాజాలోని ఆసుపత్రులు మందులు, ఇంధనం, నీటి కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. ఇంధనం లేకపోవడంతో సుమారు 130 మంది నవజాత శిశులు చనిపోయే ప్రమాదం ఉందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. ఐరాస పాపులేషన్ ఫండ్ ప్రకారం గాజాలో ప్రతి రోజూ 160 ప్రసవాలు జరుగుతున్నాయి. గాజాలో ప్రస్తుతం సుమారు 50 వేల మంది గర్భిణులు ఉన్నారని అంచనా. వీరిలో ఇప్పటికే కొన్ని వందల మంది ఇజ్రాయిల్ ప్రస్తుత దాడుల్లో మరణించారు.

ఇజ్రాయిల్ దాడుల్లో 4,651 మంది మృతి

ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో ఇప్పటి వరకూ 4,651 మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. వీరిలో 1,873 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. మరో 14,245 మంది గాయపడినట్లు తెలిపింది. ఆదివారం తెల్లవారుజామున కూడా దక్షిణ గాజాపై వైమానిక దాడులతో ఇజ్రాయిల్ విరుచుకుపడింది.

గాజాపై యుద్ధం ఆపండి : పోప్ ఫ్రాన్సిస్

గాజాపై ఇజ్రాయిల్ తన యుద్ధాన్ని తక్షణమే ఆపాలని పోప్ ఫ్రాన్సిస్ ఆదివారం పిలుపునిచ్చారు. గాజాలోకి మరింత మానవీయ సహాయాన్ని అనుమతించాలని ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశారు. రోమ్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద ఆదివారం ప్రార్థనల తరువాత పోప్ ఈ పిలుపునిచ్చారు. 'యుద్ధంతో ఎల్లప్పుడూ ఓటమే ఎదురవుతుంది. యుద్ధం మానవ సోదరభావాన్ని నాశనం చేస్తుంది' అని పోప్ తెలిపారు. సరిహద్దులు తెరవాలని, మానవతా సహాయం అందించడం కొనసాగించాలని, బందీలను విడుదల చేయాలని మరోసారి కోరారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ ద్వారా అమెరికా యుద్ధం చేస్తోంది : ఇరాన్

అణచివేతకు గురైన పాలస్తీనా సాధారణ ప్రజలపై ఇజ్రాయిల్ ద్వారా అమెరికా యుద్ధం చేస్తోందని ఇరాన్ విదేశాంగ మంత్రి హోసిన్ అమిర్ అబ్దోల్లాహియాన్ విమర్శించారు. ఆసుపత్రులు, మసీదులు, చర్చిలు, సాధారణ పౌరులపై ఇజ్రాయిల్ దాడులకు మద్దతు ఇచ్చేందుకు బైడెన్ వెళ్లడం దురదృష్టకరమని అన్నారు. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న హత్యలు, సామూహిక హత్యలకు మద్దతుగా ఆయుధాలతో నిండిన వందలాది విమానాలు, షిప్‌లు, ట్రక్కులు పంపిస్తానని ప్రకటించడం శోచనీయమని విమర్శించారు.

తగ్గేదేలే..!

మంత్రి, మాజీ మంత్రి మాటకు మాట

- పోటాపోటీగా విమర్శలు.. ప్రతివిమర్శలు
- పువ్వాడ, తుమ్మల పరస్పర ఆరోపణలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:
ఖమ్మం నియోజకవర్గంలో మాటల యుద్ధం కొనసాగుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా భావిస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. తనదైన శైలిలో పువ్వాడ విమర్శలు చేస్తుంటే...దానికి దీటుగా తుమ్మల ప్రతిస్పందిస్తున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గత ఆదివారం తుమ్మల నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ దగ్గర నుంచి మంత్రి అజయ్ నాలుకకు పదును పెట్టారు. అదే రీతిలో తుమ్మల కూడా కౌంటర్లు మొదలుపెట్టారు. ఇద్దరు కూడా రాష్ట్రవ్యాప్తంగా పేరున్న నేతలు కావడం, ఒకే సామాజిక తరగతికి చెందినవారు అవడంతో వీరి మాటలు రాష్ట్రవ్యాప్తంగానూ చర్చనీయాంశమ య్యాయి.



బందిపోట్ల దగ్గర మొదలు...

పొంగులేటి, తుమ్మల స్టింగ్ ఆపరేషన్ సమయంలో పువ్వాడ హైదరాబాద్‌లో బీఫామ్ తీసుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో బందిపోట్లలా వచ్చి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఓ నలుగురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఇతర బీఆర్ఎస్ ముఖ్య నేతల ఇళ్లకు వెళ్లి వారిని కాంగ్రెస్‌లోకి స్వాగతించారు. అనంతరం వారిని తోడ్కొని హైదరాబాద్ వెళ్లి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్పించారు. నాటి నుంచి మంత్రి మాటల యుద్ధానికి తెరదీశారు. ఓ బీఆర్ఎస్ నేత ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల, పొంగులేటిలను బందిపోట్లలా అభివర్ణించారు. కేసీఆర్ రాజకీయంగా అనేక అవకాశాలను వీరిద్దరికి ఇచ్చారని, అయినా తుమ్మల తాను ఓడిపోవడమే కాక మిగిలిన 8 మందిలో ఒక్కర్నీ గెలిపించలేదని, తాను ఒక్కడినే గెలిచానని పువ్వాడ చెప్పుకొచ్చారు. దీనిపై మాజీ మంత్రి, మాజీ ఎంపీ దీటుగా స్పందించారు. బందిపోట్లను తయారు చేసింది ఎవరని ప్రశ్నించారు. ఐదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఖమ్మంలో నెలకొన్న పరిస్థితులను తుమ్మల ఏకరువు పెట్టారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యంతో జీవించారని వ్యాఖ్యానించారు. పువ్వాడ మంత్రిగా ఉన్న నాలుగున్నరేండ్లలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ.. అవినీతి, అక్రమార్కులు, కబ్జాకోరులు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. వ్యాపారస్తులు, ఉద్యోగులు పైసా పైసా పోగేసుకుని కొనుగోలు చేసుకున్న ప్లాట్లు, స్థలాలకు భద్రత కరువైందన్నారు. మొత్తమ్మీద మంత్రి పువ్వాడ కాలంలో అశాంతి నెలకొందని తుమ్మల కౌంటర్ ఇచ్చారు. పువ్వాడ పాలనను రజకారు ఖాసీం రజ్వీ పాలనతో పోల్చారు. ఈ వ్యాఖ్యలపై అజయ్ ఆదివారం మరోసారి స్పందించారు.



మరోసారి విరుచుకుపడిన మంత్రి..

పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించిన తుమ్మల ప్రస్తుత రాజకీయ, సామాజిక సమీకరణాల దృష్ట్యా ఖమ్మం నియోజకవర్గానికి షిఫ్ట్ అయ్యారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న పువ్వాడ నాటి నుంచి తుమ్మలపై విమర్శలకు తెరదీశారు. అజయ్ వ్యాఖ్యలకు తుమ్మల కౌంటర్ ఇస్తూనే.. మరికొన్ని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పువ్వాడ మరోసారి బీఆర్ఎస్‌కేవీ ఆటో యూనియన్ సమావేశంలో తుమ్మలపై విరుచుకుపడ్డారు. ఖమ్మంలో తుమ్మల ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో చేసిన రాజకీయ హత్యలు అన్నీఇన్నీ కావన్నారు. ఎందర్నో రాజకీయ సమాధి చేశారని వ్యాఖ్యానించారు. రౌడీయిజం, రౌడీషీటర్లను ప్రోత్సహించింది మీరు కాదా అని ప్రశ్నించారు. మంత్రి పదవి ఇచ్చిన ఎన్టీఆర్‌ను మోసం చేసి చంద్రబాబు దగ్గరకు వెళ్లావని, చంద్రబాబు దగ్గర మంత్రి పదవి పొంది.. ఆయన్ను మోసం చేసి కేసీఆర్ దగ్గరకు వచ్చి.. ఇక్కడా మంత్రి పదవి పొంది.. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరావని విమర్శించారు. ఏదీ నీ నిజాయితీ, ఏదీ నీ నిబద్ధత, ఏదీ నీ నికార్సుతనం' అంటూ పువ్వాడ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో నగర ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ మాటలయుద్ధం పువ్వాడ, తుమ్మలకు మాత్రమే పరిమితం కాకుండా ఇరుపార్టీల కార్పొరేటర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో నూతనంగా చేరిన నేతల వరకు కొనసాగుతోంది. ఎన్నికలు ముగిసే వరకు కూడా ఈ మాటల యుద్ధం ఆగకపోవచ్చని విమర్శకులు భావిస్తున్నారు.

బీజేపీలో అసంతృప్త రాగాలు

- రాజగోపాల్‌రెడ్డి అటా? ఇటా?
- పాలమూరులో డీకే వర్సెస్ జితేందర్‌రెడ్డి
- పద్మకు టికెట్ కేటాయింపుతో అలిగిన రాకేశ్‌రెడ్డి
- అధిష్టానాన్ని నిలదీస్తున్న టికెట్లు దక్కని నేతలు
- సర్దిచెప్పలేక తల పట్టుకుంటున్న రాష్ట్ర నాయకత్వం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
బీజేపీలో అసంతృప్త రాగాలు తీవ్రమయ్యాయి. ఇన్నేండ్ల నుంచి పార్టీని పట్టుకుని పనిచేస్తున్న తమను కాదని కొత్తవారికి టికెట్లు కేటాయించడంపై నేతలు గుస్సా అవుతున్నారు. రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని 'తమ పరిస్థితి ఏంటి?' అని పార్టీని నిలదీస్తున్నారు. వారికి సర్దిచెప్పలేక రాష్ట్ర నాయకత్వం తలలు పట్టుకుంటున్నది. ముఖ్యులందరూ బరిలో ఉండాల్సిందేనని జాతీయ నాయత్వం ఆదేశించినా చాలా మంది మాజీ ఎంపీలు, ముఖ్యనేతలు పోటీకి నిరాకరించడంతో బలహీన అభ్యర్థులను ప్రకటించాల్సిన పరిస్థితి ఆ పార్టీకి దాపురించింది. తాను మునుగోడు నుంచి పోటీ చేయాలా? ఎల్బీనగర్ నుంచి బరిలోకి దిగాలా? అని తేల్చకుండా రాజగోపాల్‌రెడ్డి అధిష్టానానికే పెద్ద తలనొప్పిగా తయారయ్యాడు. బీజేపీ ఫస్ట్ లిస్ట్ ప్రకటన తర్వాత పార్టీలో అసంతృప్తి జ్వాల మొదలైంది. టికెట్లు దక్కని ఆశావాహులు రాష్ట్ర కార్యాలయానికి చేరుకుంటున్నారు. ఇదే విషయంపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డిని వచ్చి కలిసినట్టు తెలుస్తోంది. దీంతో వారికి సర్దిచెప్పలేక ఆయనతోపాటు ముఖ్యనేతలు తిప్పలు పడినట్టు సమాచారం. కొందరు నేతలు ఒకడుగు ముందుకేసి 'ఇన్ని రోజులు కష్టపడ్డది వేరేవాళ్లకు త్యాగం చేయడానికా? తమను కాదని కొత్తవారికి ప్రాధాన్యత ఇస్తారా? ఇదేం పద్ధతి? పార్టీ నిర్మాణ పద్ధతి ఇదేనా? మేం కచ్చితంగా రెబల్‌గా ఉంటాం' అని ఖరాఖండిగా చెప్పినట్టు తెలిసింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఏనుగుల రాకేశ్ రెడ్డి తనకే టికెట్ వస్తుందని గంపెడాశలు పెట్టుకున్నారు. నియోజకవర్గానికి పరిమితమై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. తీరా ఇప్పుడు ఆ స్థానాన్ని రావు పద్మకు కేటాయించారు. పార్టీ నాయకత్వంపై ఆయన అనుచరులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మానకొండూరులో పార్టీ సీనియర్ నేత శంకర్‌కు కాకుండా ఇటీవల కొత్తగా చేరిన ఆరెపల్లి మోహన్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. రామగుండంలో ఇటీవల చేరిన జెడ్పీటీసీ కందుల సంధ్యారాణికి టికెట్ ఇచ్చింది. గోషామహల్ టికెట్ కేటాయిస్తామనే బలమైన హామీతోనే విక్రమ్‌గౌడ్ హస్తం పార్టీని వీడి కమలం గూటికి చేరారు. రాజాసింగ్‌పై వేటు, తదనంతర పరిణామాలతో క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తున్నారు. తీరా తొలిజాబితాలో ఆయన స్థానంలో రాజాసింగ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. దీనిపై ఆయన తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ నుంచి మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణకు బీజేపీ మొండిచేయి చూపించింది. ఆ స్థానం నుంచి ఎంపీ అర్వింద్ సూచించిన ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తాకు సీటిచ్చింది. అర్వింద్‌పై లక్ష్మీనారాయణ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇది ఎటువైపు దారితీస్తుందో చూడాలి.

'పాలమూరు'పై ఇరువురి పట్టు

మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిత్వం ప్రకటన బీజేపీకి కొరకరాని కొయ్యగా మారింది. ఈ విషయంలో కరవమంటే కప్పకు కోపం..విడమంటే పాము కోపం అన్న చందంగా ఆ పార్టీ పరిస్థితి తయారైంది. తనకు కచ్చితంగా ఆ సీటు కేటాయించాలని డీకే అరుణ పట్టుబడుతున్నది. జాతీయ నాయకత్వం మాత్రం ఆ సీటును మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డికి ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. దీనికి ఆయన సముఖంగా లేరు. తన కొడుక్కి ఆ సీటు ఇస్తే కచ్చితంగా గెలిపించుకుని వస్తానని అధిష్టానం వద్ద సవాల్ చేసి మరీ పట్టుబడుతున్నారు. దీంతో ఎటూ తేల్చుకోలేక ఎన్నికల కమిటీ ఆ నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టేసింది.

హోల్డ్‌లో మునుగోడు

బీజేపీ తొలి జాబితాలో స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ రాజగోపాల్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడులో సింపతితో ఆయన కచ్చితంగా గెలుస్తాడని బీజేపీ నాయకత్వం ప్రచారం చేస్తున్నది. కానీ, ఆయన మాత్రం అక్కడ నుంచి పోటీచేసేందుకు వెనకాముందు ఆలోచిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఎన్నిసార్లు సర్వే చేయించుకున్నా కాంగ్రెస్,బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో ఉంటే తాను గెలవడం సాధ్యం కాదని తేలటంతో ఆయన పునరాలోచనలో పడ్డారు. ఒకవేళ కాంగ్రెస్ గనుక ఆ సీటును సీపీఐకి కేటాయిస్తే కాంగ్రెస్ ఓట్లు తనకు క్రాస్ అయితే గెలువొచ్చనే ఆలోచనతో ప్రస్తుతానికి తన అభ్యర్థిత్వాన్ని హోల్డ్‌లో పెట్టాలని రాజగోపాల్‌రెడ్డి జాతీయ నాయకత్వాన్ని కోరినట్టు సమాచారం. మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి బరిలో ఉంటే తనకు ఎల్బీనగర్ సీటు కేటాయించాలనీ, లేనిపక్షంలో తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయబోనని ఆయన స్పష్టం చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆయన ఎల్బీ నగర్‌కు రావడంపై రంగారెడ్డి జిల్లా బీజేపీ నేతలు అస్సలు అంగీకరించడం లేదు.

కేసీఆర్ వర్సెస్ ఈటల

- గజ్వేల్, హుజురాబాద్ బరిలో రాజేందర్
- 52 మంది అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితా
- వివేక్, విజయశాంతి, రాజగోపాల్‌రెడ్డిలకు దక్కనిచోటు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 52 మంది అభ్యర్థులతో తొలిజాబితాను బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించింది. అందులో 12 మంది మహిళలకు సీట్లు కేటాయించింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ వేటును ఎత్తివేసి ఆయన అభ్యర్థిత్వాన్ని కూడా ఖరారు చేసింది. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌పై ఈటల రాజేందర్‌ను బరిలోకి దింపింది. పశ్చిమబెంగాల్‌లో సీఎం మమతాబెనర్జీపై సువేందు అధికారిని బరిలోకి దింపి లబ్ధిపొందటంతో అదే వ్యూహాన్ని తెలంగాణలోనూ అమలు చేస్తున్నది. ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, బాపూరావు, ధర్మపురి అర్వింద్‌ను అసెంబ్లీ ఎన్నికల గోదాలోకి దింపింది. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై కె.వెంకటరమణారెడ్డిని పోటీలో నిలిపింది. కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పోటీకి దూరంగా ఉంటారనే సంకేతాల నేపథ్యంలో అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించలేదు. ముషీరాబాద్ సీటును హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మితో పాటు గుండగోని భరత్‌గౌడ్, పలువురు కార్పొరేటర్లు ఆశిస్తున్నారు. అంబర్‌పేట స్థానం నుంచి కిషన్‌రెడ్డి భార్య కావ్య, గౌతమ్‌రావు, కృష్ణయాదవ్, విక్రమ్‌గౌడ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఈవిషయంలో ఎటూ తేల్చలేక జాతీయ నాయకత్వం ప్రస్తుతానికి ఆ నియోజకవర్గాన్ని పక్కనపెట్టేసింది. మొత్తంగా 52 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా అందులో 20 మంది బీసీలున్నారు. 12 మంది మహిళా అభ్యర్థులు, 8 మంది ఎస్సీ, ఆరుగురు ఎస్టీ అభ్యర్థులున్నారు. ప్రకటించిన జాబితాలో ఉత్తర తెలంగాణ పరిధిలోని నియోజకవర్గాలే ఎక్కువగా ఉన్నాయి.

గ్రేటర్‌లో 15లో 7 స్థానాలకే

హైదరాబాద్ నగరం పరిధిలోని 15 స్థానాలకుగానూ 7 స్థానాల్లోనే అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. అందులో ఖైరతాబాద్ మినహా అన్నీ పాతబస్తీవే కావడం గమనార్హం. జూబ్లీహిల్స్, ముషీరాబాద్, ఉప్పల్, అంబర్‌పేట్, ఎల్బీనగర్, సికింద్రాబాద్, సనత్‌నగర్ ఇలా ముఖ్యమైన స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదు. మునుగోడు పంచాయతీతో ఎల్బీనగర్, ఆధిపత్య పోరుతో అంబర్‌పేట, కీలక నేతల ఒత్తిడితో ముషీరాబాద్, విష్ణువర్ధన్‌రెడ్డి కోసం జూబ్లీహిల్స్ స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. అటు సీనియర్ నేత ఒత్తిడి..ఇటు ఇద్దరు యువ నేతల మధ్య గొడవతో మల్కాజిగిరిని పక్కనబెట్టేసింది.

'దక్షిణ'లో అభ్యర్థుల ప్రకటనలోనూ వీకే

నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల అభ్యర్థుల ప్రకటనలోనూ బీజేపీ వీక్‌గా కనిపించింది. మొత్తం 36 స్థానాలకుగానూ కేవలం 8 సీట్లలోనే తొలిజాబితాలో అవకాశం కల్పించింది. అందులోనూ బలమైన అభ్యర్థులు ఇద్దరు ముగ్గురే ఉన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 స్థానాలుంటే కల్వకుర్తి, కొల్లాపూర్ స్థానాలకే అభ్యర్థులను ప్రకటించింది. డీకే అరుణ, జితేందర్‌రెడ్డి మధ్య ఆధిపత్య పోరుతో షాద్‌నగర్, మహబూబ్‌నగర్, గద్వాల అభ్యర్థులను ప్రకటించలేదు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. ఆయా స్థానాల్లో బీజేపీకి కనీసం డిపాజిట్లు కూడా తెచ్చుకోలేని స్థాయిలో నేతలుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ అసంతృప్త నేతలకు గాలం వేసి టికెట్లను ఇచ్చే ఆలోచనలో బీజేపీ అధిష్టానం ఉన్నట్టు తెలుస్తున్నది.

ఎన్నికలొస్తే చాలు...

మతరాజకీయం జోడించేలా ప్రచారాలు

- కార్యక్రమమేదైనా సోషల్ మీడియాలోకి రావాల్సిందే
- మోడీ రాజకీయ వ్యూహంపైనే చర్చ

కార్యక్రమం.. సందర్భం.. అది ఏదైనా.. దానిని రాజకీయ ప్రచారాస్త్రంగా మలుచుకోవటంలో ప్రధాని మోడీ ముందుంటున్నారు. కాశ్మీర్‌లో పర్యటన చేసినా.. కన్యాకుమారిలో కార్యక్రమంలో పాల్గొన్నా.. ఆయన చేసే ప్రతీదీ రాజకీయంగానే ఉంటుందనే వార్తలు ఇప్పటికే ప్రచారంలో ఉన్నాయి. నిత్యం వార్తల్లోనే ఉంటారనీ, సామాజిక, రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా ఉంటారని విశ్వవ్యాప్తంగా అంగీకరించబడింది. ప్రజల దృష్టిని ఆకర్శించటానికి ఆయన అధిక శ్రద్ధ కనబరుస్తారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇందుకు ఆయన మతపరమైన విషయాలతోనూ బిజీగా ఉంటూ.. వాటిని సైతం ప్రచారంగా మలచుకుంటున్నారని గుర్తు చేస్తున్నారు.



న్యూఢిల్లీ : ముఖ్యంగా, ఇటీవల ఆయన పర్యటనలను చూస్తే ఏ రాష్ట్రానికి వెళ్లినా.. మరే ఇతర ప్రాంతంలో పర్యటించినా.. అక్కడ ఉండే ప్రతిష్టాత్మక ఆలయాలు, ప్రదేశాలను సందర్శిస్తున్నారు. అక్కడ పూజల్లో, ఇతర సాంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల దృష్టిని తన వైపు మల్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అక్టోబరు 12న ఉత్తరాఖండ్‌లోని పార్వతి కుండలో దర్శనం చేశారు మోడీ. దీనికి సంబంధించి పలు సోషల్ మీడియా హ్యాండిల్స్, ప్రధానమంత్రి అధికారిక సైట్‌లలో ప్రచురించబడిన వీడియోలు, చిత్రాలు ప్రజల దృష్టిని ఆకర్షించింది. మహాత్మా గాంధీ జయంతికి ఒక రోజు ముందు స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రచారం చేయడానికి మోడీ చీపురును ఉపయోగించిన ఫోటోలు మరవకముందే పై చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో ఎక్కాయి.

ఇక ఇలాంటి చిత్రాలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్(ట్విట్టర్) వంటి సామాజిక మాధ్యమాల్లో బీజేపీ, దాను అనుబంధ సంఘాలు విపరీతమైన ప్రచారాన్ని కల్పిస్తున్నాయి. మోడీని ఆకాశానికి ఎత్తుతున్నాయి. బాలీవుడ్ చిత్రాలకు సంబంధించిన పాటలతో ఎక్కువ మొత్తంలో లైక్‌లు, వీక్షణలు వచ్చే విధంగా ఐటీ సెల్ ప్రభావవంతంగా పని చేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఇక కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో మోడీ వేషధారణ సైతం ప్రజల దృష్టిని ఆకర్షించేదిగా ఉన్నదని తెలిపారు. పెరిగిన గడ్డంతో ఆయనను ఒక దూరదృష్టి పాలకుడిగా చిత్రీకరించే ప్రయత్నాలు సామాజిక మాధ్యమాల్లోని బీజేపీ ఐటీ సెల్ చేసిందని అన్నారు. కరోనా మహమ్మారి విషయంలో మోడీ కష్టపడుతున్న తీరు గర్వించదగినదంటూ ప్రచారాలు చేసుకున్నాయి.

2019 మేలో కేదార్‌నాథ్ ఆలయ సముదాయంలోని గుహలో ఉన్నట్టుగా కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. బీజేపీ తన ఆయుధమైన హిందుత్వకు మోడీ ఈ పర్యటనతో మరింత ప్రచారం కల్పించేలా చేశాయి. మోడీ రాజకీయాలలో స్వీయ ప్రదర్శన ఎక్కువగా ప్రధానమైందనీ, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆయనకు ప్రచారం మీద ఉన్నంత ధ్యాస ప్రజా సంక్షేమంపై ఉండదని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. అందుకే మీడియా ముందుకు వచ్చి సమాధానం చెప్పే ధైర్యం చేయని ప్రధాని.. తనకు అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారంపై దృష్టి పెట్టి రాజకీయ ప్రయోజనం పొందాలనే లక్ష్యంతో పని చేస్తున్నాడని అంటున్నారు.

మహో దారుణం

- గిరిజన మహిళను వివస్త్ర చేసి...
- నడిరోడ్డుపై కొట్టిన కేసులో బీజేపీ ఎమ్మెల్యే భార్య, ముగ్గురిపై కేసు



ముంబయి : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అంతులేని దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. మహారాష్ట్రలో గిరిజన మహిళను నడిరోడ్డుపై వివస్త్ర చేసి కొట్టారు. ఈ వీడియో వైరల్ కావటంతో.. బీజేపీ ఎమ్మెల్యే భార్య సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఓ గిరిజన మహిళ రోడ్డుపై బట్టలు లేకుండా నడుస్తున్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. ఆదివారం (అక్టోబర్ 15) తనపై బీజేపీ ఎమ్మెల్యే సురేష్ దాస్ భార్య ప్రజక్తా సురేశ్ దాస్ వ్యక్తులు దాడి చేశారని బాధిత మహిళ ఆరోపించింది.

బీజేపీ ఎమ్మెల్యే భార్య తన అనుచరుల సహాయంతో తన పూర్వీకుల భూమిని లాక్కోవాలనుకుంటోందని మహిళ ఆరోపించింది. సుమారు 70 ఏండ్లుగా ఉన్న తమ భూమిని గుంజుకోవాలని చూస్తున్నారంటూ.. ఆమె తెలిపారు.అయితే తన భార్యపై వచ్చిన ఆరోపణలన్నింటినీ ఎమ్మెల్యే సురేష్ దాస్ తోసిపుచ్చారు. అదంతా అబద్ధమని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే సురేశ్ దాస్ భార్య ప్రజక్తా సురేశ్ దాస్, రాహుల్ జగ్దాలే, రఘు పవార్‌లపై ఐపీసీ సెక్షన్ 354, 354 బీ, 323, 504, 506, 354 ఏ, 34, షెడ్యూల్డ్ కులాలు, తెగల చట్టం కింద కేసు నమోదైంది. పోలీస్ స్టేషన్ కింద కేసు నమోదు చేశారు.

మణిపూర్ సరిహద్దుల్లో భారీగా బలగాలు

- 26 వరకు ఇంటర్నెట్ నిషేధం



ఇంఫాల్ : మణిపూర్ అగ్గి ఇంకా చల్లారటంలేదు. ఇప్పటివరకూ ఇంటర్నెట్ సౌకర్యాన్ని పునరుద్ధరించలేదు. దీనికి తోడు ఇపుడు సరిహద్దు ప్రాంతాల్లో పోలీసు బలగాలను భారీగా దింపారు. మయన్మార్ సరిహద్దులోని మోరే నగరంలో గిరిజన మహిళలు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నారు.ఇంఫాల్ లోయ కంటే నగరంలోనే ఎక్కువ మంది భద్రతాబలగాలను దింపుతున్నారనిగిరిజన సంఘాలు కుకి ఇంపి , గిరిజన ఐక్యత కమిటీ పేర్కొన్నాయి.

నగరంలోని బఫర్ జోన్‌లో భారీ సంఖ్యలో పారామిలటరీ బలగాలు , ఇండియన్ ఆర్మీ సిబ్బందిని మోహరించినట్టు కుకి ఇంపి సంస్థ పేర్కొంది. అయినప్పటికీ, కుకీ-ఆధిపత్య పట్టణమైన తెంగ్నౌపాల్ జిల్లాలోని మోరేలో రాత్రిపూట అదనపు మెయిటీ పోలీసులను హెలికాప్టర్ ద్వారా మోహరిస్తున్నారు.మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక సంఘటనల కారణంగా ఇంటర్నెట్‌పై నిషేధాన్ని 26 వరకు పొడిగించారు. మణిపూర్ హైకోర్టు తీర్పుపై అప్పీలు చేసుకునేందుకు అనుమతి మణిపూర్ హైకోర్టు మార్చి 27 ఉత్తర్వులపై అప్పీల్ దాఖలు చేయడానికి రాష్ట్రంలోని గిరిజన సంస్థలకు అనుమతి ఇచ్చింది. మెయిటీ కమ్యూనిటీకి ఎస్టీ హోదా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.


'ది వైర్'లో ప్రచురితమైన రెండు రిపోర్టులకు అవార్డులు



న్యూఢిల్లీ : 'ది వైర్' న్యూస్ పోర్టల్‌లో ప్రచురితమైన రెండు రిపోర్టులకు అవార్డులు దక్కాయి. సయాంతన్ దత్త రాసిన ఆర్టికల్, పవన్‌జోత్ కౌర్, సౌమశ్రీ సర్కార్‌లకు చెందిన వీడియోలు 2023 సంవత్సరానికి గానూ లాడ్లీ మీడియా అవార్డులను పొందాయి. దత్త రాసిన ఆర్టికల్ 'ఇండియన్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్స్ క్యూరియస్ పెంచాంట్ ఫర్ జెండర్డ్ హాస్టల్స్' ది వైర్ సైన్స్‌లో ప్రచురితమైంది. ఇది ఇంగ్లీష్ (ఫీచర్స్) విభాగంలో అవార్డును దక్కించుకున్నది. ఇక కౌర్, సర్కార్‌లకు చెందిన వీడియో రిపోర్టు.. దక్షిణ బెంగాల్‌కు చెందినది. ఇందులో రెండు గ్రామాలలో వాతావరణ పరిస్థితులు, అక్కడి మహిళలు చేసిన కృషి గురించి వివరించారు. ఇది కూడా ఇంగ్లీష్ (ఫీచర్) విభాగంలో అవార్డును సొంతం చేసుకున్నది.

బీజేపీ ఎంపీలకు ఓ లెక్కా..మాకో లెక్కా..!

- వివిధ ప్రమాణాలు పాటిస్తున్న పార్లమెంటరీ ప్యానెల్ : బీఎస్పీ ఎంపీ దానీశ్ అలీ ఆరోపణలు



న్యూఢిల్లీ : బీజేపీ ఎంపీల విషయంలో పార్లమెంటరీ ప్యానెల్స్ అనుసరిస్తున్న తీరును బీఎస్పీ ఎంపీ దానీశ్ అలీ తప్పుబట్టారు. బీజేపీ ఎంపీలు చేసే ఫిర్యాదులు లేదా వారిపై వచ్చే ఫిర్యాదుల విషయంలో ఇవి వివిధ ప్రమాణాలు పాటిస్తున్నాయని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మోయిత్రకు వ్యతిరేకంగా బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చేసిన ఫిర్యాదును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో దనీశ్ అలీ ఉటంకించారు. బీజేపీ ఎంపీ రమేశ్ బిధురీ మతపరమైన, అసభ్య పదజాలంతో తనను దూషించటంపై ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదుతో పోలిస్తే నిశికాంత్ దూబే ఫిర్యాదును భిన్నంగా చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్యానెల్ ముందుకు తొలుత నిందితుడిని పిలవడానికి ముందు ఫిర్యాదుదారుడిని పిలవాలని పై రెండు ఘటనల గురించి వివరిస్తూ తన అభిప్రాయాన్ని వివరించారు.


ఫైల్

అభ్యర్థుల ఎంపికలో తప్పిదాలకు తావివ్వొద్దు

స్క్రీనింగ్ కమిటీలో నేతల నిర్ణయం

- వామపక్షాల పొత్తు, అభ్యర్థుల ఎంపికపై చర్చ
- 26న సీఈసీ భేటీ...అదే రోజు తుది జాబితా విడుదల..!

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం కనిపిస్తోందని, అందువల్ల మిగిలిన స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వొద్దని కాంగ్రెస్ నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. 55 స్థానాలకు ఈనెల 15న విడుదల చేసిన మొదటి జాబితాలో సిట్టింగ్ లు, మాజీలు, పార్టీ ముఖ్య నేతలు ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, అయితే పార్టీ అధికారంలోకి రావాలంటే మిగిలిన 64 సీట్లు కూడా కీలకమని గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండో జాబితా విడుదలయ్యే స్థానాలపై క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించి ఫైనల్ చేయాలని నిర్ణయానికి వచ్చారు. ఆదివారం ఢిల్లీలోని రకాబ్ గంజ్ గురుద్వారా రోడ్ లోని కాంగ్రెస్ వార్ రూంలో స్క్రీనింగ్ కమిటీ భేటీ అయింది. స్క్రీనింగ్ కమిటీ ఛైర్మెన్ మురళీధరన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో సభ్యులు జిగ్నేశ్ మేవాని, ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలకు పైగా సాగిన ఈ భేటిలో వామపక్షాలతో పొత్తు, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో అభ్యర్థుల ఎంపిక, మిగిలిన స్థానాలకు సంబంధించిన అభ్యర్థులపై చర్చించారు. వామపక్షాలకు కేటాయించే స్థానాలతో కూడిన జాబితాను కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) కి పంపాలని నిర్ణయానికి వచ్చారు.

26న సీఈసీ భేటీ...

అభ్యర్థుల తుది జాబితా కోసం మరోసారి స్క్రీనింగ్ కమిటీ భేటీ కానున్నట్టు తెలుస్తుంది. ఆ రోజే వామపక్ష పార్టీలతో పొత్తుపై స్పష్టత, వారికి సీట్ల కేటాయింపు, మిగిలిన స్థానాలకు అభ్యర్థులతో జాబితాను రూపొందించనున్నారు. అనంతరం కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ)కి ఆ జాబితాను పంపనున్నారు. కాగా ఈ నెల 26న సీఈసీ భేటీ కానుందని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ భేటి తరువాత మిగిలిన స్థానాలకు సంబంధించిన జాబితా విడుదల కానుంది.

తెలంగాణ లో ప్రభుత్వం మారుతుంది

త్వరలో తెలంగాణలో ప్రభుత్వం మారనుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తో కలిసి ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్ దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాకు చాదర్ సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఒక లౌకికవాదిగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మినవాడిగా దర్గాకు వచ్చానన్నారు. దేశంలోనే నిజాముద్దీన్ దర్గాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. హజ్రత్ నిజాముద్దీన్ దర్గాలో ఏది కోరుకుంటే అది జరుగుతుందని ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల్లో లౌకిక ప్రభుత్వాలు ఏర్పాటు కావాలని దర్గాలో ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అందాలని కోరుకున్నట్లు వెల్లడించారు. హిందువులు-ముస్లింలు కలిసి ఉంటూ మతసామరస్యాన్ని కాపాడే విధంగా పరిపాలన అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందన్నారు. దేశ గొప్పతనాన్ని కాపాడే ప్రయత్నం రాహుల్ గాంధీ చేశారని, ఈ దిశలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.



సీఎం ఒకలా.. గణాంకాలు ఇంకోలా

హర్యానాలో ఖట్టర్ సర్కారు అవాస్తవాలు

- నిరుద్యోగ రేటు తగ్గుతున్నదని వెల్లడి
- హర్యానాలోనే రెండో అత్యధిక నిరుద్యోగమంటున్న ఎన్ఎస్ఎస్ఓ సమాచారం
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ప్రతిపక్షం ఆగ్రహం



చండీగఢ్ : బీజేపీ పాలిత రాష్ట్రం హర్యానాలో నిరుద్యోగం ఆందోళన కలిగిస్తున్నది. అధికారిక గణాంకాల ప్రకారం భారత్‌లోని పెద్ద రాష్ట్రాల్లో అత్యధిక నిరుద్యోగం కలిగిన రెండో రాష్ట్రంగా హర్యానా ఉన్నది. అయినప్పటికీ, అక్కడి ప్రభుత్వం మాత్రం నిజాలను దాచిపెడుతున్నది. రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతున్నదని ప్రచారాలు చేసుకుంటున్నది. ఇప్పుడిదే అక్కడి అధికారి, ప్రతిపక్షాల మధ్య నిప్పు రాజేస్తున్నది. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పి ఉంచుకోవటంలో భాగంగానే ఇలా అవాస్తవాలు ప్రచారం చేసుకుంటున్నదని అంటున్నది. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు కల్పించటంలో విఫలమవుతున్నదని ఆరోపిస్తున్నది.

2022 జులై నుంచి 2023 జూన్ వరకు ఉన్న నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) సమాచారం ప్రకారం.. హర్యానాలో నిరుద్యోగ రేటు 6.1 శాతంగా (పట్టణ, గ్రామీణ ప్రాంతాలు కలుపుకొని) ఉన్నది. అలాగే, ఇక్కడ పట్టణ నిరుద్యోగ రేటు 6.5 శాతంగా ఉన్నది. అయితే, మనోహర్‌లాల్‌ఖట్టర్ సర్కారు రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 6.1 శాతానికి తగ్గిందనీ, తమ ప్రభుత్వం నిర్విరామంగా తీసుకుంటున్న చర్యల కారణంగానే ఇది సాధ్యమైందని చెప్పుకుంటున్నది. 2014లో మనోహర్‌లాల్ ఖట్టర్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి రాష్ట్రంలోని యువతకు 1.10 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

అయితే, ప్రభుత్వం వాదనలను అక్కడి ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికీ నిరుద్యోగం ఆల్ టైమ్ గరిష్టంగా ఉన్నదని అంటున్నాయి. "15 నుంచి 29 ఏండ్ల మధ్య వయస్సునవారిలో ప్రభుత్వం నిరుద్యోగ రేటును చూడాలి. అది 17.5 శాతంగా ఉన్నది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి యువతకు ఉద్యోగాలు అందటం లేదు. 2019లో ఆయన రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే యువతకు కల్పించబడ్డాయి" అని హర్యానా అసెంబ్లీలో ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్ర స్థాయిలో ఉన్నదని హర్యానా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దివ్యాన్షు బుధిరాజ ఆరోపించారు.

పాలస్తీనాకు భారత్ సాయం..

- 6.5 టన్నుల సామగ్రితో బయల్దేరిన విమానం



ఢిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధ నేపథ్యంలో తీవ్రంగా నష్టపోయిన పాలస్తీనా ప్రజలకు సాయం అందించేందుకు భారత్ సిద్ధమైంది. సామగ్రి, ఔషధాలను ఆదివారం గాజాకు పంపించింది. 'ప్రాణాధార ఔషధాలు, శస్త్రచికిత్స వస్తువులు, గుడారాలు, స్లీపింగ్ బ్యాగ్స్, టార్పాలిన్లు, శానిటరీ యుటిలిటీస్, నీటి శుద్ధీకరణ మాత్రలు ఇతర వస్తువులను' మానవతా సాయంలో భాగంగా పంపిస్తున్నామని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ ట్విటర్‌లో(ఎక్స్)లో పోస్టు పెట్టారు. భారత వైమానిక దళానికి చెందిన ఐఏఎఫ్ సీ-17 విమానంలో మొత్తం 6.5 టన్నుల సామగ్రి వెళ్తోందని చెప్పారు. ఈ సామగ్రిని తొలుత ఈజిప్టులోని ఈఎల్-అరిష్ విమానాశ్రయానికి చేరుస్తారు. అక్కడి నుంచి రఫా సరిహద్దు గుండా గాజాకు తీసుకెళ్తారని తెలిపారు.

నేపాల్‌లో 6.1 తీవ్రతతో భూకంపం

కాట్మాండు : నేపాల్ రాజధాని కాట్మాండులో ఆదివారం 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూప్రకంపనలతో వణికిపోయిన జనం భయంతో రోడ్లపైకి వచ్చి పరుగులు తీశారు. భూకంప కేంద్రం ధడింగ్‌లో ఉన్నట్టు నేపాల్ జాతీయ భూకంప పర్యవేక్షణ, పరిశోధన సంస్థ తెలిపింది. ఉదయం 7.39 గంటల సమయంలో భూకంపం సంభవించింది. బాగ్‌మతి, గండకి ప్రావిన్సుల్లోనూ ప్రకంపనలు సంభవించాయి. ఆ తరువాత రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. వీటి కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు.

దుకాణాలపై కాషాయ జెండాలు ఎగరేయాలి

మంగళూరులో వీహెచ్‌పీ హుకుం

మంగళదేవి నవరాత్రి ఉత్సవాలకు మతం రంగు



మంగళూరు : అది కర్నాటకలోని మంగళూరులో ఉన్న మంగళదేవి ఆలయం. అక్కడ దేవీ నవరాత్రి ఉత్సవాల కోసం చిన్న షాపులకు, ఎండోమెంట్ శాఖ వేలం పెట్టింది. ఆలయానికి దారితీసే రోడ్డులో రాజస్థాన్‌కు చెందిన ముకేష్ సింగ్ ఓ దుకాణం నడుపుతున్నారు. ఆ షాపుపై కాషాయ పతాకం రెపరెపలాడుతోంది. ఆ దుకాణాల్లో గాజులు మొదలు పాత్రల వరకూ వివిధ రకాల సామగ్రిని విక్రయిస్తుంటారు. కొందరు వ్యక్తులు ఈ నెల 17వ తేదీ ఉదయం దుకాణానికి వచ్చారని, కాషాయ పతాకం ఎగరేయాలని అడిగారని, దానికి తాను అంగీకరించానని సింగ్ చెప్పారు. దుకాణంపై ఓ పార్టీకి చిహ్నంగా కన్పించే జెండా ఎగురుతున్నప్పటికీ ప్రజలు ఆ షాపులో తమకు కావాల్సినవి మాత్రమే కొనుగోలు చేసుకుంటున్నారు.

గత కొన్ని రోజులుగా హిందూ ఆలయాల వద్ద ముస్లింల దుకాణాలు ఉండరాదన్న డిమాండ్‌ను సంఘ్ పరివార్ శక్తులు ముందుకు తెస్తున్నాయి.కర్నాటకలో బీజేపీ అధికారంలో ఉండగా ఆడిందే వట,పాడిందే పాటగా సాగింది. విసిగి వేసారిన జనం మొన్నటి ఎన్నికల్లో ఓడించారు. అయినా వెనకటి గుణమే మాను అన్న తీరుగానే ఉంది వీహెచ్‌పీ ధోరణి.

మంగళదేవి ఆలయం దేవాదాయ శాఖ అధీనంలో నడుస్తోంది. నవరాత్రి సందర్భంగా అధికారులు దుకాణాల ఏర్పాటు కోసం రెండు దఫాలుగా వేలం నిర్వహించి 82 షాపులు కేటాయించారు. వాటిలో ఆరు షాపులు ముస్లింలకు, ఒకటి జైన మతస్థుడికి కేటాయించారు. ఎనిమిది దుకాణాలను హిందువులకు కేటాయించగా వారు వాటిని ముస్లింలకు సబ్ లీజుకు ఇచ్చారు. ఇక్కడే వివాదం చెలరేగింది.

ఈ నెల 17న వీహెచ్‌పీ దక్షిణ కర్నాటక ప్రాంత సంయుక్త కార్యదర్శి శరణ్ పంప్‌వెల్ కొందరు పరిషత్ కార్యకర్తలతో వచ్చి కొన్ని ఎంపిక చేసుకున్న దుకాణాలపై కాషాల జెండాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాషాయ పతాకాలు కట్టిన దుకాణాలలోనే కొనుగోళ్లు చేయాలంటూ ప్రజలకు పిలుపు ఇచ్చారు. పండుగ ఉత్సవాల్లో ముస్లిం వ్యాపారులను అనుమతించవద్దంటూ వీహెచ్‌పీ, కోస్తా కర్నాటకలోని కొన్ని హిందుత్వ గ్రూపులు ప్రచారం చేశాయి. దీనిపై దక్షిణ కన్నడ వ్యాపారుల సమన్వయ సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. పంప్‌వెల్, ఇతర వీహెచ్‌పీ కార్యకర్తలపై మంగళూరు పోలీసులు ఐపీసీ సెక్షన్ 153ఏ కింద కేసులు నమోదు చేశారు. అయితే పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై నిందితులు కర్నాటక హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం స్టే విధించింది.

కాగా కొన్ని ఇతర ఉత్సవాలలో దుకాణాలపై ఆకుపచ్చని పతాకాన్ని ఎగరేయాలని ముస్లింలు కోరారని సునీల్ అనే రెడీమేడ్ వస్త్ర దుకాణ యజమాని చెప్పారు. తన దుకాణంపై వీహెచ్‌పీ కోరికపై కాషాయ జెండా, ముస్లింల కోరికపై ఆకుపచ్చని జెండా ఎగరేశానని తెలిపారు. అయితే మంగళదేవి నవరాత్రి ఉత్సవాల్లో దుకాణాలపై కాషాయ జెండా ఎగరేయాలని వీహెచ్‌పీ కోరడం ఇదే మొదటిసారి అని ఆయన అన్నారు.

అసలు ఎవడికీ పెద్దగా వ్యాపారాల్లేవు. హిందూవులు,ముస్లింలు అన్న దాంతో తేడా లేకుండా ఉంది. నువ్వు కాషాయ జెండా పెట్టినంత మాత్రాన హిందువులు తండోప తండాలుగా షాపులకు ఎగబడుతున్న పరిస్థితి లేదు.

ఆకుపచ్చజెండా ఉందా.. కాషాయ జెండా ఉందా ఏనే దాతో సంబంధం లేకుండా భక్తులు తమకి కావాల్సిన సరుకుల్ని కోనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ఎవడికీ పెద్ద లాభదాయకంగా వ్యాపారం లేదని సునీల్, జాకీర్ హుస్సేన్ అనే వ్యాపారులు చెప్పారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

7

ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్

సోమవారం | అక్టోబర్ 23, 2023 | www.navatelangana.com

రహదారుల్లో గుంతలు.. రాకపోకలకు అవస్థలు..



నవతెలంగాణ - సంతోష్ నగర్

శ్రీశైలం అచ్చంపేట కల్వకుర్తి అమనగల్ వెళ్లే రహదారి చంద్రయన్ గుట్ట నియోజకవర్గం పరిధిలోని ఎర్రకుంట ఎక్స్ రోడ్ అబ్దుల్లా చికెన్ అండ్ మటన్ షాప్ వద్ద రహదారి గుంతల మయంగా మారడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గుంతల్లో మురుగు నీరు నిండడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

త్రిపుర గవర్నర్‌ను కలసిన నాయకులు



నవతెలంగాణ - బడంగ్ పేట్

ఇటీవల త్రిపుర గవర్నర్‌గా నియమితులైన మలక్ పేట మాజీ శాసన సభ్యులు నల్లు ఇంద్ర సేనా రెడ్డిని ఆదివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ మాధురి వీర కర్ణ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రామిడి భీమ్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రామిడి శూర కర్ణ రెడ్డి, రామిడి వీర కర్ణ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంద్ర సేనా రెడ్డిని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

వనస్థలిపురం నుండి బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ శక్తి నగర్ కాలనీకి చెందిన శక్తి కేంద్రం బీజేపీ ఇంచార్జి, డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మైనారిటీ సెల్ వనస్థలిపురం డివిజన్ ఇంచార్జి సలీమ్, వేణు, నరేష్‌లు డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నియోజకవర్గానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై సుమారుగా 100 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ కమల సుధీర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు గడ్డం మల్లేష్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు లత, ఖైసర్, మధు గౌడ్, చపాల శ్రీనివాస్, అజయ్, గడాల రాజు, మమత, పద్మ, నవీద్, నాంపల్లి శ్రీనివాస్, షేక్ సలీం, వేణు, నరేష్, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంతోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ - సంతోష్ నగర్

సీఎం కేసీఆర్‌తోనే ప్రజాభివృద్ధి సాధ్యం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం చంపా పేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ అంబేద్కర్ బస్తీ వాసులు ఎమ్మెల్యే సమ క్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని.. బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లతోనే సాధ్యం అన్నారు. ఈ సమావేశంలో బాబు, జంగయ్య, చంద్రమౌళి, సుధాకర్, సురేష్, నవీన్, రఘు మారెడ్డి, ముదుప్పు రాజ్ కుమార్ రెడ్డి, చేగొని మల్లేష్ గౌడ్, జగదీష్ గౌడ్, టవర్ సీను, శివ గౌడ్ పాల్గొన్నారు.

'నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్'





నవతెలంగాణ - నాగోల్

సీఎం సహాయ నిధి నిరుపేదలకు అండగా ఉందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం నాగోల్ లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలోని బేగం పేట ప్రాంతానికి చెందిన శేరిపల్లి లావణ్యకు రూ. 35 వేలు, అదేవిధంగా నాగోల్ ప్రాంతానికి చెందిన కట్టె నాగమణికి రూ.32వేలు విలువ గల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అనంతరం లబ్దిదారులు శ్రీనివాస్ గుప్తకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్కే పురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో పనిచేసే ఆలయ సిబ్బందికి దసరా పండుగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆదివారం చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విప్లవ్, శ్రీకాంత్, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి



గతంలో ఎన్నడూ లేనివిధంగా మహేశ్వరం అభివృద్ధి



- యువతకు బీఆర్ఎస్‌తోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

గతంలో ఎన్నడూ లేని విధంగా మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, బీఆర్ఎస్ పార్టీతోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆర్కే పురం డివిజన్ బీఆర్ఎస్ మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు శ్యామ్ గుప్తా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ బంజారా బస్తి ఫేస్-1 కు చెందిన దాదాపు 100 మంది యువత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీకి సైనికుల లాంటి కార్యకర్తల బలం ఎంతో ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను చూసి భయపడి పోతున్నాయని అన్నారు. కేసీఆర్ మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సీఎం విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌తోనే యువతకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. మరొకసారి మహేశ్వరం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని.. ఈసారి కూడా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, వెంకటేష్ గౌడ్, జగన్, దీపక్, శ్రీమన్నారాయణ, జాహేద్, పవన్, ప్రశాంత్, గని, వంశీ, బన్నీ సతీష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించిన సీఎం

నవతెలంగాణ- బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక రకాల ప్రజా సమస్యలను పరిష్కరించిందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏజీఆర్ కాలనీలో జోన్ మార్పు సమస్యను పరిష్కరించిన మంత్రికి కాలనీ వాసులు ఆదివారం ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ 80 ఎకరాలు గ్రీన్, ఓపెన్ జోన్ల నుండి రెసిడెన్షియల్ జోన్ గా మార్చినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని పరిష్కరించే గొప్ప నాయకులుగా సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు.రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు చేసి బీఆర్ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొని రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి, కాలనీ అధ్యక్షులు ప్రమోద్ కుమార్, ఉపాధ్యక్షులు పి.సి.రాములు, కాలనీ వాసులు రామోహన్ రెడ్డి, వి.నర్సింహా చారి, చల్లా ప్రవీణ్, మహేష్ గౌడ్, కృష్ణా రెడ్డి, సత్యనారాయణ, రామకృష్ణ, క్రాంతి కుమార్, జగదీష్, శ్రీనివాస్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





కళా సిల్క్స్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్లోని అల్కాపురి భవన్‌లో కళా సిల్క్స్ హ్యాండ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు వినోద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రకాల చేనేత కళాకారులతో తయారు చేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. చేనేత వస్త్రధారులకు అండగా నిలవడానికి ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వస్త్ర మేళాలతో చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. మంగళగిరి, ధర్మవరం, కలంకారి, ఉప్పాడ, వెంకటగిరి, జైపూర్ స్టోన్స్ జువెలరీ, హర్యానా బెడ్ కవర్లు వివిధ రాష్ట్రాల ఉత్పత్తులు మరిన్ని మోడల్స్ అందుబాటులో ఉంటాయన్నారు. వారం రోజులపాటు చేనేత హస్తకళ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

హయత్ నగర్ లో ప్రయాణికురాలి బ్యాగు చోరీ...

నవతెలంగాణ- హయత్ నగర్

దసరా పండుగ సందర్భంగా ఓ మహిళ తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్ స్టాండ్‌లో నిలిచిఉంది. బస్ ఎక్కే క్రమంలో బ్యాగ్‌ను అక్కడే మర్చిపోయింది. ఆ బ్యాగ్ చోరీకి గురైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితురాలు నాగమ్మ తెలిపిన వివరాల ప్రకారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శుభోదయం కాలనీలో ఆమె నివాసముంటుంది. ఈమె స్వస్థలం సూర్యాపేట జిల్లా అయితే దసరా పండుగ సందర్భంగా తన స్వగ్రామానికి వెళ్లేందుకు తన కుటుంబ సభ్యులతో కలిసి హయత్ నగర్ లోని బస్ స్టాండ్ కు వచ్చింది. బస్ కోసం ఎదురుచూస్తున్న క్రమంలో బస్ రాగానే హడావుడిగా వెళ్తున్న క్రమంలో ఒక బ్యాగును మరిచి బసు ఎక్కింది. ఆ బ్యాగులో తులం బంగారం, 2సెల్ ఫోన్లు ఉన్నాయి. మళ్లీ వచ్చి చూస్తే బ్యాగు లేకపోవడంతో అది చోరీకి గురైందని హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి చేశాను..ఆశీర్వదించండి : ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

సంక్షేమ, అభివృద్ధే పరమావధిగా ప్రతి కాలనీనీ అభివృద్ధి చేశానని..వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ అన్నారు. ఆదివారం పెద్ద అంబర్ పేటలోని తార కన్వెన్షన్ హాల్లో బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని బీఆర్ఎస్ మున్సిపల్ కార్యదర్శి పాశం దామోదర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై కార్యకర్తలకు ఎన్నికల దిశా నిర్దేశం చేశారు. పసుమాముల, కుంట్లూర్, తట్టిఅన్నారం, పెద్ద అంబర్‌పేట గ్రామాలను మున్సిపాలిటీగా తీర్చిదిద్ది కోట్లాది రూపాయల నిధులతో పురపాలక సంఘం అభివృద్ధి కోసం కృషి చేశానని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గడపకూ బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 6,380 బూత్ కమిటీలకు గాను, ప్రతి బూత్‌కు 30 మంది కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తే భారీ మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద అంబర్‌పేట మున్సిపల్‌లో 43 బూత్ కమిటీలకు కన్వీనర్, కో కన్వీనర్లు కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు. 15 సంవత్సరాలుగా (మూడు పర్యాయాలుగా) నన్ను ఆశీర్వదించి గెలిపించిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. ఈ సారి కూడా నన్ను ఆశీర్వదించి, గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కా రామ్ రెడ్డి, పాశం దామోదర్ ఈదమ్మల బలరాం, దేవుడి విజయభాస్కర్ రెడ్డి, గౌని భాస్కర్ గౌడ్, రావుల గోపాల్, వద్దేపల్లి విజేందర్ రెడ్డి, కంచర్ల సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, పరశురాం, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వేంకటేశ్వర స్వామి
బ్రహ్మోత్సవాలలో సుదర్శన హోమం



నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు 8వ రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం 5 గంటలకు మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవ, తిరువారాధన, సహస్ర నామార్చన, స్వర్ణ పుష్పార్చన, బాల భోగ నివేదన ఉత్సవ మూర్తుల అభిషేకం, సూర్యప్రభ వాహనంపై తిరు వీధి ఉత్సవం, శ్రీవారి కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం, యాగశాల నందు మహాలక్ష్మి హోమం , రాత్రి 9:30 గంటలకు పవళింపు సేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితుల నేతృత్వంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ కే. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కో- చైర్మన్ కేఎల్ గణపతి, వైస్ చైర్మన్ లు జగదీష్ కుమార్, పాపారావు, కే .సత్తయ్య, కోశాధికారి కే. శ్రీధర్, సంయుక్త కార్యదర్శి పి. శ్యామల, సహాయ కోశాధికారి కే. రామలక్ష్మి, సాంబశివరావు, సునీల్ కుమార్ గౌడ్, వెంకటేశ్వరరావు, రమేష్ బాబు,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన మంత్రి సబితమ్మ





నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన దుర్గా మాత విగ్రహాల వద్ద ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బడంగ్ పేట్‌లోని కాశీ బుగ్గ దేవాలయంలో పెద్దబావి భుజంగ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన చండీయాగం, అన్నదానం కార్యక్రమాలకు మంత్రి హాజరయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన సందర్భంగా విజయానికి సంకేతంగా జరుపుకునే విజయ దశమి వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో, అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.ఆనంద్ రెడ్డి, కార్పొరేటర్లు పి.శ్రీనివాస్ రెడ్డి, సూర్ణగంటి అర్జున్, లిక్కి మమత కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రాజ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ద్వారానే మానసిక ప్రశాంతత

నవతెలంగాణ- సంతోష్ నగర్

ఆధ్యాత్మికత ద్వారానే మానసిక ప్రశాంతత సాధ్యమని, ప్రతి ఒక్కరూ భక్తిని అలవర్చుకోవాలని యాకుత్ పురా నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మలక్ పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని దుర్గామాత ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్థానిక భక్తులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సామ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయానికి నిర్మాణానికి, అభివృద్ధికి దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలత రెడ్డి, సామా స్వప్న సుందర్ రెడ్డి, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సంతోష్ నగర్



దసరా శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా దుర్గామాత అమ్మ వారి ఆలయాల్లో ఎస్‌జిఆర్ కాలనీ ఫ్రెండ్స్ యూత్ కమిటీ అధ్యక్షులు బి. గౌతమ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఈ. ఆర్య నాథ్, అక్షయ్, శ్రీధర్, సంతోష్, నరేష్, ప్రవీణ్, సతీష్, అఖిల్, సుశాంత్, శ్రీకాంత్, శివ, సాయి తేజ, సందీప్ మెగావెంత్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్ నగర్



యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాలతోపాటు మండపాలల్లో కొలువుదీరిన అమ్మవార్లకు ఆదివారం సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

'దసరాను సంతోషంగా జరుపుకోవాలి'

నవతెలంగాణ - తుర్కయంజాల్



దసరా పండుగను రాష్ట్ర ప్రజలందరూ ఆనందోత్సావాలతో జరుపుకోవాలని భట్రాజు సంఘం రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు కూరపాటి నర్సింహా రాజు అన్నారు. పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని అన్నారు. దసరా పండుగ హిందూ పండుగలలో అతి ముఖ్యమైనదన్నారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం'



నవతెలంగాణ - బడంగ్‌పేట్

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బడంగ్‌పేట్ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహా రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జల్‌పల్లి మున్సిపాలిటీలోని 7వ వార్డుకు సంబంధించిన 150 మంది మహిళలు, యువకులు బీఆర్ఎస్ పార్టీ నుండి ఆదివారం హసద్ హుస్సేన్, అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ..ధనార్జనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు.అనంతరం పార్టీలో చేరిన వారికి చిగురింత నరసింహారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మైనారిటీ సెల్ అధ్యక్షులు రియాజ్, ఉపాధ్యక్షులు అబ్దుల్ బారి, అఫ్జల్, ఓబేద్, బాబా, మహేముద్ బాయ్, కయ్యుమ్ బాయ్, నజీర్ ఖాన్, ఎం.డి మోహిన్, ఎం.డి ఘోస్, షేరు, ఎం.డి వసీం, హంజా హిమాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అక్బర్‌కు సన్మానం



నవతెలంగాణ - సంతోష్ నగర్

మలక్‌పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ అక్బర్‌ను పార్టీ అధిష్టాన వర్గం నియమించింది. ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, బాలకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో షేక్ అక్బర్‌ను కలిసి ప్రత్యేక అభినందనలు, దసరా శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేస్తూ..శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొల్లు కిషన్ మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని, అభ్యర్థి ఎవరైనా మలక్ పేట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, బాబు శ్రీనివాస్, సంగిరెడ్డి, మదన్ బాబు, మహేష్, లింగాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

బతుకమ్మ ఉత్సవాలకు హాజరైన బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలో వార్డు కార్యాలయం వద్ద ఉన్న మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాం క్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, స్థానిక మహిళలు, కొటేశ్వరి, అండాలు, శోభ, లక్ష్మి, సుశీల, ఎల్లుబాయి, వాసుగౌడ్, భాస్కర్, లక్ష్మీనారాయణ, కృష్ణ, శివకుమార్, పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్‌లోకి చేరికలు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో బండారి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ఉప్పల్ యువత ఏకమవుతోంది. ఆదివారం బీఆర్ఎస్ నేత పూడూరి జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్, చిలుకానగర్‌కు చెందిన వందలాది మంది యువకులు, పలువురు మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకుముందు ఉప్పల్‌లోని సాయిరాం నగర్, సాయిబాబా నగర్, విజయపురి కాలనీ, శాంతి నగర్ మీదుగా పార్టీ కార్యాలయం వరకు పూడూరి జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయం



నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పా శ్రీనివాస్ అన్నారు. కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ చక్రిపురంలోని చక్రి విద్యానికేతన్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం బీపీ, షుగర్ 98వ నెల ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..జన విజ్ఞాన వేదిక 98 నెలలుగా నిరంతరం మెడికల్ క్యాంపును నిర్వహించడం అభినందనీయమన్నారు. కరోనా సమయంలో మెడికల్ క్యాంపును ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహించి బాధితులకు మందులను పంపిణీ చేశారని గుర్తు చేశారు. మెడికల్ క్యాంపును విజయవంతంగా నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక మండల కమిటీల నాయకులకు జిల్లా కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెడికల్ క్యాంపు లో 126 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, (హెల్త్ అడ్డా హాస్పిటల్) వెంకటేశ్వర్లు లక్ష్మీ నరసింహ , జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, నరసింహారావు, శివప్రసాద్, సోమయ్యాచారి, పి.రమణరెడ్డి, నాగేశ్వరరావు, జి.కరుణాకర్ రెడ్డి, వెంకటరమణ, జెన్నీ, సురేష్, వెంకట్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో సుస్థిర అభివృద్ధి : బండారి



నవతెలంగాణ-కాప్రా

కేసీఆర్ పాలనలో సుస్థిర అభివృద్ధి కొనసాగుతుందని బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఏఎస్‌రావు నగర్ డివిజన్ డీఏఈ కాలనీలో మార్నింగ్ వాకర్స్‌తో సమావేశం అయ్యారు. ఎంబీసీ మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాయిపే ములాఖాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో గురించి అందరికీ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వాకర్స్ రాఘవరెడ్డి, దశరథ్, పెంటయ్య గౌడ్, భాస్కర్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, శ్రీనివాస్ డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్ రెడ్డి, కార్యదర్శి కుమారస్వామి, రహీం, మాట్లగిరి రాజశేఖర్‌రెడ్డి, యాకయ్య , వెంకట హరి, రాజు, మొగులయ్య పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ 8వ వార్డు ఎస్వీ నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 2లోనీ పార్కులో నెలకొల్పిన దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 8వ రోజు పూజా కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కౌకుట్ల మమతా కృష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రాసదా వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ కౌన్సిలర్స్ కోమీరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి, కౌకుట్ల అనంత్‌రెడ్డి, వినాయ్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, శ్రీధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శంకర్, రుద్రయ్య, భారత్, నర్సింహులు, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కొమరం భీమ్‌కు నివాళి



నవతెలంగాణ-కాప్రా

నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన కొమరం భీమ్ 123వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్ఫూర్తి గ్రూప్ సీనియర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. కొమరం భీమ్ తెలంగాణలో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడి వీరమరణం పొందారని చెప్పారు. కోమటి రవి మాట్లాడుతూ.. కొమరం భీమ్ గిరిజన గోండు ప్రజలు తమ హక్కుల కొరకు పోరాటాన్ని, పోడుహక్కు సాధన కొరకు నిలదీసిన మహోన్నత వ్యక్తిగా అని చెప్పారు. కొమరం భీమ్ చిన్న వయసులోనే నిజాం సర్కార్ దాష్టికత్వానికి ఆయన తండ్రి బలి అయ్యారని తెలిపారు. ఎవరైతే ప్రజలను పీడిస్తున్నారో వారిని ఎదిరించి మట్టుపెట్టి అస్సాం వరకు వెళ్లి అక్కడ తేయాకు కార్మికుల పోరాటంలో భాగస్వామ్యం అయ్యారని పేర్కొన్నారు. చివరకు బ్రిటిష్ వారు పట్టుకొని తెలంగాణ నిజాం సర్కార్ నిరంకుశత్వానికి బలి అయ్యారని చెప్పారు. ఆయన తెగువ పోరాట స్ఫూర్తి మనకందరికీ ఆదర్శమని చెప్పారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు ప్రసంగించారు. అనంతరం హాజరైన వారు కొమరం భీమ్ చిత్రపటానికి పూలు అర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో చారి, రుక్కయ్య జి శ్రీనివాసులు, జి శివరామకృష్ణ, ఆర్.ఎస్.ఆర్ ప్రసాద్, రామబ్రహ్మం పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

దసరా పండుగ సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహ రెడ్డి మున్సిపల్ ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి దయ కృపాకటాక్షాలతో శుభాలు, ఐశ్వర్యాలు కలగాలని, ప్రజలంతా సుఖ, సంతోషలతో వేడుకలు జరుపుకోవాలని కోరారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయ దశమి జరుపుకుంటామని తెలిపారు. విజయ దశమి రోజున సాయంత్రం 5గంటలకు పట్టణంలోని బొడ్రాయి (హనుమాన్ టెంపుల్)నుండి పట్టణ ప్రముఖులు, కుల పెద్దలతో శ్రీనివాస కల్యాణ మండపం వద్దకు డప్పు చప్పట్లతో జమ్మికి వెళ్లడం జరుగుతుందని చెప్పారు.

ఓటమి భయంతోనే మల్లారెడ్డి పిచ్చి మాటలు

- నువ్వా.. కబ్జాల గురించి మాట్లాడేది
- నీ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుంది
- కాంగ్రెస్ ఎమ్మెలల్యే అభ్యర్థి వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

ఓటమి భయంతోనే మల్లారెడ్డి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని, మల్లారెడ్డి తనపై చేసిన భూ కబ్జాల గురించి మాటడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్ అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో పార్టీ నగర అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఇంటింటికి కాంగ్రెస్ పాదయాత్రలో పాల్గొని మాట్లాడుతూ.. బోడుప్పల్ అభివృద్ధికి మంత్రి మల్లారెడ్డి ఏమి చేశాడో చెప్పుకునే పరిస్థితిలో లేకనే నాపై నిరాధారమైన భూ కబ్జా ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. నాడు గ్రామ పంచాయతీకి స్వచ్ఛ భారత్ అవార్డులను సాధించి అభివృద్ధిలో అగ్ర భాగన నిలిచిన బోడుప్పల్‌ను పాలనపై అవగాహన లేని మంత్రి మల్లారెడ్డి గెలుపుతో ఎటువంటి మౌలిక వసతులకు నోచుకోక అభివృద్ధిలో ఎంతో వెనుకబడిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ అవినీతి పాలనకు చరమగీతం పాడే రోజు ఎంతో దూరం లేదన్నారు. బోడుప్పల్ ప్రజలకు తాను ఏమి చేశాడో చెప్పుకోలేక పిచ్చి పట్టినట్లు మల్లారెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భూ కబ్జాలు చేయాల్సిన గత్యంతరం నాకు లేదని మా తాతలు, తండ్రుల నాటికే మాకు 200 ఎకరాల భూమి ఉండేదని ఈ విషయం బోడుప్పల్‌లోని ప్రతి ఒక్క వ్యక్తికి తెలుసు అని తెలిపారు. మేము మా భూములు అమ్ముకొని రాజకీయాలు చేస్తున్నామని, నీలాగా ఎమ్మెల్యే పదవిని అడ్డం పెట్టుకొని 900 ఎకరాల భూమిని భయపెట్టి లాక్కొని నీచ రాజకీయాలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం వారి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం కాకుండా కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంగా కొనసాగిందన్నారు. దీంతో మంత్రి మల్లారెడ్డికి భయం పట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో నన్ను ప్రజలు గెలిపిస్తే మునుపెన్నడూ లేని విధంగా అన్ని మౌలిక వసతులను కల్పిస్తూ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుపుతాన న్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, ప్రధాన కార్యదర్శిలు, సీనియర్ నాయకులు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, ఎస్సీ సెల్, బీసీ సెల్, మహిళా, మైనారిటీ సెల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు

- కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి
- సమన్వయంతో పనిచేస్తే లక్షకుపైగా మెజార్టీ



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీకి పోటీ లేదని, ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, మేడ్చల్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు అని, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తే లక్షకుపైగా మెజార్టీ ఖాయమని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో మండల కమిటీ అధ్యక్షుడు సుదర్శన్ అధ్యక్షతన మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... కార్యకర్తలు ఈ ముప్పై రోజులు కష్టపడితే లక్షకు పైగా మెజార్టీ వస్తుందన్నారు. 24 గంటల విద్యుత్తు, ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా నీళ్లు, మిషన్ కాకతీయతో సాగునీరు అందడంతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. దేవేందర్‌గౌడ్ హయాంలో వేసిన రోడ్లకు కరాబు అయ్యాయని, కేసీఆర్ రాకతో వాటికి మహర్దశ వచ్చిందన్నారు. కుల సంఘాలు భవనాలు, ఆలయాలకు, సీసీ రోడ్లు సొంత నిధులతో అభివృద్ధి చేశామని తెలిపారు. నక్క ప్రభాకర్‌గౌడ్ మల్లారెడ్డిని ఓడించాలని చూస్తున్నాడని తెలిపారు. మైనంపల్లి ఎటుపోతే అటు పోతాడని ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. మల్కాజిగిరిలో మైనంపల్లి మైనం పిల్లి అయ్యిందన్నారు. సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యి మేడ్చల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. రెండోసారి సుధీర్‌రెడ్డికి ఎందుకు బీ ఫాం ఇవ్వకపోదానికి కారణం లంచాలు తీసుకుంటూ ఇన్ఫోసీస్‌ల దొరికిన దొంగ అని మండిపడ్డారు. వజ్రేశ్ యాదవ్ కబ్జాలే చేశాడని పేర్కొన్నారు. మల్కాజిగిరిలో రాజశేఖర్‌రెడ్డి గెలుపు ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ జహంగీర్, జడ్పీటీసీ అనితలాలి, ఎంపీపీ ఎల్లూభాయి, మండల రైతుబంధు కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పల్లె సీతారాం రెడ్డి, సర్పంచులు మోహన్ రెడ్డి, ధార భాస్కర్, సుజాత, ఎంపీటీసీలు , నాయకులు సతీష్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ గౌడ్, చాంద్‌పాషా, ఐలయ్య పాల్గొన్నారు.

మేడ్చల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మేడ్చల్ మండల ప్రముఖ న్యాయవాది నక్క మల్లికార్జున్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కనుక అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం ఇటీవల తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా పూడూరు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం వజ్రేష్ యాదవ్‌ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నక్క మల్లికార్జున్ మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ గెలుపునకు తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు.

పేదోడికి అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్లు, దళితులకు ఇండ్ల స్థలాలు, అసైన్డ్ భూములు పంపిణీ చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని తిరిగి లాక్కుంటుందని ఆరోపించారు. కలిసిన వారిలో జీ.అనంత్ రెడ్డి, కుమార్ యాదవ్, అశోక్ గౌడ్, కిషోర్ పాల్గొన్నారు.

అమ్మవారికి అజయ్ యాదవ్ పూజ



నవతెలంగాణ-శామీర్‌పేట

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం రాత్రి బోడుప్పల్ కార్పొరేట్ అజయ్ యాదవ్ స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పలుచోట్ల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ చిర్రబోయిన రాంచందర్ యాదవ్, గట్టు ప్రమోద్, రాణి పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల వ్యాప్తంగా ఆదివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఎల్లంపేట్ గ్రామంలో మహిళలందరూ బతుకమ్మలను ఒక్కచోటకు చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలు వైభంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం రేణుకాదేవి జగన్ గౌడ్, సర్పంచ్ మేకల వెన్నెల రామకృష్ణుడు, ఎంపీటీసీ కుమార్ యాదవ్, రోజా భూమాగౌడ్, రేఖ, మౌనిక, చిట్టి జ్యోతి, శైలజ, నరేష్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో మల్లారెడ్డి గెలుపు ఖాయం



నవతెలంగాణ-ఘట్కేసర్

మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుపుతున్న ఘనత మంత్రి మల్లారెడ్డికే దక్కిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మెన్ చామకూర భద్రారెడ్డి అన్నారు. ఆదివారం ప్రతాప్ సింగారం గ్రామం బూతుస్థాయి సమావేశాన్ని సర్పంచ్ వంగూరి శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రారెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. అధికారం వచ్చిన ఆరునెలలో అందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. గడప గడపకూ ప్రభుత్వ అభివృద్ధి తీసుకపోవాలని సూచించారు. కార్యక్రమంలో రమేష్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ రాములు గౌడ్, డొంకని భిక్షపతి గౌడ్, చౌదరి గూడ ఎంపిటీసీ భాస్కర్‌రెడ్డి, ప్రవీన్ రెడ్డి, సందీప్ రెడ్డి, రవి వార్డు సభ్యులు ఉన్నారు.

భారతీయ విద్యార్థులకు న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్లు

- Get2Uni.com తో భాగస్వామ్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అమెరికాలో ఉన్నత విద్యావకాశాలు కోరుకునే భారతీయ విద్యార్థులకు న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీ (ఎన్ఎంఎస్‌యూ) సాదర స్వాగతం పలుకుతోంది. ఘనమైన చరిత్ర కలిగిన ప్రముఖ విద్యాసంస్థ అయిన ఎన్ఎంఎస్‌యూ భారతీయ విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా అనేక కోర్సులను రూపొందించింది, వాటిలో స్పాట్ అడ్మిషన్లను ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా Get2Uni.comతో ప్రత్యేక భాగస్వామ్యం ఏర్పరుచుకుని, ఒక కార్యక్రమం నిర్వహిస్తోంది.

నేడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్ఎంఎస్‌యూ హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్లో స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇక్కడకు వచ్చే విద్యార్థులు, వాళ్ల తల్లిదండ్రులకు ఉండే సందేహాలను తీర్చేందుకు, వారికి అవసరమైన సమాచారం ఇచ్చేందుకు యూనివర్సిటీ నుంచి నలుగురు ఉన్నతస్థాయి ప్రతినిధులు వస్తున్నారు. వారిలో ఎన్ఎంఎస్‌యూ బోర్డు ఛైర్ రీజెంట్ అమ్ము దేవస్థలి, ఎన్ఎంఎస్‌యూ గ్లోబల్ ఛాన్సలర్ డాక్టర్ షెర్రీ గోల్డ్‌మన్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెస్లీ కెర్వాంటెస్, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ లక్ష్మీరెడ్డి ఉంటారు. వీరంతా తమ అపార విజ్ఞానం, అనుభవాలను విద్యార్థులకు పంచుతారు. ఈ సందర్భంగా Get2Uni.com ప్రెసిడెంట్ పవన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, అమెరికాలో ఉన్న వేలకొద్దీ యూనివర్సిటీలలో ఏది సరైనదో ఎంచుకోవడానికి భారతీయ విద్యార్థులు కొంత ఇబ్బంది పడతారని చెప్పారు. అయితే, అచంచలమైన పేరు ప్రతిష్ఠలు, విద్యార్థులకు వివిధ స్కాలర్‌షిప్ కార్యక్రమాల ద్వారా ఎనలేని మద్దతు అందిస్తున్న ఎన్ఎంఎస్‌యూ మాత్రం అన్నింటికంటే విభిన్నంగా, విశిష్టంగా ఉంటుందని తెలిపారు. Get2Uni ప్రత్యేకంగా 3వేల డాలర్ల స్కాలర్‌షిప్ అందిస్తోందని, దాంతోపాటు ఛాన్సలర్ ప్రత్యేకంగా అంతర్జాతీయ విద్యార్థులకు 15వేల డాలర్ల స్కాలర్‌షిప్ ప్రకటించారని, దీన్ని బట్టే చదువు కోసం వచ్చేవారిపట్ల ఎన్ఎంఎస్‌యూకు ఉన్న నిబద్ధత ఏంటో తెలుస్తుందన్నారు.

Get2Uniతో మా ప్రత్యేక భాగస్వామ్యాన్ని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉంది. భారత్, నేపాల్ దేశాల విద్యార్థుల వద్దకు వెళ్లి వారికి మా విద్యావకాశాల గురించి చెప్పడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. భారతీయ సంస్థలతో మరింతగా అనుబంధం పెంచుకుని, ఇక్కడి నుంచి అమెరికా రావాలనుకున్న విద్యార్థులను కలిసి, కార్పొరేట్లతో మరిన్ని భాగస్వామ్యాలు ఏర్పరుచుకోవాలని భావిస్తున్నాం. దీనివల్ల ఎన్ఎంఎస్‌యూలో వైవిధ్యమైన, అద్భుతమైన విద్యా వాతావరణం ఏర్పరచాలన్న మా లక్ష్యం నెరవేరుతుంది" అని న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ షెర్రీ కోల్‌మన్ తెలిపారు.

తాజ్ డెక్కన్ హోటల్లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ద్వారా భారతీయ విద్యార్థులు ఎన్ఎంఎస్‌యూలోని వైవిధ్యమైన కోర్సుల గురించి తెలుసుకోవడానికి, నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడటానికి, అద్భుతమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి ఒక సువర్ణావ కాశం లభిస్తుంది.

గుడ్ మార్నింగ్ కుత్బుల్లాపూర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గుడ్ మార్నింగ్ కుత్బుల్లాపూర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 132 డివిజన్ జీడిమెట్ల పరిధిలోని ఎన్సీఎల్ (NCL) గోదావరి హెూమ్స్, ప్రగా టూల్స్ కాలనీవాసులతో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్ రెడ్డి కాలనీలలో పర్యటించారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను కాలనీవాసులు కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నిటిని పరిష్కారానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గా లో, ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీష్షులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారావుతో పాటు, కార్పోరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్ జిల్లా మైనారిటీ నాయకుడు గౌసుద్దీన్, సీనియర్ నాయకులు నూర్, సయ్యద్ రియాజ్, యునుస్, అషు , ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ పార్టీల వల్ల ఒరిగింది ఏమిలేదు



- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మతతత్వ బీజేపీ పార్టీ చేతకాని కాంగ్రెస్ పార్టీ వల్ల నియోజకవర్గానికి ఒరిగింది ఏమిలేదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఎమ్మెల్యే నాయకత్వంలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నియోజకవర్గ సర్కిల్ సెక్రటరీ సుగుమళ్ల బాలయ్య, ఇంద్రసింగ్ నగర్ మాజీ ప్రెసిడెంట్ మన్నే సత్తయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుగుమళ్ల బాలయ్యకి వారి అనుచరులు 100 మందికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి బి.ఆర్.ఎస్ పార్టీ ముఖ్య సిద్ధాంతమని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి పితామహుడని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో అగ్రగామిగా నిలిపిన దర్శనిక పాలకుడని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరూ బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల కృషి చేయాలన్నారు. సుగుమళ్ల బాలయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సారధ్యంలో నియోజక అభివృద్ధిలో కలిసినడుస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సుధాకర్ గౌడ్, ఆంజనేయులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఏసీపీ కార్యాలయం



- **బాలానగర్ పోలీస్ స్టేషన్ నూతన భవనాలు**

నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ సబ్ డివిజన్‌లోని నూతన ఏసీపీ, పోలీస్ స్టేషన్ భవనాలు దసరా రోజున ఆయుధ పూజతో పాటు కొత్త భవనాలను ప్రారంభించేందుకు అధికారులు, సిబ్బంది ఆసక్తిగా ఉన్నారు. దసరా నుండి ఈ భవనాలు అందుబాటులోకి వస్తే అధికారుల సమస్యలతో పాటు వినియోగదారుల సమస్యలు తీరనున్నాయి. వివరాల ప్రకారం బాలానగర్‌లో గతంలో చిన్న గ్రామం నుండి పెద్ద పట్టణంగా మారి, ఒక మున్సిపల్ డివిజన్‌గా ఏర్పడింది. బాలానగర్ పూర్వ చరిత్రను పరిశీలిస్తే మేడ్చల్ జిల్లా బాలానగర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బాలానగర్ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. 1960 నుండి బాలానగర్ ప్రాంతంలో అంచెలంచెలుగా ఎదిగి పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా ఏర్పడింది. కాలక్రమేణా పరిశ్రమలను స్థాపించడంతో అతిపెద్ద పారిశ్రామిక వాడగా రూపుదిద్దుకుంది. పారిశ్రామిక ముడిసరుకుల రవాణా వ్యవస్థ పెరగడంతో వాహనాల రాకపోకలు అధికమవడంతో వాహనాలు భారీగా పెరిగి ట్రాఫిక్ జామ్‌తో పాటు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, దినసరి కూలీలు అడ్డా కూలీలకు బాలానగర్ ఉపాధిగా మారింది. బాలానగర్‌లోనే ఏర్పాటైన శోభన థియేటర్ పేరుతో కాలనీ ఏర్పాటు కావడం, దాని తర్వాత మరో థియేటర్ విమల్ పేరుతో ఏర్పాటయింది. గత రోజుల్లో సికింద్రాబాద్‌లో బస్ ఎక్కి బాలానగర్‌లో దిగే వాళ్లు చాలా వరకు శోభన అని చెప్పి టికెట్ తీసుకునేవారు. ఆ విధంగానే బాలానగర్ ప్రాంతంలో శోభన బస్ స్టాప్ పేరు పొంది అలాగే శోభన కాలనీ కూడా ఏర్పడింది. అప్పటి సమయంలో బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిస్థితి దారుణంగా ఉండేది. బాలానగర్ జోన్, బాలానగర్ డివిజన్, బాలానగర్ పోలీస్ స్టేషన్, బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, బాలానగర్ ట్రాఫిక్ డివిజన్, బాలానగర్ అదనపు జోన్ ట్రాఫిక్‌తో పాటు ఎక్సైజ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్, క్రైం, స్పెషల్ ఆపరేషన్ టీమ్, బాలానగర్ తహశీల్దార్ కార్యాలయం ఇలా అన్ని కార్యాలయాలు ఏర్పడ్డాయి. కానీ అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఏ ఒక్క కార్యాలయానికి కూడా సొంత భవనాలు లేక, బాలానగర్ డీసీపీ కార్యాలయం కొన్ని రోజులు పేట్ బషీరాబాద్‌లో కొనసాగుతున్న తరుణంలో షాపూర్ నగర్‌లో సొంత భవనం ఏర్పాటు చేసుకోగా, ఇటీవల బాలానగర్ స్పెషల్ ఆపరేషన్ టీమ్‌కు ప్రత్యేకంగా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. కాగా ఇప్పుడు బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు గత ఏడాది దసరా రోజున సైబరాబాద్ కమిషనర్ భూమి పూజ చేయగా మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన అధునాతన భవనం ప్రస్తుతం అది తుదమెరుగులు దిద్దుకుని ప్రారంభానికి సిద్ధం కావడంతో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా ఉన్నారు. చక్కని విల్లా తరహాలో అధునాతన కార్యాలయం, విల్లాలాంటి బాలానగర్ ఏసీపీ గంగారాం కార్యాలయాన్ని పట్టుబట్టి దగ్గర ఉండి రాత్రి, పగలు పర్యవేక్షించి ప్రారంభానికి సిద్ధం చేశారు. బాలానగర్ పోలీస్ స్టేషన్‌తో పాటు ఏసీపీ కార్యాలయం కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విశాలమైన ఏసీపీ కార్యాలయం, లోపల విశ్రాంతి గది, బయట సెక్షన్ ఆఫీసర్, రిసెప్షన్, సందర్శకుల గది, రికార్డ్ రూమ్, మంచి కిచెన్ సౌకర్యంతో పాటు పై ఫ్లోర్‌లో 50 మందితో సమావేశ మందిరం, బాత్ రూమ్‌లతో కార్యాలయం ముందు ఏసీపీ కారు పార్కింగ్, వెనుక గార్డెన్‌తో పాటు చెట్లు నాటి చూస్తే వారికి ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామా అనే అనుభూతి కలుగుతుంది. దీని వెనుక ఏసీపీ గంగారామ్ కృషి పట్టుదల ఎంతగానో ఉంది. కూకట్‌పల్లి సబ్ ఇన్స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గంగారామ్ కేపీహెచ్‌బీ 4వ ఫేస్‌లో కిరాయికి ఉండి కష్టపడి మంచి పేరుతో పాటు జీడిమెట్లలో ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన అనంతరం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్‌గా పనిచేసి ప్రమోషన్‌తో అబిడ్స్ ఏసీపీగా వెళ్లాడు. అక్కడి నుండి నిజామాబాద్ జిల్లా డీఎస్పీగా పని చేసి అటు నుండి మళ్లీ బాలానగర్ ఏసీపీగా పదవీ చేపట్టిన కొన్ని నెలలకే సైబరాబాద్ సీపీతో బాలానగర్ పోలీస్ స్టేషన్ భూమి పూజ చేసి సరిగ్గా సంవత్సరానికి మళ్లీ దసరా రోజున ప్రారంభానికి సిద్ధం చేసిన ఏసీపీకి గంగారాం అభినందనీయులు. సిబ్బంది, ఇతర అధికారులు కూడా భవన నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన ఏసీపీ గంగారంను అభినందిస్తున్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు శ్రమించాలి



- **టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివారెడ్డి**

నవతెలంగాణ-బాలానగర్

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలన్ హనుమంత్ రెడ్డికి అభినందనలతో మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీని కుత్బుల్లాపూర్‌లో గెలిపించడానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్ను శివారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పేట్ బషీరాబాద్, జీడిమెట్లలో ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి గెలిపించాలన్నారు. నియోజకవర్గాన్ని నిరంతరం కృషి చేసి ప్రజా క్షేత్రంలో ప్రజల అభీష్టం మేరకు పనిచేసే నేత హనుమంత్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ గెలువాల్సిన అవసరం ఎంతో ఉందని జ్యోత్స్ను శివారెడ్డి అన్నారు.

శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికేపూడి గాంధీతో కలిసి, దసరా పండుగ పురస్కరించుకొని, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని కలిసి కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, శేర్లింగంపల్లి నియోజకవర్గం కార్పొరేటర్లు పండగ శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి



అసమర్థుడు, అవివేకి, రాజకీయ అజ్ఞాని మల్లారెడ్డి

- **నీకు రాజకీయ క్షేత్రంలో రిటైర్మెంట్ కోసం రోజులు లెక్కపెట్టుకో**
- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి**



నవతెలంగాన-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర దగ దగల ఇంద్ర భవనాల లాంటి మెరుపులకు ఆదాయ వనరులను అందిస్తున్న మేడ్చల్ నియోజకవర్గంలో రాజకీయ ఓనమాలు తెలియని వ్యక్తి, అసమర్థ, అవివేకి, అజ్ఞాని లాంటి మల్లారెడ్డి వల్ల నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడి ఉన్నా తన అధికార మంద బలం, డబ్బు విశృంలత్వంతో ప్రజలను ఏమార్చి మళ్ళీ ఎన్నికల్లో గెలిచి తన అవినీతి సామ్రాజ్యాన్ని విసృతం చేస్తామని భ్రమ పడుతున్న స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి నుండి మేడ్చల్ ప్రజలను విముక్తి చేసేందుకు, ఆయన ఐదేండ్ల పాలనా వైఫల్యాలపై ఛార్జ్ షీట్ రూపంలో బీజేపీ సమర శంఖం పూరించబోతుంది అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం తూంకుంటలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేండ్ల పాలనలో ఏడాదికి రూ.5 కోట్ల చొప్పున రూ.25 కోట్ల నియోజకవర్గ అభివృద్ధి నిధులకు గాను రూ.1.9 కోట్లు మాత్రమే ఖర్చు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం హహా హెూహెూ అంటూ సంకలు గుద్దుకునే నీరో చక్రవర్తి లాంటి వ్యక్తి ఎమ్మెల్యే కావడం ప్రజల దౌర్భాగ్యం అన్నారు. మల్లారెడ్డి వల్లే పెన్షన్ల నుండి రైతు బంధు వంటి పథకాల అమలు నియోజకవర్గంలో ఉన్న డొల్లతనంపై, వేగంగా విస్తరిస్తున్న ప్రాంతానికి తన అవగాహన లేమితో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి అభివృద్ధి నిధులు మంజూరు చేయించకుండా హాస్య నటుడి వలె చేస్తున్న పనికిమాలిన పనులపై ఛార్జ్ షీట్‌ను విలేకరులకు అందించినట్టు తెలిపారు. ఈ ఛార్జ్ షీట్‌లోని అంశాలే రేపటి రోజు మల్లారెడ్డి పతనానికి సోపానాలు అవుతాయి అని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ తూంకుంట మున్సిపల్ అధ్యక్షులు పట్నం నర్సింహ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వంశిధర్ రెడ్డి, తుంకుంట మున్సిపల్ నాయకులు అశోక్, గణేష్, వినయ్ కుమార్, కౌడే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



నవతెలంగాన-సిటీబ్యూరో

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుపుతున్నారు. రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకారంతో భక్తులకు దర్శనం ఇస్తు పూజలు అందుకుంటున్నారు. రాష్ట్ర క్షయ శిక్షణా కేంద్రంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో అడిషనల్ డైరక్టర్ డాక్టర్ విజయకుమార్, శేరిలింగంపల్లి జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ విక్రమ్ కుమార్, శాంత్ కుమార్, రవికుమార్ సంతోజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం



- **ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ ,బిజెపిల నుండి బిఆర్ఎస్ లో చేరుతున్నారని ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ లో సమచితస్థానం లభిస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్ ప్రాంతంలోని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు స్థానిక కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు గురుమూర్తి నగర్‌లో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరై వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన తొమ్మిది సంవత్సరాల పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో పూరోభివృద్ధి సాధించిందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా అభివృద్ధి సాధించి చరిత్రలోకి ఎక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్లు, మహిళ నాయకురాళ్లు, బి.అర్.ఎస్ పార్టీ కామిటి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆదరించండి : మర్రి



నవతెలంగాణ-మల్కాజిగిరి

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని అదే సందర్భంలో కేసీఆర్ నాయకత్వంను బలపర్చలని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజక వర్గ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి సఫీల్ గూడ ట్యాంక్ బండ్ వద్ద మార్నింగ్ వాక్ కార్యక్రమంలో ఎక్స్ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న తదితరులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక లాఫింగ్ క్లబ్ సభ్యులతో కలసి మాట్లాడారు. లాఫింగ్ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మర్రి మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎన్నో రకాల ఒత్తిళ్లకు లోనవవుతుంటారని వాటిని అధికమించడానికి లాఫింగ్ థెరపీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ యోగ, లాఫింగ్ లేదా ధ్యానం వంటి పలు ప్రక్రియల సాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వారందరికీ కారు గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. మర్రి నేడు ఓల్డ్ హనుమాన్ వ్యాయామశాలను సందర్శించి వారి మద్దతును కోరుతూ రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గానికి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ని మూడోసారి గెలిపించి హ్యాట్రిక్

ప్రత్యేక పూజలో పాల్గొన్న మర్రి మమతా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి మర్రిరాజశేఖర్ రెడ్డి సతీమణి మర్రి మమతా రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె, నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ఆహ్వానం మేరకు డివిజన్ వివేకానందపురంలోని కాలిబెరి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి మమతా రెడ్డి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ దుర్గాదేవిని పూజించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. దేవీ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె, మధుర నగర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దుర్గా మాత మండపాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని రంగారెడ్డి డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్ ప్రాంతంలో శ్రీ దుర్గాదేవి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 23వ మహెూత్స వ వేడుకలు ఘనంగా నిర్వహిస్తు న్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం వై.ఎఫ్.సి.ఏ. జంట నగరాల అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు.
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి



- **మర్రి రాజశేఖర్ రెడ్డి**

నవతెలంగాణ-మల్కాజిగిరి

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన భాద్యత కార్యకర్తలు తీసుకుని బీఆర్ఎస్‌ను ముచ్చటగా మూడోసారి అధికారం కట్టబెట్టే విధంగా కృషి చేయాలని కోరారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మర్రి మల్కాజిగిరి నియోజకవర్గం 140వ డివిజన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ ఆధ్వర్యంలో నేడు విమలా దేవినగర్ కాలనీ, కృపా ఆనంద కాలనీ, నరసింహారెడ్డి కాలనీ, మేఘన అపార్ట్మెంట్స్ ప్రజలతో సమావేశమయ్యారు. టీఆర్ఎస్ పార్టీ ఉద్యమ రథసారథి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజా మానిఫెస్టోను ప్రజలకు వివరించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్ రావు నివాసంలో వెంగళ్ రావు కుటుంబంతో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి



విజయదశమి అంటేనే విజయం

- **జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు**
- **మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**



నవతెలంగాన-సిటీబ్యూరో

విజయదశమి అంటేనే విజయం అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. దసరా (విజయ దశమి) పండగ సందర్భంగా విజయానికి ప్రతీకగా నిలుస్తుంది అని తెలిపారు. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు దుర్గామాతను వివిధ అలంకరణలో పూజలు చేసి ఉపవాసదీక్షలు చేస్తారని అనంతరం విజయదశమి (దసరా) రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారని, భక్తిభావాలు విరసిల్లేలా ఈ పండగను జరుపుకోవడం ఎంతో శుభపరిణామమని అన్నారు. దసరా పండగను జిల్లా లో ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరు నైతిక భాద్యతగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

రూ.45 కోట్లకు పైగా విలువైన నగదు, ఆభరణాల సీజ్

రాష్ట్ర శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన బందోబస్తు చేపట్టినట్లు, ఈ విషయంలో నగదు, ఆభరణాలు, మద్యం తరలించకుండా నిరంతరం నిఘా కొనసాగుతుందని, పోలీసులు, ఎన్నికల అధికారులు అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా తనిఖీ చేపడుతున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు తనిఖీల్లో మొత్తం రూ.45,25,68,841 (45 కోట్ల 25 లక్షల 68 వేల 841 రూపాయలు) విలువైన నగదు, బంగారు, వెండి, ఇతర ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిలో రూ.16, 73, 98, 431 (16 కోట్ల 73 లక్షల 98 వేల 431రూపాయలు), విలువైన నగదు, రూ.28,51,70,410 విలువైన (28 కోట్ల 51 లక్షల 70 వేల 410 రూపాయలు) బంగారు, వెండి, ఇతర ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆబ్కారీ (ఎక్సైజ్) శాఖకు సంబంధించి 1,503 లీటర్ల మద్యం పట్టుకొని 298 కేసులు నమోదు చేసి 200 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలించరాదని, ఈ విషయంలో అధికారులకు సహకరించాలని కోరారు. పట్టుకున్న నగదును అన్ని రకాల రశీదులు, తగిన సాక్ష్యాలతో తిరిగి తీసుకునేందుకు గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీలో పోలీసులు, ఎస్ఎస్టీ బృందాలు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, ఇతర వస్తువులను పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు స్వాధీనం చేసుకున్న నగదు విడుదల చేసేందుకు వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను కమిటీ కన్వీనర్, జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి కన్వీనర్ గా, డీటీవో నర్సింహా రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి Logistics వ్యవహరిస్తున్నారని వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఎఫ్12లో గ్రీవెన్స్ కమిటీ పరిశీలిస్తుందని, ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్ళరాదని, అలా దొరికిన నగదును సీజ్ చేసి డిపాజిట్ చేస్తామన్నారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, వివాహం ఇతర అవసరాలకు తీసుకెళ్లే వారు సరైన పత్రాలతో నగదు తీసుకెళ్లాలని సూచించారు. ఆధారాలు లేక సీజ్ అయిన నగదు విషయమై సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకునేందుకు గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి ఫోన్ నెంబర్ 9100115724-, డీటీవో నర్సింహా రావు ఫోన్ నెంబర్ 77999-34204, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి, ఫోన్ నెంబర్ 73309-99280 లో సంప్రదించాలని కోరారు.

దసరా వేడుకలో మనోహర నాట్య ప్రదర్శన



నవతెలంగాణ-కల్చరల్

దసరా నవరాత్రి వేడుకలలో భాగంగా లక్ష్మీ నగర్ లోని శ్రీ వేంకేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో వై.ఎస్.ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్, ఆలయ కమిటీ నిర్వహణలో ప్రముఖ నృత్య కళాకారులు సంస్కృతి, అలేఖ్య, కుషి, కౌముదిలు కూచిపూడి నృత్య శైలిలో పలువురు వాగ్గేయ కారుల కీర్తనలను నర్తించారు. సంస్థ పక్షాన వై. శ్రీరామచంద్ర మూర్తి వీరిని సత్కరించి అత్యంత ప్రాచీన తెలుగు సంప్రదాయ కళ కూచిపూడి నాట్యం అని నేటి తరం కు ఈ సంస్కృతి అందాలనీ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆలయ కార్యనిర్వణాధికారి నరసింహ మూర్తి, నరేంద్ర రెడ్డి, కవులు శ్రీరామ్ కిషన్, ఉత్పల సుబ్రహ్మణ్య శాస్త్రి భాను ప్రసాద్ సత్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి

మర్రి మమతారెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని బీఆర్ ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి మర్రిరాజశేఖర్ రెడ్డి సతీమణి మర్రి మమతా రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె, నేరేడ్ మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ఆహ్వానం మేరకు డివిజన్ వివేకానందపురం లోని కాలిబెరి ఆల యాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మర్రి మమతా రెడ్డి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ దుర్గాదేవిని పూజించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. దేవీ నవ రాత్రుల ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారం భించారు. అనంతరం ఆమె, మధుర నగర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దుర్గా మాత మండపాన్ని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా

- కాంగ్రెస్ అభ్యర్థి సంతోష్



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం అని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదమ్ సంతోష్ ధీమాను వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ అడ్డగుట్ట లోహియ నగర్ నుండి ఆదామ్ సంతోష్ ఆదివారం పాదయాత్ర ప్రారంభించారు. గల్లీ గల్లీ తిరుగుతూ ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సాగిన పాద యాత్రలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని కాంగ్రెస్ పార్టీకి, ఆదమ్ సంతోష్ కు జై కొట్టారు. అడ్డగుట్ట లోహియా నగర్ లో ప్రారంభమైన పాదయాత్ర అడ్డగుట్ట డీ సెక్షన్, కమ్యూనిటీ హాల్ మీదుగా హెూటల్ బీ సెక్షన్, సీ సెక్షన్ గుండా తుకారాం గేట్ మంగారు బస్తీ, లాలగూడా వరకు సాగింది.ఆయనకు అడుగడుగున స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ఆదమ్ సంతోష్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదమ్ సంతోష్ మాట్లాడుతూ. 70ఏళ్ల తరువాత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుండి మొదటి సారి స్థానిక నాయకుడినైన తనకు టికెట్ లభించినందుకు సికింద్రాబాద్ ప్రజలు ముఖ్యంగా అడ్డగుట్ట ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తు ఆదరించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. పద్మారావు గౌడ్ 9 ఏండ్లుగా అధికారంలో ఉండి నియోజక వర్గాన్ని ముఖ్యంగా అడ్డగుట్టకు చేసింది ఏమి లేదని ఇక్కడి పరిస్థితులు చూసిన వారెవ్వరికైనా ఇట్టే తెలిసి పోతుందని పేర్కొన్నారు. అడ్డగుట్ట ప్రజలు మంచి నీటి సమస్యలు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ, అధ్వానంగా ఉన్న రొడ్ల తో అష్టకష్టాలు పడుతున్నారని వివరించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్దే తప్పితే ఇక్కడ పద్మారావు హయాంలో జరిగిన అభివృద్ధి ఏమింలేదని అన్నారు. అందుకే ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారని పద్మారావును సనత్ నగర్ నియోజక వర్గం టకార బస్తీ ఇంటికి పంపించడం స్థానిక అభ్యర్థి ఆదమ్ సంతోష్ ను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించడం ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు.ఈ పాదయాత్రలో అదం సంతోష్ తో పాటు మాజీ కార్పొరేటర్ ఉమాదేవి,ఎన్ ఎస్ యు ఐ ఉపాదక్షుడు అదం సృజన్, అనిల్, జయరాజ్, సందీప్, గంటరాజు, వహీద్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ డివిజన్‌లో మంత్రి తలసాని ఇంటింటికి ప్రచారం



నవతెలంగాణ-బేగంపేట

సనత్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమం నాలుగోరోజు ఆదివారం సనత్ నగర్ డివిజన్‌లో ఎంతో ఉత్సాహంగా సాగింది. అడుగడుగునా మంత్రికి నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్ళు, శాలువాలు, పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఏ ఇంటికెళ్ళినా శ్రీనన్న మీకే మా ఓటు అంటూ ప్రకటిస్తున్నారు. అనేక అభివృద్ధి పనులు చేసి మా సమస్యలు పరిష్కరించిన మిమ్మల్ని ఈ సారి ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఎంతో అభిమానంతో మంత్రి చేతిలో చేయి కలిపి చెబుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ముందు సనత్ నగర్ నియోజకవర్గ ప్రజలు సమస్యలతో సతమతమయ్యే వారని అన్నారు. 2014 తర్వాత ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి నాయకత్వంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ పుట్ట శేఖర్, మాజీ అధ్యక్షులు ఖలీల్, నాయకులు నోమాన్, సమీర్, సరాఫ్ సంతోష్, సురేష్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, ఇబ్రహీం, రాజు, ప్రకాష్ రెడ్డి, పాజిల్, అంజద్, పుష్పలత, పద్మ, లలితా చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన ఎంఐఎం

సనత్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కి ఎంఐఎం పార్టీ నాయకులు తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షౌకత్, జావీద్, షకూర్ ల ఆధ్వర్యంలో అక్కడకు చేరుకొని తమ మద్దతును ప్రకటించారు. అనంతరం వారు మంత్రితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరిక

సనత్ నగర్ డివిజన్ లోని అశోక కాలనీ, డీఎస్ఎం కాలనీలకు చెందిన సుమారు 150 మంది యువకులు కాంగ్రెస్, ఇతర పార్టీల నుండి ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. సనత్ నగర్ మరింత అభివృద్ధి చెందాలంటే తిరిగి తలసాని శ్రీనివాస్ యాదవ్ గారు గెలవాలనే లక్ష్యంతో ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

చంద్రబాబు నాయుడు ఆరోగ్యం కోసం పూజ



నవతెలంగాణ-ఓయూ

శ్రీ ఉప్పలమ్మ దేవాలయంలో (వెల్ఫర్ సెంటర్ గ్రౌండ్, సీతాఫల్మండి) తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చంద్ర బాబు నాయుడు ఆరోగ్యం కుదుటపడాలి అని, త్వరగా విడుదల అయ్యేలా భగవంతుని ని ఆశీర్వాదం కోరుతూ ఆది వారం ఉప్పలమ్మకు సికింద్రాబాద్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వల్లరపు శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యక పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో జీవి కృష్ణా, విజయ్, మల్లేష్, వెంకట స్వామి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్,విక్రమ్,రమేష్, ప్రసాద రావు, విజయ్ కుమార్, మురళీ,చంద్ర మోహన్,సురేష్, చందర్ ముదిరాజ్, జయప్రకాష్, సుధాకర్,రాజ్,బలరాజ్, రమేష్, నటరాజ్, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ డివిజన్ ప్రతాప్ నగర్ పంజాగుట్ట ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంను సందర్శించి అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొంది బతుకమ్మ ఆడిన ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి అన్నదాన కార్యక్రమంలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- సికింద్రాబాద్‌లో ఎస్సీ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఓయూ

దళితులకు భాజపా సముచిత స్థానం ఇస్తుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నా రు. లాలాపేటలోని నఫీజ్‌గార్డెన్‌లో ఆదివారం దళితుల (ఎస్సీ) ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శారద మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతు. దళిత సామాజిక వర్గానికి చెందిన రాంనాద్ కొవింద్ ను రాష్ట్రపతి చేసిన ఘనత భాజాపాకే దక్కుతుందన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 12 మంది దళిత వర్గానికి చెందిన వారికి భాజపా చోటు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రాంలు దేశానికి చెసిన సేవలను కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో విద్యా వ్యాపార రంగాల్లో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శారదా మల్లేష్, డా.ఆంజనేయులు, డా.శ్రీనివాస్, డా.అరుణ, వెంకటస్వామి, మహేందర్ బాబు, మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు, తిరుపతి, కొప్పు భాషా, వేణు, శ్రవణ్, కరుణాకర్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

జూటూరు కీర్తి రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా జన్మదినం సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెం ట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జుటూరు కీర్తీరెడ్డి అధ్వర్యంలో బైకుర్యాలీ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12:00 నుండి 4:00 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల నుండి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి, అమిత్‌షాకు శుభాకంక్షలు తెలియజేస్తూ కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం యూసుఫ్ గూడా చెక్ పోస్ట్ యందు బైక్ ర్యాలీని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జుటూరు కీర్తి రెడ్డి పార్టీ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కీర్తీ రెడ్డి మాట్లాడుతూ నియోజవర్గ స్థా యిలో నిర్వహిస్తూ, వచ్చే ఎన్నికలలో బీజేపీ ని బలపర చాలని నినాదంతో ప్రజలతో మమేకమై ముందుకు వెళ తామని తెలియజేశారు. బైక్‌ర్యాలీ నిర్వహించిన ప్రాంతాలు యూసుఫ్ గూడా చెక్ పోస్ట్ నుండి శ్రీనగర్ కాలనీ, మధురా నగర్, కళ్యాణ్ నగర్, మోతి నగర్, బొరబండ బస్ స్టాప్, సైట్ -3, శ్రీరామ్ నగర్, రహమత్ నగర్, మీదుగా యూసుఫ్ గూడాబస్తీ వరకు నిర్వహి ంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు గం గరాజు, చంద్ర మోహన్, కకనరజు, సప్రియ గౌడ్, చింటు మన్మధ, శ్రీధర్ రెడ్డి, ప్రసన్న, అనూప్, ఇందిరా, సాయి ముదిరాజ్ , మల్లిగౌడ్, నవీన్ , మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



నవ తెలంగాణఓయూ

బీజేపీ సికింద్రాబాద్ నియోజకవర్గ సీనియర్ నేత సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి లాలపెట్ ధోబీఘట్ లో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయలకు కేరాఫ్ బతుకమ్మ సంబరాలు అని మాజీ ఎం ఎల్ సి నారపరాజు. రామచంద్ర రావు అన్నారు. స్థానిక మహిళలు భారీగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. మహిళలను ఘనంగా గణేష్ సత్క రించారు.మాజీ యం ఎల్ సి ఎన్.రామచంద్ర రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపని, నాగేశ్వర్ రెడ్డి, ఉపేందర్ యాదవ్,ధనరాజ్,రాముపర్మ నవీన్ మాల, భిక్షపతి యాదవ్ పాల్గొన్నారు.

నా దగ్గరకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించా



- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఘనంగా మర్చంట్ అసోసియేషన్ ,వివిధ పరిశ్రమల నిర్వాహకుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని సనత్ నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం అమీర్‌పేట డివిజన్ మైత్రివనం వద్ద గల ఆదిత్య హెూటల్ లో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మర్చంట్స్ అసోసియేషన్, వివిధ పరిశ్రమల నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, ఈ ప్రాంతంలోని వివిధ వర్గాల ప్రజలకు అనేక అను మానాలు, భయాందోళనలు ఉండేవని తెలిపారు. ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనుమానాలు, భయాందోళనలు తొలగిపోయాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలు, వివిధ భాషలకు చెందిన అనేక మంది ఇక్కడకు వచ్చి స్థిరపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరు తమ బిడ్డలే అనే ఆలోచనతో ముఖ్యమంత్రి అన్ని విధాలుగా చేయూతను అంది స్తున్నారని తెలిపారు. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ప్రభుత్వం పటిష్టమైన శాంతిభద్రతలను నిర్వహిస్తున్న కారణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారులు తమ వ్యాపాంాలు చేసుకుంటున్నారని చెప్పారు. అదేవిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందున్నదని తెలిపారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే జరిగిందని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఎంతో అభివృద్ధి చేశామని వివరిం చారు. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నానని వివరించారు. తన వద్దకు వచ్చిన వారు ఎవరైనా పార్టీలకు అతీతంగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కొంతమంది నాయకులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వస్తారని, శ్రీనివాస్ యాదవ్ గారు నిత్యం ప్రజలతోనే ఉంటారని గుర్తుచేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మంత్రి శ్రీనివాస్ యాదవ్ వద్దకు వెళితే గంటల వ్యవధిలోనే స్పందించి సమస్యను పరిష్కరించారని కొందరు తమ అనుభవాలను వివరించారు.

మంత్రిని ఆయాసమాజ్‌లకు చెందిన ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అమీర్ పేట మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రాజ్ పురోహిత్, సురేష్ జగ్ నాని, గులాబ్ సింగ్, హన్సారి కొఠారి, సజన్ లాల్ కొఠారి, ఆనంద్ సోది, పురుషోత్తం మదానా, అశోక్ సింగ్ పురోహిత్, చైన్ సింగ్, పియూష్ గుప్తా, మోహన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారీగా డా.కోటా నీలిమ ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-బేగంపేట్

సనత్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ గారు తన ఎన్నికల ప్రచా రంలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మొండ మార్కెట్ డివిజన్ నుంచి ప్రారంభమైన యాత్ర బన్సీలాల్లాల్ పేట్, రామ్ గోపాల్పేట్, బేగంపేట్, అమీర్పేట్ నుండి సనత్ నగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ గారు మాట్లాడుతూ బీఆర్ఎస్, బిజెపి ఒకటేనని తెలిపారు. సాధారణ ప్రజల కోసం సామాన్య ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోని నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. సనత్ నగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం తధ్యమని ప్రకటించారు. ప్రజల అభిమానం చూస్తుంటే ఎంతో ఉత్సాహం వస్తుందని, గెలిచే వరకు ఇలాగే ఉత్సాహంగా పనిచేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. న్యాయం ధర్మం కోసం కాంగ్రెస్కు ఓటు వేయాలని లేకుంటే బీఆర్ఎస్ కు ఓటు వేస్తే అది మోడీకి వెళుతుందని విమర్శించారు. కార్యక్రమంలో అన్ని డివిజన్లో అధ్యక్షులు భారీ స్థాయిలో కార్యకర్తలు పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లోని వెస్ట్ మాడిపల్లిలో గల సంజీవనగర్ సెక్షన్ బతుకమ్మ ఉత్స వాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో మహిళలు బతుకమ్మను ఆడుతూ పాడుతూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

నవతెలంగాణ-బేగంపేట

బోరబండలో మాగంటి గోపీనాథ్ ఇంటింటి ప్రచారం



- హారతి పట్టి తిలకం దిద్ది ఆశీర్వదించిన మహిళలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, భారత రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్, బోరబండ డివిజన్‌లోని రామాలయం వీధి 1, మధురానగర్ కమ్యూనిటీహాల్ ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ ప్రభుత్వం పనితిరు, డివిజన్‌లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరిస్తూ, రథం పై ప్రచారం నిర్వహించారు. అనంతరం మహిళలు హారతిపట్టి తిలకం దిద్ది అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఆశీర్వదించారు. నిరంతరం ప్రజల్లో తిరుగుతున్నాను, వారి సమస్యలు అన్నీ తెలు సుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించినట్లు తెలిపారు. అం దుకే డివిజన్‌లో ప్రజలు నన్ను స్వాగతిస్తున్నారు అని తెలిపారు. ప్రతి గల్లీ ప్రతి గడప గులాబీ మయం తో మరోక సారి ప్రజలు అందరూ కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం అందజేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణ మోహన్,విజయ కుమార్,సమన్వయకర్త విజయ్ సింహా, సిరాజ్, లక్ష్మణ్ గౌడ్ షరీఫ్ , రామకృష్ణ ,మున్నిర్, రమేష్ యాదవ్, వీరేశం వేముల,బండారి యాదయ్య, కొరె శివ కుమార్, యం ఆనంద్, బాబా నాయక్,దేవమణి రజియా,సర్దార్, బాబు రావు,శివ కుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ జిల్లా ప్రజలకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతి కార్యక్రమం సఫలీకృతం కావాలని మనసారా కోరుకుంటున్నట్టు ఆయన తెలిపారు. దుర్గామాత అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని అమ్మవారి కరుణాకటాక్షాలతో అన్ని వర్గాల వారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ అభిలాషించారు.

ఘనంగా ప్రగతి భవన్ వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలు



ఘనంగా సద్దుల బతుకమ్మ



నవ తెలంగాణ - బాలానగర్

తంగెల్లో దొరికిన తల్లీ..మా తల్లీ బతుకమ్మ.. ఏ తల్లి కన్నదో నిను..మా తల్లీ బతుకమ్మ.. అంటూ ఆదివారం సాయంత్రం బాలానగర్ డివిజన్ పరిధిలోని మహిళలు, ఆడపడుచులు దుర్గామాత గుడి వద్ద 'సద్దుల బతుకమ్మ వేడుకలను' డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క పువ్వులతో బతుకమ్మలను ఇంటింటా తయారు చేసిన మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో దుర్గామాత గుడి ప్రాంగనానికి తరలివచ్చారు. బతుకమ్మ పాటలుపాడుతూమహిళలు,ఆడపడుచులుఆటలు ఆడారు. స్థానికులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బంజారాహిల్స్ డివిజన్ ఎన్ బి టీ నగర్ రోడ్డు నంబర్ 12 లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగనూ పురస్కరించుకొని పిల్లలు పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -నవతెలంగాణ-బంజారాహిల్స్

శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న అరికెపూడి గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2జన్మభూమి కాలనీ, ఎల్లమ్మ బండలో దసరా పర్వదినం సందర్భంగా శ్రీదేవి శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా జరిగిన పూజ కార్యక్రమంలో , ముఖ్యఅతిథిగా అరికెపూడి గాంధీ అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, కాశినాథ్ యాదవ్, కృష్ణ రావు, బోయ కిషన్,పోశెట్టి గౌడ్, బాస్కర్ రెడ్డి, మధు, ప్రజ్వల్, తదితరులు పాల్గొన్నారు.

కళా దర్బార్ ప్రతిభా పురస్కారాలు బహూకరణ



నవతెలంగాణ : కల్చర్

శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై కళా దర్బార్ నిర్వహణ లో వర్ధమాన ప్రవర్ధమాన గాయనీగాయకులకు నటుడు సుమన్ కు ప్రతిభా పురస్కార ప్రదనోత్సవం సంగీత భరితం గా జరిగింది. నటుడు సుమన్ పురస్కారం అందుకొని మాట్లాడుతూ తెలుగు నాట దసరా పండుగ విశిష్టమైనదని అన్నారు.కళా దర్బార్ ఉత్తమ సంగీతానికి ప్రాధాన్యత మిచ్చి గాయకులను సత్కరించటం ముదావహం అన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి పాల్గొని డీ.వీ. మోహనకృష్ణ, రామాచారి, సురేఖ, శశీ కళ, విశ్వనాథ్, పద్మశ్రీ లకు సంగీత సేవారత్న, అమని, చింతలపాటి సురేష్, శారదా సాయి, రమణ, మాధవి లకు సంగీత గాన రత్న, శ్రీదేవి, ఖాజా, ఇందునైన, జ్యోతిర్మయి, శైలజ తదితరులకు స్వర రత్న బిరుదు తో సత్కరించి అభినందించారు. వేదిక పై సుచిర్ ఇండియా అధినేత కిరణ్, కళా పోషకులు శ్రీధర్, వేంకటేశ్వర రావు, డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ స్థాపకుడు పొత్తూరి రంగా రావు స్వాగతం పలికిన సభకు తొలుత గాయకులు పాడిన పాటలు శ్రోతలను తన్మయుల చేశాయి.

అందెల శ్రీరాములు విజయం ఆకాంక్షిస్తూ..

స్వగ్రామంలో ప్రజలు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

అందెల శ్రీరాములు విజయం ఆకాంక్షిస్తూ... స్వగ్రామం లో ప్రజలు ప్రత్యేక పూజలు.మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా అందెల శ్రీరాములు యాదవ్ పేరును బీజేపీ అధిష్ఠానం ప్రకటించడంతో నియోజకవర్గం వ్యాప్తంగా గెలుపును ఆకాంక్షిస్తూ దుర్గమాత అమ్మవారి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ బస్టాండ్ అవరణంలోని ఎల్లమ్మ గుడిలో దేవాలయంలో కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే ఆలయం నుండే ప్రచారం ప్రారంభించినట్లు శ్రీరాములు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

విజయదశమి సందర్భంగా భగవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చైర్మెన్ సభావాట్ దూదు చౌహాన్ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రుల్లో ఈ రోజూ చివరి రోజుకాబట్టి భక్తులంతా అమ్మ అనుగ్రహం కోసం ఎంతో భక్తి శ్రద్ధలతో దుర్గామాతాను పూజిస్తారున్నారు. దేశ వ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. దసరా రోజున దుర్గాదేవి భక్తులంతా మహిషాసుర మర్దన కార్యక్రమంలో పాల్గొని విజయదశమిని ఘనంగా జరుగుతుందన్నారు. అంతేకాకుండా కొంద మంది కొత్త దుస్తువులను ధరించి మహా శక్తి పీఠాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఇలా చేయడం వల్ల అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



జగద్గిరిగుట్టలో..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆడపడుచులు ఎంతో ఇష్టంగా ఆడుకునే పండుగ బతుకమ్మ వేడుకలు కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం సాయంత్రం మహిళలు యువతులు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో గల నల్ల పోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి ,సాంబయ్య కమిటీ సభ్యులు ,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం నిమజ్జనం చేశారు.

జగద్గిరిగుట్ట డివిజన్‌లో...

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తి గణేష్ మండపం వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు మహిళలు వైభవంగా జరుపుకున్నారు మహిళలు, యువతులు రంగురంగుల బతుకమ్మతో సందడి చేశారు.

బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో

బాలానగర్‌లో..

తంగెళ్లో దొరికిన తల్లీ మా తల్లీ బతుకమ్మ.. ఏ తల్లి కన్నదో నిన్ను మా తల్లీ బతుకమ్మ.. అంటూ ఆదివారం సాయంత్రం బాలానగర్ డివిజన్ పరిధిలోని మహిళలు, ఆడపడుచులు దుర్గామాత గుడి వద్ద 'సద్దుల బతుకమ్మ వేడుకలను' డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క పువ్వులతో బతుకమ్మలను ఇంటింటా తయారు చేసిన మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో దుర్గామాత గుడి ప్రాంగణానికి తరలి వచ్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు, ఆడపడుచులు ఆటలు ఆడారు. వేడుకలను కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ నాయకులు, మహిళలు వేడుకలను తిలకించారు. బాలానగర్ పోలీసులు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ సిబ్బందితో వేడుకలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలానగర్‌లో..











పీవీటీ మార్కెట్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ



నవతెలంగాణ-చైతన్యపురి

పీవీటీ మార్కెట్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీవీటీ మార్కెట్ మర్చంట్ కమిటీ అధ్యక్షుడు కైరం కొండ ధనుంజయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తీరొక్క పువ్వులతో బతుకమ్మలను ఇంటింటా తయారు చేసిన మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో దుర్గామాత గుడి ప్రాంగణానికి తరలి వచ్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు, ఆడపడుచు లు ఆటలు ఆడారు. ఈ కార్యక్రమం ఫౌండర్ కమిటీ కోశాధికారి సత్యనారాయణ, డైరెక్టర్ బడుగు పెంటయ్య మర్చంట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శులు భువనగిరి శ్రీనివాసులు, కృష్ణ, కోశాధికారి భిక్షపతి, ప్రసాద్ కుమార్ తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం | అక్టోబర్ 23, 2023 | www.navatelangana.com

వజ్ర మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠి తిలక్ రోడ్‌లోని వజ్ర మైసమ్మ ఆలయంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆర్‌పి వినోద్‌కుమార్, శేఖర్ చారి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈశ్వర్, మహేష్ గౌడ్, గుడి సభ్యులు లక్ష్మి, డిజలక్ష్మణ్ యాదవ్, దశరథ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ప్రముఖ కొరిగ్రాఫర్



నవతెలంగాణ - ముషీరాబాద్

ముషీరాబాద్ నియో జకవర్గం గాంధీనగర్ డివిజన్ లో సద్దుల బతు కమ్మ వేడుకలు ఘ నంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, హాజరై మహిళా ఆడపడుచులతో దాండియా ఆటలు ఆడారు. ఈ వేడుకలలో యువ నాయకులు వినయ్ కుమార్,డివిజన్ బీజేపీ, బిజెవైఎం,మహిళ మోర్చ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో స్వర్ణ పథకం సాధించిన తెజావత్ సుకన్య బాయ్





- తేజావత్ సుకన్య బాయ్‌ని అభినందించిన వైవి గోపాలకృష్ణమూర్తి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రాష్ట్రస్థాయి తెలంగాణ ఎక్విప్డ్, అన్‌క్విప్డ్ బెంచ్ ప్రెస్ పోటీల్లో బంజారా తెగకు చెందిన తేజావత్ సుకన్య బాయ్ తన సత్తా చాటారు. జీహెచ్‌ఎంసి హైదరాబాద్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ హాల్ లో నిర్వహించిన బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్-2023 పోటీల్లో హైదరాబాద్ కు చెందిన తెజావత్ సుకన్య బాయ్ 76 కిలోల విభాగంలో మొత్తం 140 కేజీల బరువు ఎత్తి స్వర్ణ పథకం సాధించారు. ఆమెకు రెండు స్వర్ణ పథకాలు దక్కాయి ఈ సంద ర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో ఏ సీ ఈ ఇంజనీరింగ్ అకాడమీ సిఎండి వైవి గోపాల కృష్ణ మూర్తి, రిటైర్డ్ ఐఏఎస్ తేజావత్ రామచంద్రుడు,భూక్య శోభాన్ నాయక్, ఎం సి ఓ ఈ చీఫ్ కోచ్ వి ఎస్ రాజశేఖర్ లు ఆమెను అభినందించారు. అనంతరం చైర్మన్ వైవి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ.. నవంబర్ 22వ తేదీన బెంగళూరులో జరగబోతున్న జాతీయస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలకు తేజావత్ సుకన్య బాయ్ ఎంపికైన సందర్భంగా అభినందించారు ఆ పోటీల్లో పథకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆమెను ప్రోత్సహించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్ట్రాంగ్ ఉమెన్ గా పేరు సంపాదించారని తెలిపారు. తనకు సహాయ సహకారాలు అందిస్తున్న చైర్మన్ వై వి గోపాలకృష్ణమూర్తికి సుకన్య భాయ్ కృతజ్ఞతలు తెలిపారు.

బస్తీలో బీఎస్పీ పార్టీ పాదయాత్ర



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి బస్తీలో విస్తృతంగా పాదయాత్ర నిర్వహిస్తామని బీఎస్పీ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇంచార్జ్ పోచగారి నరేందర్ అన్నారు. నియోజకవర్గం, ఉన్నికోట, కోదండరెడ్డినగర్‌బస్తీలో ఇం టింటికి తిరుగుతూ ప్రజలకు అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ బల పరిచిన అభ్యర్థిని ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్రహార్ హు స్సేన్ ఆజాద్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ కన్వీనర్, పిట్ల బాలరాజు , జిల్లా ఇన్‌ఛార్జి , విశ్వ చారి, ఉపాధ్యక్షులు, బం డారి శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, నందకుమార్, కార్యదర్శి, పి వై పరమేశ్వర్, నియోజకవర్గం అధ్యక్షులు, రహీం ఖాన్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు, విశ్వనాథ్ మహారాజ్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు, హరి ప్రసాద్ భోలక్ పూర్ డివిజన్ అధ్యక్షులు, ప్రశాంత్, దుర్గాప్రసాద్ డివిజన్ ఇంచార్జ్, రాజు, రవితేజ, సోను, చింటూ మహ రాజ్, రవీంద్ర,దుర్గా మహరాజ్, వి పాల్గొన్నారు.

జింఖానా మైదానంలో ఆకట్టుకుంటున్న హునార్ మహోత్సవం





నవతెలంగాణ-కంటోన్మెంట్

జింఖానా మైదానంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న హున మహోత్సవం ఆహు తులను ఆకట్టుకుంటుంది. మహోత్సవంలో భాగంగా ప్ర త్యేకంగా సంగీత కచేరి కార్యక్రమం అం దరినీ విశేషంగా ఆకట్టుకుంది. జంట నగరాలకు చెందిన యువతీ యువకులు, మహిళలు అరుదైన కళాఖండాల ప్రదర్శన లో సంగీత కచేరీ వినసొంపుగా సాగుతోంది ..హైదరా బాద్ కి చెందిన వికలాంగుడు ధనుంజయ,రాహుల్ బెడి ల సంగీత కార్యక్రమం మహోత్సవ్ సందర్భ నానికి వచ్చిన ఆహుతులను విశేషంగా కట్టుకుంటుంది. ఈ హునర్ మహోత్సవ్ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చి ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఉన్న కళాత్మక వస్తువులు, వంటకాలతో పాటు సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలు స్తుంది. దీంతో హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వివిధ రాష్ట్రాల మహిళలు యువతులు నివాసితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రదర్శనలో పొందు పరిచిన పలు రకాల వస్తువులు దుస్తులతో పాటు నిత్యజీవితంలో ఉపయోగపడే వస్తువులను కొనుగోలు చేసి వారు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బీసీ జాగృతి అలాయ్ బలయ్‌న్ని విజయవంతం చేయాలి



- తెలంగాణ బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కే మురళీకృష్ణ

నవతెలంగాణ-అంబర్‌పేట

ఈనెల 26వ తేదీన గురువారం తెలంగాణ సం స్కృతిలో భాగంగా కుల మతాలకు అతీతంగా రాజకీయ లకు సంబంధం లేకుండా అందరూ ఒకే వేదిక మీద కలవడానికి బీసీ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే అలాయ్ బలయ్ కార్యక్రమం ఆహ్వాన పత్రికను బీసీ జాగృతి అధ్యక్షులు కె.పి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో రత్ననగర్ అధ్య క్షులు ఈశ్వర్ , బీసీ జాగృతి కార్యదర్శి పాతకోటి మహేష్, జాగృతి కమిటీ మాచర్ల అర్జున్, దిలీప్ కుమార్ నేత, రామ్ జగదీష్, మాలమహానాడు గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మరిపల్లి శ్రీకాంత్, ఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాపై కావాలని కుట్ర చేస్తున్నారు-విహెచ్ హనుమంతరావు



నవ తెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నాపై కావాలని కుట్రలు కుతంత్రాలు చేసి నేను బలపరిచిన అభ్యర్థిని కాదని మరొకరికి సీటు ఇ చ్చే కుట్ర జరుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు వి హెచ్ హనుమంతరావు అన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని తన స్వగృహంలో విలేకర్ల జ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజక వర్గం నుంచి గతం లో గెలిచి మంత్రిని అయ్యాను అని అంబర్ పేట్ అభివృద్ధి కోసం అనేక పనులు చేశా ఇక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్ ను లక్ష్మణ్ యాదవ్ అడుగుతున్న గతంలో ఇక్కడి నుంచి యాదవ్ లు గెలిచారు. గత ఎన్నికల్లో కోదండరాం గట్టిగ పట్టు పట్టి.. అధిష్టానం కూడా చెప్పడం తో వెనక్కి తగ్గా మ్.. ఇప్పుడు ఉత్తమ్ నా అంబర్ పేట్ సీట్ వెంట పడ్డా డు. ఇక్కడ నూతి శ్రీకాంత్ గౌడ్ ను.. ఉత్తమ్ ఎగదో స్తుం డు. శ్రీకాంత్ అనే వ్యక్తి.. నాపై అట్రాసిటీ తప్పుడు కేసు పెట్టాడు. శ్రీకాంత్ లాంటి వ్యక్తి ని ఉత్తమ్ ఎంకరేజ్ చేయ డం కరెక్ట్ కాదు. నాపై దుష్ప్రచారం చేస్తుండు. గత ఎన్ని కల్లో డబ్బులు తీసుకొని వెనక్కి తగ్గారని చెప్పడం కరెక్ట్ కాదు. హను మంతరావు డబ్బులు తీసుకునే వ్యక్తి నా.. డబ్బులకు అమ్ముడుపోతే సగం హైదరాబాద్ నాదే ఉం డేది. సూర్యాపేట లో బీసీ మీటింగ్ పెడుతా అంటే.. పెట్టనీయలేదు ఉత్తమ్ కు బీసీ ఓట్లు కావాలి.. బీసీ మీ టింగ్ వద్దా.. కాంగ్రెస్ లో నుంచి బయటకు పంపేందుకు ఉత్తమ్ కుట్ర చేస్తుం డు. నేను పార్టీ మారను.. గాంధీ కుటుంబానికి విరాభిమానిని. ఉత్తమ్ తన మనుషులు మహే శ్వర్ రెడ్డి, గూడూరు నారాయణ రెడ్డి ని బిజేపీ పార్టీలోకి మరో అనుచరుని కౌశిక్ రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీలోకి పంపించాడు. జగ్గా రెడ్డి ని కూడా పార్టీ నుంచి పంపే ప్రయత్నం చేశాడు.జగ్గా రెడ్డి తో పీసీసీ అధ్యక్షుడు అవుతావని రేవంత్ పై ప్రతిరోజు మీడియా లో మాట్లాడించింది ఉత్తమ్ అని పార్టీ మారుతున్నా అని మీడియాలో ప్రచారం చేసుకొని బ్లాక్ మెయిల్ చేసి పదవులు తెచ్చుకు న్నాడు. స్క్రీనింగ్ కమిటీలో ఉండి మాపై దుస్ప్రచారం చేస్తుండు. ఉత్తమ్ పార్టీ వ్యతిరేకంగా చేసిన పనులను బయట పెడుతా.. నేను పార్టీ లాయలిస్ట్ ను. నీకు, నీ భార్య కు సీట్లు కావాలి.. మా సీట్లు మాకు వద్దా.. అంబర్ పేట సీటు నాది.. నాకు దక్కకుండా చేస్తే.. నేను కూడా ఉత్తమ్ వెంట పడుతా అనీ హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



నవతెలంగాణ - ముషీరాబాద్

బిఆర్‌ఎస్‌లో అభివృధి సంక్షేమ పథకాలను చూసి ప్రజలు భారీగా చేరుతున్నారు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని అడిక్ మెట్ డివిజన్ వడ్డెర బస్తిలో కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు కార్యకర్తలు బిఆర్‌ఎస్ పార్టీలో చేరికయ్యారు. వారిని పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పార్టీలోకి సాధా రణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి ఇతర పార్టీ నాయకులు కార్యకర్తలు ఆకర్షితులై పార్టీలో చేరికవుతు న్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ బల్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్, బొట్టు శీను, యూనిస్, అబ్బు,రాజు,కిషోర్,రవి యాదవ్,బాబు రావు, ఆకారం శ్రీనివాస్, గురుదీప్ సింగ్, ఖలీల్ ,అహ్మద్, పురుషోత్తం తదితర నాయకులు పాల్గొన్నారు.

తొలివిడుతలో పాతబస్తీకే పరిమితం!

- నగరంలోని 15స్థానాల్లో ఏడు స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన
- ఖైరతాబాద్ మినహా సిటీలో అభ్యర్థులను ప్రకటించిన వైనం!
- కాంగ్రెస్ రెండో జాబితా తర్వాతే.. బీజేపీ మరో లిస్ట్!



నవతెలంగాణ-సిటీబ్యూరో

త్వరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి విడుత జాబి తాను ఎట్టకేలకు బీజేపీ పార్టీ ప్రకటించింది. ఆదివారం 52 మందితో విడుదల చేసిన ఫస్ట్ లిస్ట్‌లో హైదరాబాద్ జిల్లాలో ఏడు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను పరిమితం చేసింది. కీలకమైన ఎనిమిది స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయలేదు. పాతబస్తీలోనే క్యాండిడేట్స్‌ను ప్రకటించడం వెనుకాల కమలం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ వ్యూహ్యాన్ని రచిస్తున్నట్టు అర్థమవుతోంది. సెకండ్ విడుత జాబితాను కాంగ్రెస్ విడుదల చేసిన తర్వాతనే.. బీజేపీ తన రెండో విడుత జాబితాను విడుదల చేయాలని భావిస్తోంది. కాంగ్రెస్ రెండో విడుతలో సీటు దక్కని అభ్యర్థులకు, అసంతృప్తులను తమ పార్టీలో చేర్చుకుని వారు ఆశించే స్థానాలకు టికెట్లను ఇవ్వాలనే నేపథ్యంలో మిగతా ఎనిమిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదని తెలుస్తోంది.

ఇదిలావుంటే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే తొలివిడుతలో నగరం తో పాటు మేడ్చల్ జిల్లాలు కలిపి 20 స్థానాలకుగాను 14 మంది అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో నగరంలో పది స్థానా లకు అభ్యర్థులను ప్రకటించగా.. మరో అయిదు స్థానా లను ప్రకటించాల్సి ఉంది. ఇందులో జూబ్లీహిల్స్, అంబర్‌పేట్, కంటోన్మెంట్, చార్మినార్, ఖైరతాబాద్ స్థానాలు ఉన్నాయి. ఉదాహ రణకు జూబ్లీహిల్స్ సీటు కోసం అజారువుద్దీన్ ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేస్తుండగా.. విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్రస్థాయిలోని కీలక నేత లతో టచ్‌లోకి వెళ్లారు. ఈ స్థానాన్ని ఎట్టిపరిస్థితుల్లో తనకే ఇవ్వా లని విష్ణువర్ధన్ రెడ్డి, అజారువుద్దీన్ బలంగా కోరుతున్నారు. దీనిపై ఆ పార్టీ అధిష్టానం సమాలోచనలు చేస్తోంది. అయితే ఈ ఇద్దరు నేతలు టికెట్ తనకేంటూ ఎవరికివారే ప్రచారం చేసుకుంటు న్నారు. అయితే కాంగ్రెస్ రెండో విడుతలో ఒకవేళ అధిష్టానం అజారువుద్దీన్ వైపు మొగ్గుచూపితే.. విష్ణువర్ధన్ రెడ్డి బీజేపీ పార్టీ లోకి వెళ్లే అవకాశం ఉందని, ఆ పార్టీ తరపున జూబ్లీహిల్స్ నుంచి పోటీలో ఉండవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఇక అంబర్‌పేట్ నియోజకవర్గానికి వస్తే.. కేంద్రమంత్రి, ప్రస్తుత ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఈ లిస్ట్‌లో చోటు దక్కపోవడం గమనార్హం. అయితే ఈ స్థానం నుంచి ఆయన తన సతీమణి కావ్యను బరిలోకి దింపాలనే ప్లాన్ చేస్తున్నారు. దీనిపై పార్టీలో తీవ్ర వ్యతిరేక వస్తుంది. ఒకే కుటుంబంలో ఇద్దరికే ఎలా అవకాశం ఇస్తారని వారంటున్నారు. అంతేగాక ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచి ఇటీవలే ఆ పార్టీలో చేరిన కృష్ణ యాదవ్‌తో పాటు 30 మంది వరకు ఈ స్థానాన్ని ఆశిస్తున్నప్పటికీ.. తన సతీమణికి కిషన్ రెడ్డి టికెట్ ఇప్పించుకునేందుకు అధిష్టానంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. అంతేగాక ఈ స్థానాన్ని ఎట్టిపరిస్థితుల్లో నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడ కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థులపై గురిపెట్టారు. రెండో జాబితాలో టికెట్ దక్కనివారితో పాటు ఇతర అసంతృప్త నేతలకు ఏదో ఆశచూపి వారిని తమ పార్టీలో చేర్చుకుని తద్వారా ఈ స్థానంలో గెలవాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అలాగే సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్, ముషీరాబాద్, మలక్‌పేట్ స్థానాలను సైతం ఇదే రీతిలో దక్కించుకోవాలని చూస్తున్నప్పటికీ.. అది అయ్యే పనికాదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం జాబితా ప్రకారం అస మ్మతులు లేని, ఆశావహులు తక్కువగా ఉన్న చోటే టికెట్లను ఖరా రు చేయగా.. ఇందులో ఖైరతాబాద్ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే చిం తల రామచంద్రారెడ్డికి కేటాయించారు. అలాగే మేడ్చల్‌లోని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ స్థానాన్ని కూన శ్రీశైలం గౌడ్‌కు కేటాయి ంచగా.. మరో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. దీన్ని బట్టి ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏడు స్థానాలకు అభ్యర్థులు వీరే..!

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 15 నియోజవర్గాల కుగాను ఆదివారం బీజేపీ ప్రకటించిన తొలివిడుత అభ్యర్థుల జాబి తాలో నగరం నుంచి ఏడుగురికి చోటు కల్పించారు. మరో ఎని మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఖైరతాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి అవకాశం కల్పించగా.. గోషామహల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కేటా యి ంచారు. బీజేపీ అధిష్టానం రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయ డంతో మరోసారి గోషా మహల్ నుంచి ఆయన పోటీ చేయను న్నారు. కార్వాన్ నుంచి అమర్ సింగ్, చార్మినార్ నుంచి మేఘా రాణి, చాంద్రాయణగుట్ట నుంచి సత్యనారాయణ ముదిరాజ్, యాకుత్‌పూర నుంచి వీరేందర్ యాదవ్, బహదూర్ పుర నుంచి వై. నరేష్ కుమార్ బరిలో నిలవనున్నారు.



రాంనగర్ విఎస్‌టి కంపెనీలో దసరా పండుగ సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఎస్టీ కార్మిక సంఘం అధ్యక్షులు మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి కార్మిక సంఘ నాయకులు ప్రధాన కార్యదర్శి ఐలి ప్రభాకర్ బాబి నరేందర్ గౌడ్ రవి యాదవ్ రణధీర్ రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొని కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

నవ తెలంగాణ - ముషీరాబాద్

అవినీతి పాలన ను అంతమొందించాలి

- ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్



నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణలో అవినీతి పాలన అంతమొందించాలి అంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుంది అని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్ అన్నారు.నియోజకవర్గంలోని పార్టీకార్యాలయంలో విలేక రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అ ంజన్ కుమార్ యాదవ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన చిరకాల కల అమరవీరుల ఆత్మబలిదానం, ఉద్యమకారుల త్యాగాలతో సకారం అయిందన్నారు. తెలం గాణ ప్రజల రాష్ట్ర సాధన కోరికను సోనియా గాంధీ నెరవే ర్చారని తెలిపారు. అటువంటి త్యాగాల తెలంగాణను తమ అవినీతి పాలనతో అప్పుల ఊబి లోకి నెట్టారు అని తెలి పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి రావడం ఖాయమని ముషీరాబాద్ నుంచి అత్యధిక మెజారిటీతో గెలుపొందుతామన్నారు.ఎంపీ గా పది సంవత్సరాలు పని చేసానని తన సొంత నిధులతో నియోజకవర్గ అభివృద్ధి చేశామన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన 100 రోజు ల్లోపే ప్రజలకు అందించి తెలంగాణను బంగారు తెలం గాణగా చేస్తామని తెలిపారు. అవినీతి పాలన అంతమొం దించ దానికి యావత్ తెలంగాణ ప్రజానీకం సిద్ధంగా ఉందని తెలిపారు.

పార్టీ ఇన్‌ఛార్జిలతో బిఆర్‌ఎస్ సమావేశం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

జరగబోయే ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం భారత రాష్ట్ర సమితి నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, పార్టీ నాయకులు ఆర్ వి మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ హెూం మంత్రి నాయిని నర్సింహారెడ్డి విగ్రహానికి నివాళి



నవతెలంగాణ - ముషీరాబాద్

తొలి తెలంగాణ హెూం, కార్మిక శాఖ మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆదివారం పలు సేవ కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా రాంనగర్ డివిజన్ బాగ్ లింగంపల్లిలోని లంబాడితండా బస్తీలో జరిగిన వర్ధ ంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ వి. సమత రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నాయిని దేవేందర్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయిని నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిత్ కుమార్, రేషం మల్లే ష్, నేత శ్రీనివాస్, కల్వ గోపి, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, రజనీకాంత్ గౌడ్, కల్పన, కార్తీక్ యాదవ్, రమేష్, వెంకటేష్, సత్యనారాయణ, ఇయాజ్, అమిత్, నాని, సోను, లోకేష్, శివ, బాలయ్య, మధు, సాయి, అజ్జు, శంకర్, రాజే ష్, రింకు సింగ్, ప్రేమ్, మున్ను, లీలాదేవి, రేఖ, తులసి, తిరుమల, సబిత, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

రాజస్థానీ దాండియాలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజాసింగ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ 51వ రామా యణ మేళాలో దాండియా ఆటను ఘనంగా నిర్వహి ంచారు. గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజా సింగ్ పాల్గొన్నారు. అనంతరం ఆయనను మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్ రాఠి, అనిల్ మిశ్రా, సురేందర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, లక్ష్మీదేవి. మనోజ్ జైస్వాల్‌శాలువాతో సన్మానించారు.



కోఠి లోని జగదాంబ ఆలయంలో జరిగిన అన్నప్ర సాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే రాజా సింగ్, బిజెపి పార్టీ గోల్కొ ండ జిల్లా అధ్యక్షులు పాండు యాదవ్, గన్ ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖా ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



దేవీ నవరాత్రుల ఉత్సవాలను ఆజాద్ నగర్‌లో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారిని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామారావు యాదవ్, రాగుల ప్రవీణ్ పటేల్, రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

దుర్గామాతకు పూజలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో దుర్గామాతకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేం ద్రనాథ్. ఆర్‌ఎంఓ డాక్టర్ సాధన,డాక్టర్ రాజశేఖర్ బాబు, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి డాక్టర్ వెంకటేష్ షాహిదా, నర్సింగ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేప థ్యంలో రాచకొండ పోలీసు సిబ్బందికి సహాయంగా ఏడు కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు వచ్చేశాయి. ఇవి తొలి విడత బలగాలు కాగా త్వరలో మరిన్ని కేంద్ర బల గాలు రానున్నాయి. రాచకొండ పోలీస్ సిబ్బందితో కలిసి ఈ కేంద్ర బలగాలు పలు నియోజకవర్గాల్లో ఫ్లాగ్ మార్చ్ వంటి కవాతు నిర్వహిం చనున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీ డిఎస్ చౌహాన్ ఐపిఎస్ మాట్లాడుతూ,, అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పాత నేరస్తులను ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా బైండోవర్ చేస్తున్నామని అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అవసరమైన ప్రదేశాల్లో చెక్ పో స్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.నగదు తదితర వస్తువులు తీసుకెళితే సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.



అంబర్‌పేట దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు,స్థానికులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-అంబర్‌పేట





అక్షరాలే కాదు ఆత్మరక్షణ నేర్పుతూ...

ఆశా సుమన్... హిందీ ఉపాధ్యాయురాలు. కానీ పిల్లలకు అక్షరాలు నేర్పిస్తే తన బాధ్యత తీరినట్టు భావించలేదు. అమ్మాయిలకు ఈ సమాజంలో ఎదురౌతున్న సమస్యలను ఎలా ఎదుర్కోవాలో నేర్పుతున్నారు. వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతున్నారు. వారికి అవసరమైన ఆత్మరక్షణ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 30,000 మంది బాలికలకు శిక్షణ ఇచ్చారు. తాను ఎక్కడ ఉన్నా ఇదే తన జీవిత లక్ష్యమని చెబుతున్న ఆ స్ఫూర్తిదాయక ఉపాధ్యాయురాలి పరిచయం నేటి మానవిలో...

ఆశా సుమన్ యువతుల కోసం అందిస్తున్న స్వీయ రక్షణ తరగతులు కేవలం బోధించే పాఠాలుగా మాత్రమే కాదు, దీర్ఘకాలంలో వారిలో విశ్వాసాన్ని పెంపొందించే ఆయుధాలుగా కూడా ఉపయోగపడతాయి. 2015లో రాజస్థాన్‌లోని అల్వార్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా ఉన్న ఆశా బాలికలు, యువతులకు ఆత్మరక్షణ నేర్పించే బాధ్యతను స్వీకరించారు. తద్వారా వారు ఆపదలో ఉన్న సమయాల్లో తమను తాము రక్షించుకోగలరు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఆమె రాజస్థాన్‌లో సుమారు 30,000 మంది మహిళలకు శిక్షణ ఇచ్చింది. ఇందులో వినికిడి సమస్య, దృష్టి లోపం ఉన్న బాలికలు 250 మంది ఉన్నారు. అలాగే కొంతమంది వృద్ధ మహిళలు కూడా ఉన్నారు.

స్వీయ రక్షణ తరగతులు

'అమ్మాయిలకు వారిని వారు రక్షించుకునే శక్తి ఉండాలి. దాని కోసమే నేను ఈ శిక్షణా తరగతులు ప్రారంభించాను' అని ఆశా అంటున్నారు. స్థానిక పాఠశాలలో హిందీ బోధించే ఆశా బాలికలకు తైక్వాండో, కరాటేతో పాటు ఇతర మార్షల్ ఆర్ట్ నేర్పిస్తున్నారు. పాఠశాల ముగిసిన తర్వాత ఆమె ఈ స్వీయ రక్షణ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సెషన్ దాదాపు ఆరు రోజులు ఉంటుంది. ఆమె దేశంలోని 24 రాష్ట్రాలలో దాదాపు 8,000 మంది ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ కూడా ఇస్తుంది.



ఆ సంఘటనతో...

2005లో ఆశా తన ఉద్యోగం ప్రారంభించినప్పుడు పాఠశాలలో కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. సరైన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు లేవు. పాఠశాల నుండి సమీప రహదారి 3.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. సర్పంచ్ సహకారంతో ఆశా గ్రామంలోని తల్లిదండ్రులకు చదువు ప్రాధాన్యం గురించి వివరించింది. ఆమె ప్రయత్నాలు ఫలించి రెండేండ్లలోనే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 120కి చేరుకుంది. ఫలితంగా విద్యాశాఖ 2007లో పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించింది. 2014లో ఆ గ్రామంలో మానసిక వైకల్యం ఉన్న మైనర్ బాలికపై పాఠశాల సమీపంలోని పొలంలో నలుగురు అబ్బాయిలు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనతో గ్రామం మొత్తం షాక్‌కి గురయింది. పాఠశాలకు వచ్చే బాలికల సంఖ్య కూడా తగ్గింది. పొలాల నుండి ఒంటరిగా నడుచుకుంటూ పాఠశాలకు రావల్సి వచ్చేది. దాంతో ఆశా భద్రత గురించి ఆందోళన చెందారు. అయితే ఈ ఘటనతో బాలికల చదువుకు ఆటంకం కలగకూడదనుకున్నారు.

ఆత్మ విశ్వాసం పెరిగింది

'ఆమెకు ఆత్మరక్షణ గురించి తెలిస్తే తనను తాను రక్షించుకోగలిగేది. అందుకే నేను వెంటనే అమ్మాయిల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలను ఒప్పించే ప్రయత్నం చేశాను. చదువు ప్రాముఖ్యతను వారికి వివరించడానికి ప్రయత్నించాను. నేను కూడా నా ద్విచక్ర వాహనంపై వారి ఇళ్లకు అమ్మాయిలకు తోడుగా వెళ్ళేదాన్ని' అని ఆమె గుర్తుచేసుకుంది. ఆమె ఎంత కృషి చేసినా బాలికలు ఆ సంఘటన నుండి తేరుకుని ఆత్మవిశ్వాసం పొంది తిరిగి పాఠశాలకు రావడానికి రెండు నెలలకు పైగా పట్టింది. ఈ సమయంలోనే ఆశా ఆత్మరక్షణ నేర్చుకోవాలని, పిల్లలకు నేర్పించాలని బలంగా నిర్ణయించుకుంది. 2015లో జైపూర్‌లోని పోలీస్ అకాడమీలో ఆత్మరక్షణ కోర్సుకు హాజరైంది. 'కోర్సు పూర్తి చేసిన తర్వాత వెనక్కి తగ్గేది లేదు. ఈ అమ్మాయిలు తమ భద్రతను స్వయంగా నియంత్రించుకునేలా శక్తివంతం చేసేందుకు నేను ఒక ప్రయాణాన్ని ప్రారంభించాను' అని ఆమె చెప్పింది. సాధారణ అమ్మాయిలకే కాకుండా దృష్టిలోపం, మూగ, వినికిడి లోపం ఉన్న అమ్మాయిలకు కూడా ఆత్మరక్షణ ఎలా నేర్పించాలో ముంబైలోని కంబాట్ టాక్టికల్ అసోసియేషన్‌లో ఆమె శిక్షణ పొందింది.


తాను శిక్షణ తీసుకుని...

ఆశా ప్రత్యేక సామర్థ్యం ఉన్న అమ్మాయిలకు కూడా అటాక్ పొజిషన్‌లను నేర్చుకోవడంలో సహాయపడుతుంది. ఎవరైనా తమను అనుసరిస్తున్నారో లేదో అర్థం చేసుకోవడానికి ఆమె డమ్మీని కూడా ఉపయోగిస్తుంది. అమ్మాయిలకు శిక్షణ ఇవ్వడానికి ఆమె అనేక రకాల సాంకేతికత నైపుణ్యాలను వాడుకుంటుంది. అటాకర్‌ను వంగి మోచేతితో కొట్టడం, కిక్‌లతో కొట్టడం వంటివి నేర్పుతుంది. గత ఏడాది ఆశా వద్ద స్వీయ రక్షణ శిక్షణ పొందిన దృష్టి లోపం ఉన్న మోనికా మాట్లాడుతూ 'చిన్నప్పటి నుండి నేను ఎక్కడికి వెళ్లినా నా తల్లిదండ్రులు నాతో పాటు ఉండేవారు. నా భద్రత గురించి అందరూ భయపడుతుంటారు. అయితే సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తీసుకున్న తర్వాత నేను ఇప్పుడు ఒంటరిగా సమీపంలోని ప్రదేశాలకు వెళ్లగలను. నన్ను నేను రక్షించుకోగలననే విశ్వాసం నాలో ఉంది' అని ఆమె చెప్పింది. ఆశా స్వీయ రక్షణపై ఉచిత వర్క్‌షాప్‌లను నిర్వహించడానికి పాఠశాలలు, కళాశాలలు, గ్రామ ప్రజలు కూడా సహకరిస్తుంది. 'అమ్మాయిలు శారీరకంగా బలహీనంగా ఉన్నామని అనుకుంటారు. ఆ భావనతోనే వారు పురుషులతో పోరాడలేరు. అందుకే వారు తమను తాము రక్షించుకునేలా తగినంత శిక్షణ ఇవ్వడమే నా జీవిత లక్ష్యం. ఎక్కడ ఉన్నా అమ్మాయిలకు శిక్షణ ఇస్తూ వారిని స్వయం సమృద్ధిగా చేస్తాను' అంటూ ఆమె తన మాటలు ముగించింది.

- సలీమ

దృఢంగా తయారు చేయాలి

ఆత్మరక్షణ శిక్షణ 90 శాతం మానసిక ప్రయత్నమని, కేవలం 10 శాతం మాత్రమే శారీరక శ్రమ అని ఆశా చెబుతుంది. ఒకరి శరీరాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవాలనే ఆలోచనను కూడా ఆమె నొక్కి చెప్తుంది. తీవ్రమైన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో, అత్యవసర సమయాల్లో ఎలా సహాయం పొందాలో ఆమె విద్యార్థులకు సూచిస్తూ తన తరగతిని ప్రారంభిస్తుంది. ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా ఎదుర్కోవాలంటే చర్చలే తొలి అడుగు అని ఆమె అంటుంది. అన్ని ప్రయత్నాలు చేసిన తర్వాత చివరకు భౌతిక రక్షణను ఆశ్రయించాలని ఆమె తన విద్యార్థులకు సలహా ఇస్తుంది. ఎదుటి వ్యక్తిని తన్నడం, అడ్డుకోవడం, దాడి చేసే వ్యూహాత్మక పద్ధతుల వంటి నైపుణ్యాలపై బహిరంగ శిక్షణా సెషన్‌లను నిర్వహిస్తుంది. ఆత్మరక్షణ సమయంలో మానవ శరీరంలోని ఏ భాగాలకు హాని కలిగిస్తే భద్రత ఉంటుందో విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. అంతే కాదు మహిళల భద్రత, సంబంధిత హెల్ప్‌లైన్‌లకు సంబంధించిన చట్టాల గురించి కూడా చెబుతుంది.



వయసు పెరిగే కొద్దీ...

సాధారణంగా వయసు పెరిగేకొద్దీ శరీరంలో ఆయా అవయవాల పనితీరు కూడా కాస్త నెమ్మదిస్తుంది. ముఖ్యంగా జీర్ణవ్యవస్థ. ఈ పరిస్థితుల్లో మరీ జీర్ణంకానటువంటి పదార్థా లను తీసుకుంటే సమస్య జఠిలమవుతుంది. అలాగే వయసు పెరిగి వృద్ధాప్యంలో పడుతున్న సమయంలో శరీరానికి శక్తి కూడా కావాలి. కాబట్టి తగిన పదార్థాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలి



- వృద్ధుల్లో విటమిన్ డి, క్యాల్షియం, విటమిన్ బీ12, పీచు, పొటాషియం వంటి ప్రత్యేకమైన పోషకాల అవసరం చాలా ఎక్కువ. తక్కువ కొవ్వు పాల పదార్థాలు, ఆకు కూరలు, చేపలు తగినంతగా తీసుకోవటం ద్వారా విటమిన్ డి, క్యాల్షియం లభిస్తుంది. ఇవి ఎముక పుష్టికి దోహదం చేస్తాయి.
- చేపలు, సముద్ర ఆహారం, తేలికైన మాసం నుంచి విటమిన్ బి 12 అందుతుంది. సాధారణంగా వృద్ధాప్యంలో తప్పనిసరిగా వేధించే సమస్య మలబద్ధకం. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, ముడి బియ్యం లేదా దంపుడు బియ్యం వంటి పొట్టు తీయని ధాన్యం అధికంగా తీసుకుంటే ఈ బాధ నుంచి తేలికగా బయటపడొచ్చు. వీటన్నింటిలో పీచు సమృద్ధిగా ఉంటుంది.
- పండ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వు పాల పదార్థాల్లో వృద్ధు లకు అవసరమైన పొటాషియం కూడా ఉంటుంది. అందరిలాగే వృద్ధులు కూడా నూనె పదార్థాలు, వేపుళ్ల తగ్గించటం శ్రేయస్కరం. ముఖ్యంగా నెయ్యి, డాల్డా వంటి సంతృప్త కొవ్వులు తగ్గించి పొద్దు తిరుగుడు నూనె వంటివి, అదీ మితంగా తీసుకుంటే మంచిది.

ఆరోగ్యానికి ఎంతో మేలు

మనం తినే పండ్లలో అరటిపండు ఎంతో ఆరోగ్యకరమైన ఆహారం. తరచుగా అరటిపండ్లు తింటూ ఉంటే... చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి. పైగా ఇది తక్షణ శక్తిని ఇస్తుంది. ముఖ్యంగా తిన్న ఆహారం అరగక ఇబ్బంది పడేవారు అరటిపండ్లు తింటూ ఉంటే... జీర్ణక్రియ బాగా పనిచేస్తుంది.


- కొంతమంది హైపర్ టెన్షన్ సమస్యతో ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాంటి వారు అరటిపండును తినడం మేలు. ఎందుకంటే ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. అది పరిష్కారం చూపిస్తుంది.
- అరటిపండులో సహజమైన యాంటీ-యాసిడ్ ఉంటుంది. ఇది పొట్టలో సమస్యలకు చెక్ పెడుతుంది. అలాగే అరటిలోని షుగర్ శరీరానికి బలాన్ని ఇస్తుంది.



- ఈ పండులో ఫైబర్ ఎక్కువ. అందు వల్ల మలబద్ధకం సమస్యకు ఇది చెక్ పెడుతుంది.
- అరటిపండు ఎంత మంచిదైనా రాత్రి సమయంలో దీన్ని తినకూడదంటున్నారు నిపుణులు. ఎందుకంటే... అరటికి బాడీలో వేడిని తగ్గించే గుణం ఉంటుంది. అందువల్ల ఆల్రెడీ చల్లగా ఉన్న శరీరాన్ని ఇది మరింత చల్లబరిచి దగ్గు, జలుబు వచ్చేందుకు కారణం అవుతుంది. అందువల్ల అర్ధరాత్రిళ్లు తప్ప మిగతా రోజంతా ఈ పండును తినవచ్చని డాక్టర్లు చెబుతున్నారు.
- పెద్ద అరటిపండ్లు జీర్ణం కావడానికి కాస్త ఎక్కువ టైమ్ తీసుకుంటాయి. అందువల్ల పడుకునే 2 లేదా 3 గంటల ముందే ఈ పండును తినేయాలి. ఆ తర్వాత తినకపోవడం మేలు.
- జలుబు, దగ్గుతో బాధపడేవారు అరటిపండ్లు తినకూడదు. తింటే అవి మరింత ఎక్కువవుతాయి. రాత్రివేళ జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. అందువల్ల రాత్రిళ్ల ఈపండు తింటే వెంటనే జీర్ణం కాదు. తద్వారా నిద్రపట్టని సమస్య కూడా ఎదురవుతుంది.

మీ నుంచి నన్ను దూరం చేయలేరు

- ఆలస్యమైనా న్యాయం గెలుస్తుంది
- త్వరలో బయటకు వస్తా
- తరువాత పూర్తిస్థాయి మ్యానిఫెస్టో : టీడీపీ అధినేత చంద్రబాబు
- జైలు నుంచి ప్రజలకు బహిరంగ లేఖ



అమరావతి : ఓటమి భయంతో జైలు గోడల మధ్య బంధించి ప్రజలకు తనను దూరం చేశామనుకుంటున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. తాను ప్రస్తుతం ప్రజల మధ్యలో లేకపోవచ్చునని, అభివృద్ధి రూపంలో ప్రతీ చోటా, సంక్షేమం పేరు వినిపించిన ప్రతీసారి తన పేరే తలుస్తారని పేర్కొన్నారు. తాను జైలులో లేనని, ప్రజల హృదయాల్లో ఉన్నానని తెలిపారు. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రజాచైతన్యంలో ఉన్నానని, విధ్వంస పాలనను అంతం చేయాలనే ప్రజా సంకల్పంలో ఉన్నానని పేర్కొన్నారు. తెలుగు ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు రాసిన లేఖను ములాఖత్‌లో తన కుటుంబ సభ్యులకు అందించారు. ఈ లేఖను టిడిపి ఆదివారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేసింది. ప్రజలే తన కుటుంబం అని చంద్రబాబు లేఖలో తెలిపారు. జైలు గోడల మధ్య కూర్చుని ఆలోచిస్తూ ఉంటే 45 ఏండ్ల ప్రజా జీవితం తన కండ్ల ముందు కదలాడుతోందని పేర్కొన్నారు. తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తన రాజకీయ ప్రస్థానమంతా సాగిందని తెలిపారు. దీనికి మీరే సాక్ష్యమని తెలిపారు. మీ నుంచి ఒక్క రోజు కాదు కదా ఒక్క క్షణం కూడా దూరం చేయలేరని పేర్కొన్నారు. కుట్రలతో తనపై అవినీతి ముద్ర వేయాలని ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తాను నమ్మిన విలువలు, విశ్వసనీయతను ఎన్నడూ చెరిపేయలేరని తెలిపారు. ఈ చీకట్లు తాత్కాలికమేనని, సత్యం అనే సూర్యుడి ముందు కారుమబ్బులు వీడిపోతాయని పేర్కొన్నారు. సంకెళ్లు తన సంకల్పాన్ని బంధించలేవని, జైలు గోడలు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేవని తెలిపారు. జైలు ఊచలు తనను ప్రజల నుంచి దూరం చేయలేవని పేర్కొన్నారు. తాను తప్పుడు చేయనని, చేయనివ్వనని వివరించారు. దసరాకు పూర్తిస్థాయిలో మ్యానిఫెస్టో విడుదల చేస్తానని ప్రకటించిన రాజమహేంద్రవరంలోనే ఖైదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో బయటకు వచ్చి పూర్తిస్థాయి మ్యానిఫెస్టో విడుదల చేస్తానని చెప్పారు. ప్రజల కోసం, వారి పిల్లల భవిష్యత్తు కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఎప్పుడూ బయటకు రాని తన భార్య భువనేశ్వరిని ప్రజల తరపున పోరాడాలని కోరారని, అందుకు ఆమె ఒప్పుకున్నారనివివరించారు. తన అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతిచెందిన కుటుంబాలను పరామర్శించి, అరాచక పాలనను ఎండగట్టేందుకు 'నిజం గెలవాలి' అంటూ భువనేశ్వరి ప్రజల ముందుకు వస్తోందని తెలిపారు. జనమే తన బలం ధైర్యమని పేర్కొన్నారు. న్యాయం ఆలస్యం అవ్వొచ్చునేమో కానీ అంతిమంగా గెలిచేది మాత్రం న్యాయమేనని తెలిపారు. మీ అభిమానం ఆశీస్సులతో త్వరలోనే బయటకు వస్తానని పేర్కొన్నారు. అప్పటివరకు నియంత పాలనపై శాంతియుత పోరాటం కొనసాగించాలని కోరారు. చెడు గెలిచినా నిలవదని, మంచి తాత్కాలికంగా ఓడినట్లు కనిపించినా కాల పరీక్షలో గెలిచి తీరుతుందని తెలిపారు.

ఆర్ఎస్ఎస్ అంటే రాష్ట్రీయ సర్వనాశన సమితి

(మొదటిపేజి తరువాయి)

స్వేచ్ఛగా జీవించగలిగే, ఆచరించే ఒక సమాజాన్ని ఏర్పాటు చేశారని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నారు.'భారతదేశం యొక్క భారీ జనాభా విభిన్నమైనది, భక్తిపరులు. ఇండియా అంటే ప్రపంచంలోని ఎక్కువ మంది హిందువులు, జైనులు సిక్కులు నివసించేదే మాత్రమే కాదు.

ఇది ప్రపంచంలోని ఎక్కువ ముస్లిం జనాభా నివసించే దేశాలో ఒకటి. మిలియన్ల మంది క్రైస్తవులు, బౌద్ధులకు నిలయం' అని కూడా ఆర్ఎస్ఎస్ చీఫ్ చెప్పారు. 'ఒక్కసారి నీవు హిందువు అని చెప్పుకుంటే చాలు. ముస్లింలు కూడా రక్షించబడ్డారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హిందువులు మాత్రమే ఇలా చేస్తారు.. భారత్ మాత్రమే ఇలా చేస్తుంది. ఇతరులు ఎవ్వరూ కూడా ఇలా చేయలేరు' అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు.

కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు

(మొదటిపేజి తరువాయి)

ప్రాజెక్టులోని లక్ష్మిబ్యారేజీ రెండోసారి సమస్యలకు కేంద్రబిందువైంది. ఇంతకుముందు భారీ వర్షాల నేపథ్యంలోవచ్చిన వరదలకు రక్షణ గోడ కూలి మొత్తం 16 మోటార్లకుగాను ఏడు మోటార్లునీటమునిగిన విషయం విదితమే. దాదాపు రూ. 1849 కోట్లతో లార్సన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) కంపెనీకి పనులు కట్టబెట్టారు. నాసిరకం పనులే లక్ష్మి బ్యారేజీ కుంగుబాటుకు కారణమని సమాచారం. శనివారం రాత్రి చోటుచేసుకున్న భారీ శబ్దాలు ప్రాజెక్టు నాణ్యతను ప్రశ్నార్థకం చేశాయి. ప్రభుత్వం 2016, మే రెండో తేదీన లక్ష్మిబ్యారేజీకి శంకుస్థాపన చేసింది. 2019 జూన్ 21న ప్రారంభించింది. 85 గేట్లతో 1.632 కిలోమీటర్ల పొడవునా బ్యారేజీ నిర్మాణం చోటుచేసుకుంది. సుమారు 16.17 టీఎంసీల నిల్వసామర్థ్యంతో కూడుకున్నది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ గ్రామ పరిధిలో లక్ష్మిబ్యారేజీ నిర్మాణమైంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు స్టార్టింగ్ పాయింటు లక్ష్మీబ్యారేజీ కావడం గమనార్హం.

గోదావరి నీళ్లను సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకోవడమే ఈ బ్యారేజీ లక్ష్యం. ఈ ప్రాజెక్టు కోసం మహారాష్ట్రతో ఒప్పందం(ఎంవోయూ)సైతం చేసుకున్నారు. 18.50 లక్షల ఎకరాలను ఆయకట్టులోకి తీసుకురావడమే ప్రాజెక్టు ఉద్దేశం. కాగా బ్యారేజీలోని 18,19,20, 21 పిల్లర్ల మధ్య భారీ విస్ఫోటనం చోటుచేసుకోవడంతో దాదాపు అడుగున్నర మేర బ్యారేజీ వంతెన కుంగిపోయిందని స్థానిక అధికారులు చెబుతున్నారు. దీనిపై పనులు చేసిన వర్కింగ్ ఏజేన్సీ ఎల్అండ్‌టీ నామమాత్రంగానే స్పందించింది. ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ మేరకే నిర్మించామనీ, గత ఐదు వరద సీజన్లను బ్యారేజీ తట్టుకుందని గుర్తుచేసింది. ఈ ఏడాదిలో వరదలు వచ్చినా, ఎలాంటి సమస్యా రాలేదని ఎల్అండ్‌టీ జనరల్ మేనేజర్ ఎస్.సురేశ్‌కుమార్ చెప్పారు. సాంకేతిక బృందాన్ని ఇప్పటికే పంపామనీ, లోపాలను తొందరగా గుర్తించి పరిష్కారం కనుగొంటామని వివరణ ఇచ్చారు. అయితే కుంగుబాటుకు గల కారణాలను ఎల్అండ్‌టీ ఇచ్చిన ప్రకటనలో తెలియజేయలేదు. సాగునీటి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానీ, రాష్ట్ర సాగునీటి,ఆయకట్టుశాఖగానీ ఎలాంటి స్పందనా లేకపోవడం మరిన్నీ ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. లక్ష్మిబ్యారేజీ నిర్మాణం పటిష్టంగా జరగలేదని సాగునీటి రంగం నిపుణులు అంటున్నారు.

బేస్‌మెంట్ పక్కాలేదనీ చెబుతున్నారు. దాదాపు 200 అడుగుల వరకూ బేస్‌మెంట్ పటిష్టంగా ఉంటే సమస్య ఉత్పన్నమయ్యేది కాదనేది వారి వాదన. ప్రాజెక్టు మాన్యువల్ మార్గదర్శకాల ప్రకారం నిర్మాణం చేయాల్సి ఉంటుంది. అవేమీ ఇందులో పాటించలేదని సమాచారం. ప్రాజెక్టు బేస్‌మెంటును నిర్మించే సమయంలో సిమెంటుతోపాటు సీసం(లెడ్)'ను కూడా కలపాల్సి ఉంటుంది. ఇది లక్ష్మిబ్యారేజీ నిర్మాణంలో జరగలేదనే ఆరోపణలు వస్తున్నాయి.ఇకపోతే అక్కడున్న ఇసుకను పూర్తిస్థాయిలో తొలగించకపోవడం ఈ సమస్యకు మరో కారణమని తెలిసింది. అలాగే టెక్నాలజీ వాడకం సైతం సరిగ్గాలేదనేది సాగునీటి ప్రాజెక్టు నిపుణుల విమర్శ. ప్రస్తుత పరిస్థితి మూలంగా వచ్చే యాసంగికి సాగు, తాగునీటి సమస్యలు రావచ్చునే అభిప్రాయాలు ఉన్నాయి. ఈ బ్యారేజీ ద్వారా ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు నీళ్లు రాకపోవచ్చునే అనుమానాలున్నాయి. దీంతో మళ్లీ వర్షాలు, వరదలు వచ్చేవరకు ఇబ్బందులు తప్పవని అభిప్రాయపడుతున్నారు. బ్యారేజీ వంతెన కుంగుబాటుకు సంబంధించి విచారణ జరిపించాలని సాగునీటిరంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం జరిగిందా ? సాంకేతి పరమైన అంశాలనూ పరిశీలించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థిక నష్టాన్ని నిర్మాణ సంస్థపైనే వేయాలని సూచించారు.

లక్ష్మిబ్యారేజీ కుంగుబాటుకు అసాంఘిక శక్తుల ప్రమేయం ఉందనే నెపంతో పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. బ్యారేజీ పరిస్థితి నేపథ్యంలో ప్రస్తుతం మహారాష్ట్ర-తెలంగాణ మధ్య రాకపోకలు బంద్‌చేశారు. అయితే నాణ్యతా లోపాలపై అధ్యయనం చేయకుండా అసాంఘిక శక్తుల మీద తోసివేసే ప్రయత్నం జరుగుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వదిలేసి, ఇప్పుడు తప్పించుకునే వైఖరి తీసుకోవడం కూడా అనుమానాలు పెరగడానికి ఆస్కారమేర్పడుతున్నది.

ఇదిలావుండగా, కొత్త ప్రాజెకు ఏది కట్టినా నిల్వల విషయంలో కొన్ని ప్రమాణాలు పాటించాల్సి ఉంటుందని సమాచారం. ప్రాజెక్టు నిల్వలను తట్టుకునే సామర్థ్యమున్నా, ఒకేసారి భారీస్థాయిలో జలాలను నిల్వచేయరాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లక్ష్మిబ్యారేజీ నిల్వ సామర్థ్యం 16.17 టీఎంసీలు. అధికారిక సమాచారం ప్రకారం ఘటన జరిగే రోజుకు 10 టీఎంసీ నీళ్లే బ్యారేజీలో ఉన్నాయి. మరీ బ్యారేజీ ఎందుకు కుంగుబాటుకు గురైందనే విషయంలో ఇప్పటికీ ఇటు నిర్మాణ కంపెనీ గానీ, అటు సాగునీటి శాఖ నుంచి స్పష్టత రాలేదు. బేస్‌మెంటు నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలే పిల్లర్లు దెబ్బతిని బ్యారేజీ వంతెన కుంగుబాటుకు అవకాశమేర్పడిందని చెబుతున్న వారూ ఉన్నారు.

కల్వకుంట్ల ఫ్యామిలీకి కాళేశ్వరం ఏటీఎం

(మొదటిపేజి తరువాయి)

ప్రపంచంలోనే అద్భుతం అని గొప్పలు చెప్పారు. రైతులు, ప్రజల్ని బస్సుల్లో తీసుకెళ్లి మరీ ఆ ప్రాజెక్ట్ ను చూపించారు. మరి పంప్ హౌజ్ లు మునిగినప్పుడు, కుంగినప్పుడు ప్రతిపక్షాలను వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు వరుదలు లేకుండానే బ్యారేజ్ బ్రిడ్జి కుంగింది. ఈ ప్రాజెక్ట్ పేరిట లక్ష కోట్లను కేసీఆర్, కాంట్రాక్టర్లు దోచుకున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ ఎప్పుడో చెప్పారు. కేసీఆర్ ఫ్యామిలీకి ఈ ప్రాజెక్ట్ ఏటీఎం లా మారింది.' అని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం పై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ తో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి, గవర్నర్, ఎన్నికల కమిషన్ మెడిగడ్డ పై విచారణకి ఆదేశించాలన్నారు. అలాగే కాళేశ్వరం పనులపై సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపించాలన్నారు. బ్యారేజ్ కుంగడం వెనక సంఘ విద్రోహక శక్తులు ఉన్నాయా, లేక మానవ తప్పిదం వల్ల ప్రమాదం జరిగిందా అన్న దానిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలన్నారు. మెడిగడ్డకు వెళ్లేందుకు ఎన్నికల సంఘానికి లేఖ రాస్తామని చెప్పారు. కేటీఆర్, హరీష్ రావు తమతో కలిసి మేడిగడ్డకు రావాలని సవాల్ విసిరారు. అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మేడిగడ్డలో పర్యటించాలన్నారు. ఈ బ్యారేజ్ ను ప్రయివేట్ కంపెనీలు నిర్మించాయని తమకు సంబంధం లేదని ప్రభుత్వం అనడం సరికాదన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగింది అని ఆరోపిస్తోన్న కేంద్రంలోని బీజేపి సర్కార్ ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు.

తెలంగాణ లో ప్రభుత్వం మారుతుంది

త్వరలో తెలంగాణలో ప్రభుత్వం మారనుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తో కలిసి ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్ దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాకు చాదర్ సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఒక లౌకికవాదిగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మినవాడిగా దర్గాకు వచ్చానన్నారు. దేశంలోనే నిజాముద్దీన్ దర్గాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. హజ్రత్ నిజాముద్దీన్ దర్గాలో ఏది కోరుకుంటే అది జరుగుతుందని ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల్లో లౌకిక ప్రభుత్వాలు ఏర్పాటు కావాలని దర్గాలో ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అందాలని కోరుకున్నట్లు వెల్లడించారు. హిందువులు-ముస్లింలు కలిసి ఉంటూ మతసామరస్యాన్ని కాపాడే విధంగా పరిపాలన అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందన్నారు. దేశ గొప్పతనాన్ని కాపాడే ప్రయత్నం రాహుల్ గాంధీ చేశారని, ఈ దిశలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.

తెలంగాణ సొమ్మును గోదారిలో పోశారు: భట్టి

కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరిట కేసీఆర్ తెలంగాణ సొమ్మును గోదారిలో పోశారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ తెలంగాణ రాష్ట్రానికి పెద్ద గుదిబండగా మారబోతోందన్నారు. సాంకేతిక నిపుణులు, సలహాదారులు లేకుండా కేసీఆరే ప్లాన్ లు గీశారన్నారు. తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతం అని కేసీఆర్, కేటీఆర్ లు పదే పదే చెప్పుకున్నారని గుర్తు చేశారు. మరి ఇప్పుడు నాణ్యతాలోపంతో బ్యారేజ్ బ్రిడ్జ్ కుంగిపోతే, ఈ డిజైన్ తానే రూపొందించానని ఎందుకు చెప్పుకోవడం లేదని ప్రశ్నించారు.కేసీఆర్ గీసీన రీడిజైనింగ్ వల్లే కాళేశ్వరం నష్టదాయకంగా మారిందన్నారు. బ్యారేజ్ కుంగడంపై తక్షణమే ఒక విచారణ కమిటీ వేసి, వాస్తవాలు ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

జూరాల ఆగ్రో ఇథనాల్ కంపెనీపై ప్రజాగ్రహం

- వ్యర్థాలను తరలిస్తున్న ట్యాంకర్స్‌ను అడ్డుకున్న గ్రామస్తులు
- వ్యర్థాలతో పంటలు, చెరువుల్లోని నీరు కలుషితం
- ఆందోళనకారులపై లాఠీచార్జి
- ఆగ్రహంతో పోలీసుల వాహనాలు ధ్వంసం



నవతెలంగాణ- మరికల్

నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ వద్దనున్న జూరాల ఆగ్రో ఇథనాల్ కంపెనీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కంపెనీ కెమికల్ వ్యర్థాలను చిత్తనూర్ గ్రామ సమీపంలోని వాగులో పారబోసేందుకు ట్యాంకర్ ద్వారా తరలిస్తుండగా.. ఆ వాహనాలను ఏక్లాస్‌పూర్, చిత్తనూరు, జిన్నారం, కనుమనూరు గ్రామస్తులు అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వారిపై లాఠీచార్జికి దిగారు. దాంతో గ్రామస్తులు కట్టెలు, రాళ్లతో పోలీసుల పైకి తిరగబడ్డారు. వారి వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ దాడుల్లో మక్తల్ సీఐ రామ్‌లాల్‌తో పాటు గ్రామస్తులకు గాయలయ్యాయి. ఆందోళనకారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

చిత్తనూర్ గ్రామానికి సమీపంలోని జూరాల ఆగ్రో ఇథనాల్ ఫ్యాక్టరీలోని వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటుచేయకుండా తమ గ్రామాల సమీపంలోని వాగులు, ఖాళీ స్థలాల్లో వేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో తమ పంటలు, చెరువుల్లోని నీరు కలుషితం అవుతుందన్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటును కూడా తాము వ్యతిరేకించామని తెలిపారు. కాగా, చిత్తనూరు సమీపంలో ఫ్యాక్టరీ వ్యర్థాలను డంప్ చేసేందుకు వచ్చిన ట్యాంకర్‌ను గ్రామస్తులు అడ్డుకొని పరిశ్రమ వ్యర్థాలను గ్రామ సమీపంలోని వాగులో వేయొద్దని కోరారు. అడ్డుకున్న విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్ సునీత ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులు, తహసీల్దార్, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో ఆందోళన చేస్తున్న గ్రామస్థులను చెదరగొట్టేందుకు నారాయణపేట డీఎస్పీ లాఠీచార్జికి అనుమతించారు. ఆగ్రహించిన గ్రామస్తులు.. పోలీసులపై రాళ్ల, కర్రలతో దాడిచేశారు. పోలీస్ వెహికల్‌కు గ్రామస్థులు నిప్పు పెట్టారు. ఈ దాడిలో గాయలపాలయిన మక్తల్ సీఐ రాంలాల్‌తో పాటు గ్రామస్తులు, పోలీసులను నారాయణపేట, మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. కాగా, ఫ్యాక్టరీ యాజమాన్యానికి పోలీసులు, అధికారులు వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలు డంప్ చేస్తున్నారని చెబితే తమపై పోలీసులు అన్యాయంగా లాఠీచార్జి చేశారని, మహిళలపై కూడా దాడి చేశారని గ్రామస్తులు తెలిపారు. చిత్తనూరులో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించి బందోబస్తు నిర్వహిస్తున్నారు.



ఈ సక్సెస్.. ఆరంభం మాత్రమే

రవితేజ, దర్శకుడు వంశీ కృష్ణ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ కాంబినేషన్‌లో ప్రేక్షకులు ముందుకు వచ్చిన పాన్ ఇండియా ఎంటర్ టైనర్ 'టైగర్ నాగేశ్వరరావు'. అన్ని వర్గాల ప్రేక్షకులు, అభిమానులు, విమర్శకుల నుంచి అద్భుతమైన ప్రసంశలు అందుకుంటూ దసరా విన్నర్‌గా అలరిస్తోంది.

రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో వరల్డ్ వైడ్‌గా సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ సక్సెస్ మీట్ నిర్వహించింది. రవితేజ మాట్లాడుతూ, 'టైగర్ నాగేశ్వరరావును అద్భుతంగా రిసీవ్ చేసుకుంటున్నారు. ప్రేక్షకులు, శ్రేయోభిలాషులు, నా తమ్ముళ్ళయిన అభిమానులు అందరూ గొప్పగా ప్రశంసిస్తున్నారు. వాళ్ళే సినిమాని బ్రహ్మాండంగా ప్రమోట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో మరో హైలెట్ యాక్షన్. పీటర్ హెయిన్ ట్రైన్ ఎపిసోడ్, మిగతా యాక్షన్ సీక్వెన్స్‌ని రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ చాలా చక్కగా చేశారు. ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ వారికి కూడా దక్కుతుంది. దర్శకుడు వంశీ కొత్తవాళ్ళతో కూడా అద్భుతంగా చేయించారు. 'విక్రమార్కుడు'లోని విక్రమ్ రాథోడ్ తర్వాత నాకు మళ్ళీ అంతటి సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'టైగర్ నాగేశ్వరరావు. దర్శకుడు వంశీకృష్ణకి మంచి సామర్థ్యం ఉంది. తను నెక్స్ట్ లెవెల్‌కి వెళ్తాడు. అతనితో మరో సినిమా చేస్తా. అలాగే రైటర్ శ్రీకాంత్ విస్సా చాలా ప్రతిభావంతుడు. తనలోనూ అపారమైన ప్రతిభ ఉంది. తనతోనూ ఇకపై ట్రావెల్ చేస్తా' అని తెలిపారు.

'ఇందులోని ప్రతి సన్నివేశాన్ని, డైలాగ్‌ని ప్రేక్షకులు గొప్పగా ఎంజాయ్ చేస్తున్నారు. గూస్ బంప్స్ వస్తున్నాయని చెబుతున్నారు. రవితేజ నటన, ఎమోషన్స్, యాక్షన్ ఇలా ప్రతీదీ ప్రేక్షకులని అలరిస్తోంది. నాకు ఇది పెద్ద సినిమా. సినిమాకి మేము ఊహించని స్పందన రావడం దర్శకుడిగా ఆనందాన్ని ఇచ్చింది' అని దర్శకుడు వంశీ కృష్ణ చెప్పారు. నిర్మాత అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ,'ప్రేక్షకుల నుంచి స్పందన, కలెక్షన్స్, షోస్, రోజురోజుకి పెరుగుతున్నాయి. ఇది ఆరంభం మాత్రమే. ఇప్పుడే సెలబ్రేషన్స్ మొదలయ్యాయి. మరిన్ని వేడుకలు ఉంటాయి' అని తెలిపారు.

నవచిత్రం

అన్ని తరాలను అలరించే సినిమా



రాజ్ మదిరాజు

రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రల్లో దర్శకుడు రాజ్ మదిరాజు రూపొందించిన చిత్రం 'కృష్ణారామా'. అద్వితీయ మూవీస్ బ్యానర్ పై వెంకట కిరణ్, కుమార్ కళ్లకూరి, హేమ మాధురి నిర్మించారు. ఈ సినిమా ఓటీటీ 'ఈటీవీ విన్'లో ఆదివారం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు రాజ్ మదిరాజు మీడియాతో మాట్లాడుతూ, 'ఈ కథ మొదలైంది మా అమ్మానాన్నల దగ్గర. ఐదేళ్ళ క్రితం మా అమ్మ ఫేస్ బుక్‌లోకి వచ్చారు. దీనికి కారణం ఒంటరిగా ఫీలవ్వడం. ఆ ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఫేస్ బుక్‌లోకి వచ్చారు. నాన్న ఆలోచనలని అమ్మ టైప్ చేసి పెడుతుంది. ఒక విధంగా ఇది మా ఇంట్లో పుట్టిన కథే. కృష్ణారామా అనుకునే వయసులో వాళ్ళ నేపథ్యం జరిగే కథకు తగిన టైటిల్‌గా 'కృష్ణారామా' అని పెట్టాం. 65 ఏళ్ళు తర్వాత ఐసోలేషన్ జనరేషన్‌గా చూస్తున్న పరిస్థితి. రిటైర్ అయిపోతే వాళ్ళ జీవితమే అయిపోయిందనే భావనలోకి వెళ్ళిపోతాం. నిజానికి పెద్ద కార్పోరేట్ వ్యవస్థల్లో రిటైర్మెంట్ అయిన వాళ్ళని సలహాదారులుగా పెట్టుకుంటారు. వాళ్ళ అనుభవాన్ని వాడుకోవాలనేది దీని ఉద్దేశం. అయితే ఇంత అనుభవాన్ని ఒక్క రోజుతో ఈ సొసైటీకి పనికి రాదని తెల్చేస్తున్నాం. అలా కాదు.. ఆ అనుభవం సమాజానికి అవసరం అని చెప్పడం ఇందులో ముఖ్య ఉద్దేశం. రాజేంద్రప్రసాద్, గౌతమి అద్భుతంగా నటించారు. ఇది అన్ని తరాలను అలరించే సినిమా. ప్రస్తుతం రెండు మూడు కథలు ఉన్నాయి. వీటిల్లో ఒక లేడీ ఓరియంటెడ్ ప్రాజెక్ట్ ఉంది. త్వరలోనే వివరాలు చెప్తాను. నటుడిగా గౌతమ్ తిన్ననూరు సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను' అని అన్నారు.

ఇక.. పాన్ వరల్డ్ రేంజ్



ప్రభాస్

వందేళ్ల తెలుగు సినిమా చరిత్రలో ఒక్కో హీరోది ఒక్కో ప్రత్యేకత ఉంది. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు, చిరంజీవి ఇలా..తెలుగు తెర దిగ్గజాల స్ఫూర్తిని, లెగసీని కొనసాగిస్తూ మన సినిమాను పాన్ ఇండియా స్థాయికి చేర్చిన హీరో ప్రభాస్ బర్త్‌డే నేడు (సోమవారం). రెబల్ స్టార్ కృష్ణంరాజు వారసుడిగా 'ఈశ్వర్' సినిమాతో అడుగు పెట్టారు ప్రభాస్. మొదటి సినిమాతోనే ప్రభాస్ హీరోయిజానికి అన్ని వర్గాల ప్రేక్షకుల అభిమానం లభించింది. 'వర్షం' తొలిసారి బిగ్ కమర్షియల్ సూపర్ హిట్ ఇవ్వగా, రాజమౌళి కాంబినేషన్‌లో చేసిన 'ఛత్రపతి' మాస్ హీరోగా తిరుగులేని స్టార్ డమ్ అందించింది. 'డార్లింగ్, మిస్టర్ పర్‌ఫెక్ట్ మూవీస్'తో ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా దగ్గరయ్యారు. 'రాఘవేంద్ర' 'అడవిరాముడు', 'చక్రం', 'పౌర్ణమి', 'యోగి', 'మున్నా', 'బుజ్జిగాడు' 'బిల్లా', 'ఏక్‌నిరంజన్' 'రెబల్'...వంటి సినిమాలన్నీ నటుడిగా ప్రభాస్ వెర్సటాలిటీ చూపిస్తాయి. 'మిర్చి' ఆయన కెరీర్‌లో ఓ స్పెషల్ సూపర్ హిట్. 'బాహుబలి' రెండు సినిమాల రికార్డ్ స్థాయి విజయాలతో పాన్ ఇండియా స్టార్ అయ్యారు. తెలుగు సినిమా బాక్సాఫీస్ మార్కెట్‌ను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ప్రభాస్‌కే దక్కుతుంది. ఏ తెలుగు హీరోకు సాధ్యం కాని రికార్డులెన్నో ప్రభాస్ తిరగరాశారు. ప్రభాస్‌కు దేశవ్యాప్తంగానే కాకుండా జపాన్, చైనా, మలేషియా, సింగపూర్, అమెరికా వంటి తదితర విదేశాల్లో కూడా భారీ సంఖ్యలో అభిమానులు ఉన్నారు. ప్రభాస్ మైనపు ప్రతిమను 2017లో బ్యాంకాక్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ప్రతిష్టించారు. సమాజానికి తన అవసరం కలిగిన ప్రతిసారీ మనసున్న మనిషిగా ప్రూవ్ చేసుకున్నారు. తన 1650 ఎకరాల ఖాజిపల్లి రిజర్వ్ ఫారెస్ట్ భూమిని దత్తత తీసుకొని తన తండ్రి పేరు మీద ఎకో పార్క్‌కు కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

- ప్రభాస్ ప్రస్తుతం హోంబలే ఫిలింస్ నిర్మాణంలో దర్శకుడు ప్రశాంత్ నీల్ రూపొందిస్తున్న 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్' డిసెంబర్ 22న రిలీజ్ కాబోతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898ఏడీ' పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌గా రాబోతోంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న సినిమా ఒక స్పెషల్ మూవీ కానుంది. ప్రభాస్‌ను కొత్త జానర్‌లో, సరికొత్తగా ప్రెజెంట్ చేయబోతున్నారు దర్శకుడు మారుతి. టీ సిరీస్ నిర్మాణంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రూపొందించే 'స్పిరిట్ 'సినిమా ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తుందనే ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఈ సినిమాలన్నీ ఒక్కోటి ఒక్కో డిఫరెంట్ జోనర్‌లో తెరకెక్కుతున్నాయి. తన రాబోయో సినిమాలతో తెలుగు సినిమా గర్వించే విజయాలు సాధించాలని ప్రభాస్ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

గర్ల్‌ఫ్రెండ్ ఉంటే ఆ కిక్కే వేరు..



రష్మిక మందన్నా

రష్మిక మందన్న లీడ్ రోల్‌లో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ నిర్మాణంలో రాహుల్ రవీంద్రన్ డైరెక్ట్ చేస్తున్న చిత్రం 'దిగర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'చి.ల.సౌ, మన్మథుడు 2' చిత్రాల దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మాతలు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్ ఆసక్తికరంగా ఉన్నాయి.

'నాదీ అని చెప్పుకోవడానికి ఒక గర్ల్ ఫ్రెండ్ ఉంటే ఆ కిక్కే వేరురా...' అంటూ మోషన్ పోస్టర్ వాయిస్ ఓవర్‌లో వచ్చిన డైలాగ్స్, రష్మిక శ్వాసను ఆపి నీటిలో కూర్చుని ఉండటం మూవీ మీద ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక కొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని మూవీ టీమ్ చెబుతోంది.

త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ – కృష్ణన్ వసంత్, సంగీతం – హేషమ్ అబ్దుల్ వాహబ్.

సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్



రుక్సార్ ధిల్లాన్, విక్రాంత్

అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న 'స్పార్క్ లైఫ్' సినిమాతో విక్రాంత్ హీరోగా తెలుగు తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాతో హీరోగా మాత్రమే కాకుండా.. కథా రచన, స్క్రీన్ ప్లేని కూడా అందిస్తున్నారు. ఈ మూవీలో మెహరీన్, రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్ మీద ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయిన ఈ సినిమా మొత్తం ఐదు భాషల్లో నవంబర్ 17న రిలీజ్ కానుంది. 'తాజాగా థర్డ్ సింగిల్ 'జ్ఞాపకాలు' అనే పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ బాణీ, అనంత శ్రీరామ్ సాహిత్యం, హేషమ్ కృష్ణ లాస్య ముత్యాల గాత్రం ఈ పాటను ఎంతో వినసొంపుగా మలిచాయి. హీరో హీరోయిన్ల మధ్య ప్రేమని చాటి చెప్పేలా ఈ పాట లీడ్ పెయిర్ కెమిస్ట్రీని, విజువల్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది' అని చిత్రయూనిట్ తెలిపింది.

అదే.. నా లక్ష్యం



సెవెల్ హిల్స్ సతీష్‌కుమార్

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై బిగ్‌బాస్ సీజన్ 7 తెలుగు ఫేమ్ గౌతమ్ కృష్ణ హీరోగా ఓ చిత్రం రూపొందుతోంది. శ్వేతా అవాస్తి, రమ్య పసుపులేటి నాయికలు. పి.నవీన్ కుమార్ దర్శకుడు. సతీష్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈయన గతంలో 'బట్టల రామస్వామి బయో పిక్కు' చిత్రాన్ని నిర్మించి, విమర్శకుల ప్రశంసలతో పాటు చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. తదుపరి ఆర్.పి. పట్నాయక్‌తో 'కాఫీ విత్ ఏ కిల్లర్' చిత్రాన్ని తెరకెక్కించారు. తాజాగా ఆయన నిర్మిస్తున్న మూడో చిత్రమిది. చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే మూడు షెడ్యూళ్ళు పూర్తయ్యాయి. నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'గతంలో నేను నిర్మించిన రెండు చిత్రాలు ప్రేక్షకాదరణ పొందాయి. 'ఆకాశ వీధుల్లో' చిత్రంతో గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు బిగ్‌బాస్ సీజన్ 7 షోతో మరింత పాపులర్ అయిన గౌతమ్ కృష్ణతో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. అతనికి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ మంచి క్రేజ్ ఉంది. ఈ కథకు పర్ఫెక్ట్‌గా యాప్ట్ అయ్యాడు. ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి స్టూడెంట్ నుంచి కార్పోరేట్ స్థాయికి ఎలా ఎదిగాడు అనే ఇతివృత్తంతో రూపొందుతున్న చిత్రమిది. ఫ్యామిలీ, యూత్‌కి బాగా కనెక్ట్ అవుతుంది. త్వరలో ఫస్ట్‌లుక్, టీజర్‌ను విడుదల చేస్తాం. నిర్మాణా నంతర కార్యక్రమాలు పూర్తి చేసి విడుదల తేదీని ప్రకటిస్తాం. యువత, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలతో చిత్రాలు తీయాలన్నదే నా లక్ష్యం' అని చెప్పారు.

బిగిస్తున్న పిడికిళ్లు

గాజాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా..

- అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ యూనివర్సిటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు
- లండన్‌లో 3 లక్షల మందితో ప్రదర్శన



పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతున్న హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థులు

లండన్/వాషింగ్టన్: దాదాపు రెండు వారాలుగా నాన్‌స్టాప్‌గా గాజాపై వైమానిక దాడులను కొనసాగిస్తూ, ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, మసీదులు, చర్చిలను నేలమట్టం చేస్తూ, చిన్నారులు, మహిళలతో సహా వేలాది మంది అమాయకులను పొట్టనపెట్టుకుంటున్న ఇజ్రాయిల్ దాష్టీకానికి వ్యతిరేకంగా దేశ దేశాల్లో నిరసనలు హోరెత్తుతున్నాయి. విద్యార్థులు వివిధ యూనివర్సిటీ కేంపస్‌లలో భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అమెరికాలోని పోర్టులాండ, టొరంటో, లాస్ ఏంజెల్స్, బ్రూక్లిన్, చికాగోల్లో వేలాది మంది పాలస్తీనాకు సంఘీభావంగా వీధుల్లోకి వచ్చారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఇది ఇరవై ఒకటో శతాబ్దం, వలసవాదానికి ఇంకెంతమాత్రమూ స్థానం లేదు అని ప్రదర్శకులు నినదించారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌తో సహా పలు దేశాల్లో ప్రభుత్వాలు, యూనివర్సిటీ పాలకవర్గాల ఆంక్షలను, నిషేధాలు,నిర్బంధాలను లెక్కచేయకుండా విద్యార్థులు పెద్ద సంఖ్యలో బయటకు వచ్చి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియజేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యూనివర్సిటీల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ (యుకె)లో వేలాది మంది పాలస్తీనా సాలిడారిటీ పేరుతో మార్చ్ నిర్వహించారు. అలాగే ఎడిన్‌బరో , గ్లాస్గో, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ, శాన్‌ఫ్రాన్సిస్కో,కొలంబియా యూనివర్సిటీలు, మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ,ఫ్రాన్స్‌లోని టౌలోజ్ యూనివర్సిటీ వంటి విశ్వవిద్యాలయాలు విద్యార్థుల ప్రదర్శనలతో హోరెత్తాయి. లండన్‌లో గత శనివారం లక్షన్నర మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. తాజాగా ఈ నెల21న జరిగిన మార్చ్‌లో మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు, విద్యావేత్తలు, హక్కుల కార్యకర్తలు, బ్రిటిష్ సాధారణ పౌరులు పాల్గొన్నారు. హార్వర్డు యూనివర్సిటీలో డజనుకుపైగా విద్యార్థి సంఘాలు సంతకాల సేకరణకు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదలజేశాయి.ఆ ప్రకటన మొదటి వాక్యంలో హార్వర్డ్ పాలస్తీనా సాలిడారిటీ కమిటీ సారథ్యంలో దిగువ సంతకాలు చేసిన మేము' ఈ ప్రాంతం (పశ్చిమాసియాలో) అన్ని రకాల హింసకు ఇజ్రాయిల్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని నిందించాల్సి ఉంది' అని పేర్కొన్నారు. ఒక పథకం ప్రకారం పాలస్తీనా భూములను ఆక్రమించడం, నిర్బంధాన్ని ప్రయోగించడం, సైనిక తనిఖీలు, బలవంతంగా కుటుంబాలను వేరుపరచడం, టార్గెట్‌గా హత్యలు చేయడం వంటి వాటికి ఇజ్రాయిల్‌లోని యూదు దురహంకార ప్రభుత్వాలే కారణమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిరసనలపై బ్రిటన్‌లో శక్తివంతమైన అపర కుబేరుడు, హెడ్జ్ ఫండ్ సంస్థ సిఇవో జర్రున ఇంత ఎత్తున లేచాడు. హార్వర్డ్ వర్సిటీ పాలకమండలిలో సభ్యుడైన ఈ సిఇవో పాలస్తీనాకు సాలిడారిటీ తెలిపిన విద్యార్థుల పేర్లను బయటకు విడుదల జేయాలని, ఉద్యోగాలు రాకుండా వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని ట్వీట్ చేశారు. ఫ్రాన్స్‌లో అసలు పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలే చేయరాదంటూ అక్కడి మాక్రాన్ ప్రభుత్వం నిషేధాజ్ఞలు జారీ చేశారు. అయినా, వాటిని ధిక్కరించి టౌలోజ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో భారీ మార్చ్ నిర్వహించారు. విద్యార్థులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్, వాటర్ కెనాన్‌లను ప్రయోగించింది. నిరసనలపై ఉక్కు పాదం మోపుతోంది.

గద్దర్ స్మారక స్ఫూర్తి సంచిక ఆవిష్కరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా కవి గద్దర్ స్మారక స్ఫూర్తి సంచికను ఆవిష్కరించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని గురుజాడ సమావేశ మందిరంలో ఆవిష్కరణ సభ జరిగింది. 'మెలకువ' దళిత బహుజన సాహిత్య సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఢిల్లీ విశ్వవిద్యాలయం ఫిలాసఫీ ప్రొఫెసర్ పి. కేశవకుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీపీఐ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎం.పి డి.రాజా, పాత్రికేయులు ఎ.కృష్ణారావు పాల్గొని 'బహుజన కెరటాలు' తరపున గద్దర్ స్మారక స్ఫూర్తి సంచికను ఆవిష్కరించారు. డి.రాజా మాట్లాడుతూ దేశంలోని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో గద్దర్ అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశంలో మనువాద ప్రభుత్వం దళిత, మైనార్టీలపై దాడులకు పూనుకుంటుందని విమర్శించారు. ఎ.కృష్ణారావు మాట్లాడుతూ గద్దర్‌పై జరిగిన దాడుల తర్వాతే రాజ్యం ఎంత క్రూరంగా వ్యవహరిస్తుందో తనకు మొదటిసారి తెలిసిందని పేర్కొన్నారు. గద్దర్ సాహిత్యంలోని స్త్రీ దృక్పథాన్ని ఎ.సునీత ప్రస్తావించారు. ప్రొఫెసర్ చిట్టిబాబు తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్ పోషించిన పాత్రను ప్రముఖంగా పేర్కొన్నారు.రాజ్యానికి ఎదురొడ్డి నిలిచి పోరాడినతరానికి చెందిన ఉద్యమకారుడు గద్దర్, అక్షరానికి వెన్నెముకనిచ్చి, ఉద్యమం ఊపిరిగా బతికినవాడు గద్దర్ అని కొనియాడారు. గద్దర్ వల్ల ఉద్యమంలోకి వెళ్ళినంతమంది మరెవరివల్లా వెళ్ళలేదని, గద్దర్ తర్వాత ఆ పాత్ర పోషించగలవాళ్ళు సంఖ్య ప్రశ్నార్థకం అని బీబీసీ తెలుగు ఎడిటర్ జి.ఎస్. రామ్మోహన్ తన ప్రసంగంలో వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రొఫెసర్ బి. తిరుపతి రావు, పి.వెంకటేశ్వరరావు, వై.చిన్నారావు, టి. సతీష్, సరోజ్ గిరి, డా. బ్రజేష్ యాదవ్, ప్రొఫెసర్ బ్రహ్మ ప్రకాష్, ప్రొఫెసర్ రాజ్ కుమార్, ప్రొ. సచిన్ వక్తలుగా పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

సాహిత్య ప్రక్రియల వినూత్న కృషీవలుడు... శేషేంద్రశర్మ

గుంటూరు శేషేంద్రశర్మ సుప్రసిద్ధ కవి, పేరెన్నికగన్న సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు. బాల్యంలో తన ఇంట్లోనే పెద్ద లైబ్రరీ ఉండటం ఆయనకు బాగా కలిసొచ్చింది. అందువల్ల పుస్తక పఠనం ఆయనకు చిన్నతనం నుండి అలవడింది. దానినే ఆయన తన 'ఊహలో...' అనే పుస్తకంలో "ప్రజానీకం, ఆధి వ్యాధులకు పరమౌషధం పుస్తక పఠనం" అనే వ్యాసంలో వ్యక్తం చేసారు. అనేక పుస్తకాలు చదవడం వల్ల ఆయనకు చదవడమే కాకుండా, ఆలోచించడం, వితర్కించడం, రాయడం కూడా తన జీవితంలో అనివార్యం అయిపోయాయి. ప్రాచీన వాల్మీకి 'రామాయణం' మొదలుకొని, ఆధునిక వచన కవిత్వం వరకూ ఆయన రచనాంశాలు విస్తరించాయి. తానే స్వయంగా చెప్పుకున్నట్లు ఆయనకు "కవిత్వమంటే స్వప్న విద్య". సుమారు యాభైఏళ్ల ఆయన సాహిత్య కృషి కొనసాగింది. తన కాలంనాటి కవులకన్నా ఆయన సాహిత్యం విలక్షణమైనది.

ఆయన కాలానికి సంప్రదాయ కవులూ, అభ్యుదయ కవులూ, కాల్పనిక కవులూ, ఇంకా తిరుగుబాటు, విప్లవ కవులూ అంటూ ఒక్కొక్క కవితా రీతికి ప్రతీకలుగా ఉన్న రోజుల్లో ఈ కవి ఒక్కడూ విలక్షణంగా పైలక్షణాలన్నీ 'కొత్త పాతల మేలు కలయికగా క్రొమ్మెరుంగులు చిమ్ముతూ' తెలుగు సాహిత్య లోకంలోకి ప్రవేశించాడు, ప్రకాశించాడు.

శేషేంద్ర ఊహలో అనే పుస్తకంలో చెప్పుకున్నట్లు తన ఏడెనిమిది ఏళ్ల వయసు నుండే బయట స్కూలు చదువుతో బాటూ ఇంట్లో ఉన్న పుస్తకాలు - సంస్కృత తెలుగు కావ్యాలు, పురాణాలు, నిఘంటువులు, తెలుగుప్రబంధాలు చదువుతూ "విజ్ఞాన సేకరణ" చేస్తుండేవాడు. 'చదవని వాడజ్ఞుండగు' అన్న పోతన మాట శేషేంద్ర నిజమని నిరూపించాడు.. ఇట్లా ఇంట్లోని గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదవడం వల్లనే శేషేంద్ర అతి చిన్న వయసులోనే అంటే 1947లోనే సోరాబు వంటి పద్యకావ్యంతో తన సాహిత్య రచనా ప్రయాణం ప్రారంభించాడు.

అంత భాషాసాహిత్య పరిజ్ఞానమే ఆయనకు రామాయణం మొదలుకొని పురాణేతిహాసాలలో తులనుమంత్ర, యోగ, కుండలినీ వంటి ఆధునికులకు అంతుపట్టని విషయాలతో బాటువ్యక్తి, కుటుంబం సమాజం, దేశం, ప్రపంచందాటి అంతరిక్ష, దిగంతాల వరకు, అలాగే వ్యక్తి ప్రేమ, వైయక్తిక స్వేచ్ఛ మొదలుకొని, సామాన్య మానవుల ఆకలి, పేదరికం, అగచాట్లు, బాధలు, కష్టాలు, కన్నీళ్ల వరకూ విస్తరించి అన్నీ ఆయనకు కవితా/సాహిత్య రచనా వస్తువులే అయ్యేలా చేశాయి.

మానవుడి బాధలను కవిత్వీకరించడమేకాదు, వాటి నుండి విముక్తి కావటం కోసం దిశానిర్దేశాలూ, సామాజిక న్యాయాల సూచనలూ కూడా ఆయన సాహిత్యంలో కనిపిస్తాయి. ఒకవైపు మనిషి ఉన్నత మానవుడుగా పరిణామం చెందటానికి పుస్తక పఠనం ఎంత ముఖ్యమో చెప్తూనే, మరోవైపు చదువుల కన్నా వ్యవసాయమే (నాగలి) మిన్న అనీ అంటాడు. అయితే మనం దీనిలో వైరుధ్యం చూడకూడదు. మనిషి రాజకీయాల కంపును వదులుకొని, ప్రకృతి పారవశ్యాలను ఆస్వాదిస్తూనే, దానినీ అధిగమించి వైజ్ఞానిక అంశాల వైపు ఎందుకు దృష్టి సారించాలో, ఆ జ్ఞానం మనిషికి ఏ విధమైన అవగాహనను పెంచి, సృష్టితత్వాన్ని అర్థం చేసుకోగల తాత్త్వికచింతనను అలవర్చుతుందో తన కవిత్వం, సాహిత్యం నిండా వివరిస్తాడు. అంటే ఈనాటి చదువుల విధానం పట్ల వ్యంగ్య విమర్శలో భాగంగా ఈనాటి విద్యార్థి చదువుల చట్రంలో ఇరుక్కొని జీవితాన్ని కోల్పోతున్నాడన్న బాధ అందులో మనం గమనిస్తాం. ఇలాంటి చదువుల కన్నా నాగలి పట్టి దున్నుకోవడం మేలని ఆయన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. అంతేకాదు. తనమట్టి మూలాలను ఎవ్వరూ మరవకూడదనీ, నేల విడిచినసాము చేయకుండా ప్రజల జీవన సుఖసంతోషాల కోసం కవి కలం నిలవాలనే ఆకాంక్ష ఆయన రచనల్లో కనిపిస్తుంది. ఇట్లా ఆయన సాహిత్య వస్తువు కానిదేదీ లేదని తెలిసి మనం ఆ కవన వేగానికి, ఆవేశంలోని ఉధృతానికి వ్యక్తీకరణకూ ఉక్కిరిబిక్కిరి అయిపోతాం.

> సంప్రదాయ వ్యాకరణ అలంకార శాస్త్రాలనూ, పాశ్చాత్య సాహిత్య విమర్శనూ, మార్క్సిస్టు సిద్ధాంతాలను అధ్యయనం చేసి, తన సాహిత్య ఆలోచనలను మేళవించి తెలుగు సాహితీ విమర్శ లోకానికి అందించిన కొత్త టానిక్ వంటి సైద్ధాంతిక సాహితీ విమర్శ పరికల్పనే 'కవిసేన మానిఫెస్టో'.

స్థూలంగా జీవితాన్ని అన్ని కోణాల నుండి దర్శించి, దానితో ముడిపడ్డ ఆధ్యాత్మికత, ప్రేమ, సమానత్వం కోసం విప్లవం, ప్రకృతి ఆస్వాదన ఇలాంటివన్నీ కలగలిపిన ప్రాచీన, ఆధునిక సమ్మేళనం ఈయన కవితా వరణంగా గుర్తించవచ్చు. ఇంత వైవిధ్యభరితమైన సాహిత్యాన్ని సృష్టించటం ఒక సాహితీవేత్తకు ఎంత కష్టమో అంత సాహిత్యాన్ని అంచనా వెయ్యటమూ, అధ్యయనం చేసి విశ్లేషించటమూ ఏఒక్కరికీ ఏ ఒక్క సందర్భంలోనూ పూర్తిగా సాధ్యమయ్యే పని కాదు. మొత్తం మీద సాహితీ ప్రియులను ఆకట్టుకునే కవిత్వీకరణతోనూ, ఆలోచింపజేసే భావావేశంతోనూ ఆయన పుస్తకాలు మనల్ని చదివింపచేస్తాయి.



శేషేంద్ర తాను 1970-1986ల మధ్య రాసిన వివిధ రచనలు నిజానికి వేర్వేరు అంశాలు కావని తనేగుర్తించి వాటన్నిం టినీ కదంబమాలగా కూర్చి ఆధునిక మహాభారతంగా ఏక కావ్యంగా రూపొందించారు. ఈ గ్రంథం 1970-1986 మధ్యకాలంలోని వచన కవితా సమాహారమే అయినా దీనిని సంకలన కావ్యం అని చెప్పటం శేషేంద్రకు సమ్మతం కాదు. ఆయన స్వయంగా "ఇది నా సంకలన కావ్యం కాదు, ఇది నా సంపూర్ణ కావ్యం" అని చెప్పుకున్నారు. స్థూలంగా 'నాదేశం, నా ప్రజలు' అనే తాత్త్విక చింతన చుట్టూ నిర్మితమైన ఈ సాహిత్యంలో అంతర్లీనంగానూ, ప్రత్యక్షంగానూ కూడా కవి 'నేను' అనే రూపం లో కూడా మనకు దర్శనమిస్తాడు.

ఈ ఆధునిక మహాభారతంలోని కావ్యాలను వేరువేరుగా, వేర్వేరు కాలాల్లో రాసినప్పటికీ, అవన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమైనవే. ఈ ఆధునిక మహా భారతాన్ని కవి 'భారతీయ కర్షకేతిహాస' మని చెప్పుకున్నారు. దీర్ఘకాలాల తర్వాత ఒక్కొక్కయుగంలో ఒక్కొక్క ఐతిహాసిక కావ్యం, దాని అనుబంధం వచ్చాయని చెప్తూ, శేషేంద్ర ఆధునిక మహా భారతానికి అనుబంధ కావ్యంగా 'జనవంశం' రాశానని స్వయంగా పేర్కొన్నారు. నిత్యజీవితంలోనైనా, కవిత్వ జీవితం లోనైనా, మనిషి భావవ్యక్తీకరణకు అవసరమైంది భాష. ప్రతి వ్యక్తీ భాషను తనదైన పద్ధతిలో ఉపయోగించుకొని మాట్లాడినట్లే, కవి, రచయిత (సాహిత్యవేత్త) కూడా భాషను తనదైన పద్ధతిలో వినియోగించి, వ్యక్తీకరిస్తారు. ఆయా వ్యక్తుల రచనా శైలిని, కవితాత్మలను వారి వారి 'భావవ్యక్తీకరణ' విధానమే పట్టి ఇస్తుంది.

నిత్యజీవితంలో మనిషి మాట్లాడే భాష సాధారణంగా 'విషయ' సంబంధంగా, సూటిగా ఉంటుంది. అయినా, సంభాషణల్లో మనుషులు వారివారి తత్వాన్ని బట్టి "ఆకట్టుకొనే విధంగా", 'వినాలనిపించే విధంగా' 'ఆకర్షణీయంగా' మాట్లాడుతుంటారు. కానీ సాహిత్యంలో ఈ 'ఆకట్టుకునే', 'ఆకర్షించే', 'చదవాలనిపించే' లక్షణాలు ఆయా కవులకూ, రచయితలకూ భిన్న భిన్నంగా ఉంటాయి. అవి వారివారి శైలి'గా మన గుర్తిస్తాం.

శేషేంద్రకు ఉన్న ప్రాచీన అలంకార శాస్త్రాల, ఆధునిక పాశ్చాత్య సాహిత్య విమర్శ శాస్త్రాల అవగాహన లోతైనది. అందువల్ల ఆయన రచనల నిండా మనకు అనేక రకాలైన అభివ్యక్తి రూపాలు, వర్ణనలు, అలంకారాలూ కనిపిస్తాయి. మచ్చుకు కొన్ని మాత్రమే కింద ప్రస్తావిస్తాను.

ప్రజాపర్వం- పు. 44 : కవిత్వం ఎర్ర గుర్రంలా పరిగెత్తుకు వస్తోంది-రక్తంలో మునిగిన బాణంలా, వీరుడు విడిచిన ప్రాణంలా. (కవిత్వ ధారను పరిగెత్తే ఎర్రగుర్రంతో పోల్చాడు)

పు.42 : చరిత్రలో చెమట ఒక శాశ్వత అంతర్వాహినిలా ప్రవహిస్తూ ఉంటుంది. (శ్రమజీవి చెమట చరిత్రలో అంతర్భాగమని అర్థం)

సూర్యపర్వం, పు. 74 : పిల్లల్ని రాత్రి ముక్కలు వెన్నెల్లో ముంచుకొని కొరుక్కుంటూ తినమంటా.

పశుపర్వం. పు. 113 : కష్టాల్ని కన్నీటిలో ముంచుకొని బిస్కెట్లలా తిం టాను. (కష్టాలను దిగమింగి అనటం పరిపాటి. ఇక్కడవాటిని బిస్కట్లతో పోల్చి వాటిని కన్నీళ్ళలో ముంచుకుని 'తింటాడట' కవి)

పై ఉపమలన్నీ ఎవ్వరూ ఎప్పుడూ వాడనివి. కవిత్వాన్ని 'ఎర్ర గుర్రంతో' పోల్చ డం, 'చెమట' అనేది చరిత్రలో ఒక అంతర్వా హిని, అనడం ఎంత కొత్త పోలికలు! అట్లాగే 'రాత్రి' ని ముక్కలు చేసుకొని, 'వెన్నెల'లో ముంచుకుని 'కొరుక్కు' తినమని పిల్లలతో చెప్తాడు. తాను కూడా కష్టాలను కన్నీటిలో ముంచు కుని 'బిస్కెట్ల వలె' తింటానంటాడు. ఇలాంటివే ఇంకా ఎన్నో ప్రతీకలు ఈయన రచనల నిండా కని పించి, మనల్ని అబ్బురపరుస్తాయి.

ప్రవాహ పర్వమంతా ఆలంకారికమే. ఏ ఒక్క వాక్యమూ వదలాలనిపించదు. చాలా బాగా ఆకట్టుకొని పదే పదే చదివిస్తాయి. చూడండి :

"నేను ఘనీభవిస్తే ఒక నామరూపాత్మక వేగం.
నేను ద్రవీభవిస్తే ఒక జ్ఞాపకాల ప్రవాహం."

"రాజకీయ నాయకుడు ఇరుసుగా- తిరుగుతోంది పత్రికల భాగోతం." (పు. 167, ఆర్మీ పర్వం)

"భాష బోధిస్తుంది పెదవులకు, విచ్చుకునే విద్య" (పు. 193)

"అన్ని నేత్రాలకూ కనిపిస్తుంది, వస్తు జాలం..
కానీ కొన్నింటికే కనిపిస్తుంది
వీటిలో కవిత్వం అనే ఇంద్రజాలం." (ఆర్మీ పర్వం 211). ఇట్లాంటివే అడుగడుగునా అనేకంగా నూత నత్వంతో నిండి ఉన్నాయి.



ఆచార్య అయినవోలు ఉషాదేవి
8500524879

"రైతులారా! రాజకీయ వర్షం పడుతోంది
మోసపోయి మీ విత్తనాలు చల్లకండి" (302) ఇది రాసి ఎంతో కాలం అయింది. అయినా ఇప్పటికీ దీని ప్రాసంగికత పోక పోగా, ఇంకా బలవత్తరం అయింది. ఇట్లా ఉదహరిస్తూ పోతే, శేషేంద్ర కవిత్వంలోని ప్రతీ వాక్యమూ కవితామయమనీ, ఏదీ కూడా వదిలెయ్యలేం అనీ అర్థం అవుతుంది.

ఇక 'జనవంశమ్' అనే అనుబంధ కావ్యంలో కూడా ప్రతీ వాక్యమూ కవిత్వీకరించిన కొటేషనే. కొన్ని ఉదాహరణలు :

"చెట్టుగా ఉంటే ఏదాదికొక వసంతమన్నా దక్కేది.
మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను" (పు. 238)

శేషేంద్ర పదబంధాలు, సమాస కల్పనలు కూడా కొత్తగా, ఆసక్తికరంగా రమణీయంగా ఉంటాయి. ఉదాహరణకు:

'పువ్వెడు వసంతం, రాజకీయ వర్షం, శిల్పించే, మధురించే, రాజకీయ రుతువు; ప్రజాస్వామ్య శిశువు ప్రసవం...; .... ఇట్లా తన కావ్యాల నిండా ఎన్నో కొత్త కొత్త పద బంధాలను, కవితాత్మక పదాలనూ సృష్టించాడు శేషేంద్ర.

ఆయన రచనల్లో విశ్వనాథ కనిపిస్తాడు, శ్రీశ్రీ కనిపిస్తాడు. జాగ్రత్తగా చూస్తే ఒకసారి తిలక్‌నూ, మరోసారి జాషువానూ తలపిస్తాడు.

ఉదా : **ఇది కవిత్వం కాదు. ఇది రక్తంతో,**
కన్నీటితో తడిసిన అక్షరాల గుంపులు.
తుపాకి దెబ్బకు బెదిరి చెల్లా చెదరైపోతున్న
పక్షుల సముహాలు (పు. 115) (ఇది తిలక్ "నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అనే కవితను గుర్తు చేస్తుంది)

కవిత్వంలో రామణీయ కతవల్లనే ఆకర్షణశక్తి, కావ్యత్వం సిద్ధిస్తాయనీ మిగిలిన 'కమిట్‌మెంట్' 'సార్వజనీన శ్రేయస్సు' అనేవి ఔపచారికం అనీ ప్రాక్పశ్చిమ సాహితీ విమర్శకులందరూ చెప్పారనే సారాంశాన్ని తనకవిసేన మేనిఫెస్టో ద్వారా అందించారు. తన మొత్తం సాహిత్యమంతా ఒకేవిధమైన మహాకావ్యమనీ, అందుకే అది 'ఆధునిక మహాభారతం' అనీ నిబద్ధతతో ప్రకటిస్తాడు. తద్వారా, తననూ, తన కావ్యసృష్టినీ ప్రాచీన కవుల సరసన చేర్చుకున్న సమర్థన కనిపిస్తుంది. 'జనవంశమనే అనుబంధ కావ్యంతో 'తనకావ్యయాత్ర' ముగిసిం'దని అవతారికలో (పు.29) చెప్పుకొన్నారు.

ఆయన రచనల్లో పైన చెప్పుకున్న విధంగా ప్రతీ వ్యక్తీకరణ ఆయన సృష్టి, వాటిలో కొన్ని ఎంత వినూత్నం అంటే, ఇతర కవులెవ్వరిలోనూ అలాంటి వాటిని మనం చూడం.

సంప్రదాయ వ్యాకరణ అలంకార శాస్త్రాలనూ, పాశ్చాత్య సాహిత్య విమర్శనూ, మార్క్సిస్టు సిద్ధాంతాలను అధ్యయనం చేసి, తన సాహిత్య ఆలోచనలను మేళవించి తెలుగు సాహితీ విమర్శ లోకానికి అందించిన కొత్త టానిక్ వంటి సైద్ధాంతిక సాహితీ విమర్శ పరికల్పనే 'కవిసేన మానిఫెస్టో'. ఇది 1977లో వచ్చి, సాహిత్య లోకాన్ని ఒక ఊపు ఊపింది.

తన కవిత్వంలో కూడా అక్కడక్కడా సాహి త్యం, కవిత్వం, కవులపై తన అభిప్రాయాలు నిష్క ర్షగా వెల్లడించిన శేషేంద్ర "కవి మొదట అనుభూ తిని కళగా అభ్యాసం చెయ్యాలి, ఆత్మీ కరణని కళగా అభ్యాసం చెయ్యాలి, తర్వాత అభివ్యక్తిని కళగా అభ్యాసం చేయాలి." అనీ వివిధ ప్రాచ్య పాశ్చాత్య విమర్శకులను క్రోడీకరిస్తాడు. (కవిసేన మేనిఫెస్టో పు. 68)

కవిసేన మానిఫెస్టోలో "కవిత్వం బతుకు తెరువు కాదు; జీవన విధానం" అనీ, యువ తరంలో సాహిత్య విద్యార్థుల కోసం వాళ్ళలో ప్రాచ్య పాశ్చాత్యకావ్య తత్త్వ చింతన గురించిన సరియైన అవగాహన కోసం తపించి శేషేంద్ర అందించిన ఈ మేనిఫెస్టో చదవడం ద్వారా ప్రతీ సాహిత్య అభిరుచి కల తెలుగు వాడూ సాహిత్యం పట్ల సరియైన అవగాహన ఏర్పరచుకోగలుగుతాడు, లేదా ఆయన సిద్ధాం తాన్ని ప్రశ్నించగల జ్ఞానం నేర్చుకుంటాడు.

శేషేంద్ర రచనల్లో ఎక్కువమంది పరామర్శిం చని రచనలు ఆయన 'వైజ్ఞానిక రచనలు'. విశ్వ వివేచన, (చైతన్య పరిణామ చరిత్ర), నరుడు- నక్షత్రాలూ, ఊహలో -అనే మూడు గ్రంథాల్లో "భూమి, విశ్వం, నక్షత్రాల గమనం, విజ్ఞానానికి కర్త ఎవరు?, నక్షత్రాలు అలసిపోతే?" వంటి అనేక అంశాల గురించి శాస్త్రీయంగా మనకు తెలియ వస్తోన్న వాటిని వివరించే ప్రయత్నాలు చేశారు. అయితే, వాటిల్లో కొన్ని చోట్ల అంతర్లీనంగా 'జ్యోతిష' సంబంధమైన పరామర్శ నిబిడీకృతమై కనిపిస్తుంది. వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రతిపాదనలను కొన్నింటిని ప్రాచీన భారతీయ తాత్త్విక చింతనతో మేళవించడం జరిగింది. "డబ్బునూ, అధికారాన్నీ నిరసించి, అంతరజ్యోతిని వెలిగింప జేయడం మన సంప్రదాయ వ్యాయ పద్ధతి" అని, తన మార్గం కూడా దానిలో భాగమేనని సూచించారు.

శేషేంద్ర స్వయంగా బహుభాషా వ్యవహర్త అయినా, ఆయన రచనలను ఆయనే అనువాదం చేసుకోలేదు. ఆయన రచనల్లో వాల్మీకి సుందరకాండ తాత్త్విక వ్యాఖ్యానమైన 'షోడశి'ని అదే పేరుతోను, శ్రీహర్ష నైషధ కావ్యా రసావిష్కరణ అయిన స్వర్ణహంసను అదే పేరుతోనూ గురజాడ సూర్య నారాయణ మూర్తి ఇంగ్లీషు లోనికీ, 'సముద్రం నా పేరు' కవితను కె. దామోదరరావు ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. షోడశి హిందీలోకి అనువదించబడింది.

శేషేంద్ర శర్మకు ఉర్దూ కవిత్వంపైనా, ప్రత్యేకించి గజల్ పైనా ఎంతో ప్రీతి. "ఈ నగరం జాబిల్లి" హైదరాబాదు నగర పుట్టుకతో పెనవేసుకున్న కులీకుతుబ్‌షా, భాగమతి ప్రణయ గీతి. 'గజల్ వాతావరణం'తో పై కథను నృత్య నాటికగా రాసి ఇచ్చి తీరాలనే మిత్రుని (పి.యస్. రామారావు) మాట కాదనలేక "గజళ్లలోనే జీవించిన" శేషేంద్ర గజల్‌కు లక్ష్యంగా "ఈ నగరం జాబిల్లి" గీత కావ్యాన్ని రాసి, దీనికి అనుబంధంగా గజల్ లక్షణాలనూ వివరించారు. ఈ వ్యాసాలు చదివితే, ఒక సైద్ధాంతిక వివరణ, చర్చ కూడా ఎంత విలక్షణంగా, ఉద్వేగంగా కూడా చేయవచ్చో తెలుస్తుంది. "గజల్ ఒక అయస్కాంతం, 'ఒక అగ్ని', ఒక రంగుల పక్షి', 'ఒక సంస్కృతి' -అంటూ గజల్ పుట్టుక హైదరాబాదులోనే అని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. గజల్ కవిత ప్రేమలో పుట్టి, శోకం మీద బతుకుతుందని తెలిపాడు. శేషేంద్ర సాహిత్యం, పైన వివరించినట్లు భావుకత, మానవత, ఆధ్యాత్మికతలను మేళవించి భారతీయ, భారతీయేతర తాత్త్వికతలతో కలగలిపి తనసాహిత్యంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించినట్లు ఆయన సాహిత్యం చదివితే మనకర్థమవుతుంది. ఆయన పద్యాన్నీ, వచనకవిత్వాన్నీ, వచనాన్నీ సమానంగా, సమర్థవంతంగా స్వంతం చేసుకుని, తన కవిత్వం ద్వారా వాటికి వినూత్నశక్తిని అందించారు. భారతదేశంలోని రైతుకోసం, శ్రామికుల కోసం, వారి సంక్షేమం కోసం ఆయన సాహిత్యం అధిక స్థానాన్ని ఇచ్చింది.

ఆయన సామాన్య మానవుడికి సమాన న్యాయాన్ని ఎంత ప్రేమించాడో, అంతగా ప్రాచీన భారతీయ సాహిత్య సంప్రదాయాన్ని కూడా అభిమానించాడు, అంతేకాదు ప్రకృతినీ ప్రేమనూ ప్రేమించాడు. అల్పాక్షరాలతో అనల్పార్థాలను సృష్టించిన ఆయన కవిత్వీకరణను అర్థం చేసుకుని, ఆస్వాదించాలంటే, ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యాలను చదివిన జ్ఞానం కొంతలో కొంతైనా అవసరం.

> **శేషేంద్ర వ్యక్తిత్వం, కవిత్వం ఆయన మాటల్లోనే తననితనే విశ్లేషించుకున్న ఈ కింది వాక్యాల ద్వారా అర్థం చేసుకోవచ్చు :**
>
> "కలల వర్తకపు క్యాపిటలిస్టువు నీవు
> - నీకు జ్ఞానం కంటే ప్రేమతోనే పని ఉంది, నీవు కవివి ఓ శేషేన్!
> - విప్లవానికి నీవు ఉదయతారవు!
> - నా పొయెం.... ఒక తిరుగులేని ఆయుధం.
> - "నేనింతే ఒక పిడికెడు మట్టే కావచ్చు,
>
> కానీ కల మెత్తితే నాకు
> ఒక దేశపు జెండా కున్నంతపొగరుంది".
> - నా కవిత్వం మనిషికి, కేవలం ఒక డిఫెన్సు.
> - పోట్లాట నేను బ్రతకడానికి పీల్చే ఊపిరి.
> - నా కవిత్వం ఏ జెండానూ ఎగరేయదు, కానీ నా చేతులు నా దేశ ఖడ్గాలు.
> - ఒక అందమైన పోయెం అంటే దానికి ఒక గుండె ఉండాలి.
>
> అది కన్నీళ్లు కార్చాలి, క్రోధాగ్నులు పుక్కిలించాలి.
> - శేషేన్, నీవు పీడిత ప్రజలకే చెందుతావు
>
> అక్షరమై అందరికీ అందుతావు.
> - ఓ శేషేన్, నీవొకపల్లెటూళ్లో, మొలకెత్తిన ప్రేమ దేవతవు.
> - ఓ శేషేన్, నాకు తెలుసు, నీకు కవిత అంటే ఒకద్రాక్ష, ఒక ఉత్ప్రేక్ష.
> - స్వర్గనరక పేజీలను బాగా తిరగేసిన రుషివివో శేషేన్!
> - నీవొక గడ్డం లేని మహర్షివి, దేవుడు లేని భక్తుడివి."

అంటే తానొకకలల వర్తకపు క్యాపిటలిస్టు, ఒకవిప్లవ ఉదయతార, ఒక పల్లెటూళ్ళో మొలకెత్తిన ప్రేమదేవత, గడ్డంలేని మహర్షి, దేవుడు లేని భక్తుడు, జెండా పొగరు వంటి దేశభక్తుడు. ఇన్ని పరస్పర విభిన్న కవితా రూపాలు, జీవనాంశాలు ఏకాకతిగా మూర్తీభవించిన కవితామూర్తి శేషేంద్రకు ఆయన పుట్టినరోజున సాహితీ ప్రేమికులకు మరోసారి ఆయన రచనలు స్ఫూర్తినిస్తాయని ఆశిస్తాను.

(అక్టోబర్ 20 శేషేంద్ర జయంతి)

సింధూ ప్రజలకు ఏ పంట గురించి తెలియదు?

దీపిక

1. హరప్పా వాసుల ఎత్తు - **5.8 అడుగులు**
2. హరప్పా వాసులు ఏజాతికి చెందినవారు - **కాకసాయిడ్స్**
3. హరప్పా వాసులు ఏ లోహం నువాడలేదు - **ఇనుము**
4. కోట లేదా రక్షణ ప్రహరీ లేని ఏకైక పట్టణం - **చాన్హూదారో**
5. మోహంజదారోలో గోప్ప స్నాన వాటికను కనుగొన్నది - **మార్టిమర్ వీలర్**
6. హరప్పా నాగరికతతో పెద్ద పట్టణం - **రాఖీ గరీ**
7. హరప్పా ప్రదేశాలు ఎక్కువగా వున్న రాష్ట్రం - **గుజరాత్**
8. కాలిబంగన్‌లో ఏమి లభించాయి - **దున్నిన పొలము, చెక్క, నాగలి, ఒంటె ఎముకలు.**
9. Lothal అనగా గుజరాతిలో మృతుల దిబ్బ - **మోహంజోదారో అనగా సింధిలో మృతుల దిబ్బ**
10. ఆధునిక చెస్ బోర్డును పోలిన ఆటవస్తువు లభించిన ప్రాంతం - **లోథల్**
11. త్రాసు లభించిన ప్రాంతం - **లోథల్**
12. హరప్పా లిపిలో గుర్తులు - 1400
13. సింధు నాగరికతను మొదట క్రీ॥శ॥ 1826లో పేర్కొనది - **చార్లెస్ మాజిన్**
14. వాయువ్య భారతదేశంలో రైల్వేలైన్లు వేస్తున్నప్పుడు 1920లో సింధునాగరికత బయట పడింది (కనుగొన్న వారు - దయరాం సహని)
15. సింధు నాగరికతలో అతి పురాతన ప్రదేశం - Bhirrana (రాఖీ గరి)
16. సింధు నాగరికతలో ప్రధాన రేవు పట్టణం - **లోథల్** (సూర్కటాడ, దోలవీర కూడ ముఖ్య రేవు పట్టణాలే)
17. సూర్కటాడ ఎక్కడవుంది - **గుజరాత్‌లోని కచ్ జిల్లాలో రాపూర్‌లో**
18. సింధూ నాగరికత పితామహుడు - **జాన్ మార్షల్**



19. సింధూ ప్రజల దైవం పశుపతి చుట్టు వుండే జంతువులు - **ఏనుగు, పులి, ఒక వైపు నీటి గేదె, ఖడ్గమృగం ఒకవైపు**
20. హరప్పాలో లభ్యమయిన అతి పెద్ద నిర్మాణం - **దాన్యాగారం.**
21. పశుపతి ముద్ర లభ్యమయిన ప్రాంతం - **మొహంజోదారో**
22. సింధు ప్రజలు మొదట మచ్చిక చేసుకొన్న జంతువు - **గొర్రె**
23. సూర్కటాడను కనుగొన్నవారు - Jagat padi Joshi
24. మోహంజోదారోలో లభ్యమయిన నర్తకి కాంస్య విగ్రహం కొలతలు - **10.5CM ఎత్తు 5CM వెడల్పు**
25. గుర్రం ఎముకలు, పళ్ళు లభ్యమయిన ప్రాంతం - **సూర్కటాడ.**
26. మోహంజదారోలో లభ్యమయిన అస్థిపంజరాలు - **37** (అందుకే మోహంజదారోను మృతుల దిబ్బ అని పిలుస్తారు)
27. సింధూ ప్రజలు పవిత్రంగా పూజించిన చెట్టు - **రావి చెట్టు**
28. సింధూ నాగరికతకు హరప్పా నాగరికత అని నామకరణ చేసింది - **సర్ జాన్ మార్షల్**
29. సింధూ ప్రజలు వ్యవసాయం - **అక్టోబర్ - ఏప్రిల్‌లో చేసేవారు (ఈశాన్య ఋతుపవనాల కాలం)**
30. సింధూ ప్రజల ప్రధాన పంట - **బార్లీ**
31. వరి పండించిన ఆనవాళ్లు - **రంగాపూర్, లోథాల్‌లో లభించాయి.**
32. సింధు ప్రజలు వస్తువులను నౌకల ద్వారా ఎథెన్ నుంచి దిల్మన్ (బహ్రెయిన్), మక్రాన్ (సౌది అరేబియా పట్టణం) కు సరుకులు రవాణా చేసి వర్తకం చేసేవారు.
33. సింధు ప్రజలు ముద్రికలును స్టియోలైట్ రాయితో చేసేవారు.
34. అగ్ని ప్రమాదం కారణంగా నశించిపోయిందని భావి స్తున్న సింధు నాగరికత పట్టణం - **కోట్‌డిజి (పాక్‌లో సింధు రాష్ట్రం)**



35. సంధూ ప్రజలు ఎక్కువగా వాడిన లోహం - **రాగి**
36. హరప్పా పట్టణం రావి నది ఒడ్డున వుంది.
37. మొహంజోదారో సింధు నది ఒడ్డున వుంది.
38. 1000 యజ్ఞాలు జరిగిన ప్రదేశంగా పెర్కొన్న పట్టణం - **హరప్పా**
39. వైశాల్యం, జనాభా దృష్ట్యా పెద్ద పట్టణం - **మొహంజోదారో**
40. గణిత శాస్త్ర చిహ్నాలు కల నాగరికత - **సింధూ నాగరకత**
41. హరప్పా శిల్ప నైపుణ్యం దోలవీరలో ఎక్కువగా కన్పించింది
42. బన్వాలిను 1974లో సరస్వతి నది ఒడ్డున R.S బిస్ట్ కనుగొన్నారు.
43. హరప్పా వాసులు పట్టణాల నిర్మాణం గ్రిడ్ పద్ధతిలో వుంది.
44. సుమేరియన్ గ్రంథాలు సింధూ ప్రాంతాన్ని మెలూహ అని వర్ణించబడింది.
45. సింధూ ప్రజలు ఉపయోగించిన రాగి ఖనిజాన్ని ఖేత్రి (రాజస్థాన్), నుంచి పొందేవారు.
46. ప్రపంచంలో మొదటిసారిగా వెండి బయటపడిన దేశం - **ఇండియా**
47. "మొహంజదారో అండ్ ది ఇండస్ సివిలైజేషన్" అనే పుస్తక రచయిత - **సర్. జాన్ మార్షల్**
48. "The Indian Civilization Book" రచయిత - **మార్టిమర్ వీలర్**
49. సతి సహగమన ఆచారం లోథాల్‌లో బయటపడింది.
50. టెర్రకోట బొమ్మలపై ఆవు బొమ్మను ముద్రించబడలేదు.
51. సింధూ ప్రజల వస్త్రాల మూట దొరికిన ప్రాంతం - **ఉమ్మా (మెసపటోమియా నగరం)**
51. పంచతంత్రంలోని నక్క కథలాంటి దాన్ని చెక్కిన జార్ లభ్యమయిన ప్రాంతం - **లోథాల్, కాలిబంగన్**
52. హరప్పాలో లభించిన ఎరుపు రాయితో చెక్కబడిన పురుషుని విగ్రహం యక్షుడుదిగా భావిస్తారు.
53. కాలిన వస్త్ర పీలిక లభించిన ప్రాంతం - **మొహంజోరో**
54. నివాస గృహాల చుట్టూ ప్రహరీలు నిర్మించిన ప్రాంతాలు - **లోథాల్, కాలి బంగన్**
55. సింధూ ప్రజలకు ఏ పంట గురించి తెలియదు - **చెరకు**
56. సింధు ముద్రలపై ఎక్కువగా కనిపించిన జంతువు, చెట్లు - **వృషభం, రావి, వేప**
57. సిరాబుడ్డి దొరికిన ప్రాంతం - **చాన్హూదారో**
58. వ్యవసాయం కోసం నీటిని నిలువ చేసే నిర్మాణాలు - **గబర్ బంద్ (డామ్)**
58. మిని హరప్పా, మిని మొహంజదారో అని దేనిని పిలుస్తారు - **లోథాల్**
59. సింధూ నాగరికత రహదారులు అన్ని గ్రిడ్ విధానంలో Strait గా వుంటే ఒక్క ప్రాంతంలో మాత్రం అస్తవ్యస్తంగా రహదారులు వుంటాయి - **బనవాలి**
60. పులి బొమ్మ వున్న ముద్ర లభించిన ప్రాంతం - **బనవాలి**



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

A-HELP కార్యక్రమం



భారత ప్రభుత్వం, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ విభాగం జార్ఖండ్ రాష్ట్రంలో A-HELP (Accredited Agent for health and Extension of Live stock Production) కార్యక్రమాన్ని ప్రారంభించింది. వ్యాధి నియంత్రణ, జంతుటాగింగ్, పశువుల బీమాకు గణనీయంగా దోహదపడే అక్రెడిటెడ్ ఏజెంట్‌గా మహిళలను నిమగ్నం చేయడం ద్వారా వారిని శక్తివంతం చేయడం. ఈ పథకం ద్వారా రైతులు ఇంటి వద్దకే వెటర్నరీ సేవలను పొందడంతో పాటు పశు సఖీయులకు సాధికారత అందిస్తుంది.

మలేరియా టీకాకు ఆమోదం



కరెంట్ అఫైర్స్

భారత్‌కు చెందిన సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (NII) సహకారంతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ రూపొందించిన మలేరియా టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఆమోదం తెలిపింది. ఇది 3 డోసుల టీకా. మలేరియాపై 75 శాతం ప్రభావవంతంగా పని చేస్తుందని పరిశోధకులు తెలిపారు. 2021లో WHO GNK సంస్థ రూపొందించి టీకాను ఆమోదించింది. అయితే అది 30శాతం మాత్రమే ప్రభావ వంతంగా పని చేస్తుంది.

టిబెట్ హిమనీ నదులను ప్రభావితం చేస్తున్న థార్ ఎడారి ధూళి

భారత్ దేశంలోని థార్ ఎడారి నుంచి వచ్చే ధూళి టిబెటన్ పీఠభూమిలోని హిమనీ నదులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని ఇటీవల ఒక అధ్యయనం కనుగొంది. నేచరల్ క్లైమెట్ చేంజ్ అనే జర్నల్‌లో ప్రచురించ బడిన ఈ అధ్యయనం థార్ ఎడారి నుంచి వచ్చే ధూళి హిమనీ నదాల ఆల్బెడోను తగ్గిస్తుందని నివేదించింది. ఈ ధూళి సూర్యరశ్మిని తిరిగి అంతరిక్షంలోనికి ప్రతిబింబించి తిరిగి హిమనీ నదాలు ఎక్కువ సూర్యరశ్మిని గ్రహించేలా చేసి వేగంగా కరిగేందుకు కారణమవుతుందని పేర్కొంది.




భూకంప హెచ్చరికలు ప్రారంభించిన గూగుల్



వినయోగ దారులకు ముందస్తు హెచ్చరికలు అందించడానికి Andraid భూకంప హెచ్చరిక వ్యవస్థను గూగుల్ ప్రకటించింది. ఈ వ్యవస్థ ఇప్పటికే పలు దేశాల్లో అమల్లో ఉంది. అయితే గూగుల్ ఇప్పుడు దీనికి నేషనల్ డిజాస్టర్ మెనెజ్‌మెంట్ ఆదారిటీ (NDMA), నేషనల్ సిస్మోలజి సెంటర్ (NSC) తో సంప్రదించి భారత్‌కు ఈ విధానంను తీసుకొని వస్తుంది. యాక్సిలోరో మీటర్‌ను సిస్మోగ్రాఫ్‌గా ఉపయోగించి మీ ఫోన్‌ను భూకంప డిటెక్టర్‌గా మార్చడం ద్వారా ఈ సిస్టం పని చేస్తుంది.

భారత్‌లో 42వ యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం - హోయసల దేవాలయం

కర్ణాటకలోని ప్రసిద్ధ హెూయసల దేవాలయాలు యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చిన 42వ ప్రదేశంగా గుర్తించబడింది. 12,13వ శతాబ్దాలలో నిర్మించబడిన హెూయసలల బేలూర్, హళేబీడ్, సోమనాథపుర దేవాలయాలు ఇప్పటికే ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI) రక్షిత స్మారక చిహ్నాలు.



ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూములను అందించిన మొదటి జిల్లా - బరేలి



ఉత్తరప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లను అందించిన మొదటి జిల్లాగా బరేలి నిలిచింది. దేశంలో కూడా ఈ ఘనత సాధించిన మొదటి జిల్లాగా బరేలీ అవతరించింది. ఈ జిల్లా పరిధిలో 2,546 పాఠశాలల్లో 2,483 పాఠశాలల్లో వీటిని అమర్చినట్లు ప్రకటించారు. స్మార్ట్ తగతులు అంటే ప్రొజెక్టర్లు, ఇంటరాక్టివస వైట్ కీ బోర్డుల వంటి డిజిటల్ సాంకేతికతతో కూడిన తరగతి గదులు.

(SHRESHTA) పథకం

భారత ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) విద్యార్థుల కోసం SHRESHTA (లక్ష్యిత ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లోని విద్యార్థులకు రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్) అనే కొత్త పథకాన్ని ఆమోదించింది. శ్రేష్ఠ పథకం ద్వారా నేషనలం టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే జాతీయ స్థాయి పరీక్ష ద్వారా ప్రతి ఏడాది దేశ వ్యాప్తంగా సుమారు మూడు వేల మంది ఎస్సీ విద్యార్థులు ఎంపిక చేయబడతారు.

